# రైతుకూలీసంఘం (ఆంధ్రప్రదేశ్)

## (AIKMKS అనుబంధం)

## రైతుకూలీ రాష్ట్ర సదస్సు ప్రత్యేక సంచిక

2025 జూన్ 18, విజయవాడ




**కార్మిక, కర్షక, విద్యార్థి, మేధావి ఐక్యత వర్ధిల్లాలి**



కా॥ ఎస్.ఝాన్సీ



కా॥ డి. వర్మ



శ్రీ వడ్డే శోభనాద్రీశ్వరరావు



శ్రీ బొజ్జా దశరథరామిరెడ్డి



శ్రీ వై.వి.ఎస్. మహదేవ్



డా॥ ఎన్. వేణుగోపాలరావు



డా॥ కొల్లా రాజమోహన్



శ్రీ అక్కినేని భవానీప్రసాద్



సదస్సుకు హాజరైన ప్రతినిధులు

# రైతుకూలీసంఘం (ఆం.ప్ర)

(AIKMKS అనుబంధం)

## రైతుకూలీ రాష్ట్ర సదస్సు ప్రత్యేక సంచిక

2025 జూన్ 18, విజయవాడ

రైతుకూలీసంఘం (ఆం.ప్ర)

ప్రచురణ

రైతుకూలీసంఘం(ఆం.ప్ర) ప్రచురణ

**రైతుకూలీ రాష్ట్ర సదస్సు ప్రత్యేక సంచిక**

ప్రచురణ కాలం : **2025 జూలై 18**

వెల : **రూ. 50/-**

వివరాలకు :

**కామ్రేడ్ యస్.ఝాన్సి, డి. వర్మ** అధ్యక్ష కార్యదర్శులు

రైతుకూలీసంఘం(ఆంధ్రప్రదేశ్)

తరిమెల నాగిరెడ్డి భవన్,

న్యూ గిరిపురం, విజయవాడ.

*e-mail :* **jhansircsap@gmail.com**

ప్రతులకు :

**మైత్రీ బుక్ హౌస్**

28-9-1, జలీల్‌వీధి,

కార్ల్‌మార్క్స్ రోడ్డు

విజయవాడ - 520 002

# విషయసూచిక

| | |
|---|---|
| **రాష్ట్ర సదస్సు సంక్షిప్త రిపోర్టు** | **3** |
| **వక్తల ప్రసంగ పాఠాలు** | **5** |
| **సౌహార్ద ప్రతినిధుల సందేశాలు** | **39** |
| **తీర్మానాలు** | **42** |

అనుబంధం :

| | |
|---|---|
| **రాష్ట్ర సదస్సు కరపత్రం** | **48** |
| **పోరాడి, భూములు నిలుపుకున్న కర్ణాటక రైతులకు జేజేలు - AIKMKS** | **52** |

## సదస్సు సంక్షిప్త రిపోర్టు :

# ప్రజల సంపదను, భూములను కార్పొరేట్ల పరంచేస్తున్న కేంద్ర-రాష్ట్ర పాలకుల విధానాలపై గళమెత్తుదాం

### రైతుకూలీ రాష్ట్ర సదస్సులో వ్యక్తల ఉద్ఘాటన

కేంద్ర – రాష్ట్ర ప్రభుత్వాల రైతాంగ ప్రజావ్యతిరేక విధానాలను ఎండగడుతూ రైతుకూలీ సంఘం (ఆంధ్రప్రదేశ్) నాయకత్వాన 18-6-2025న విజయవాడ ఎమ్.బి. భవన్‌లో రాష్ట్ర సదస్సు జరిగింది. ప్రజాకళాకారులు ఆలపించిన రైతాంగ విప్లవ గేయాలతో సదస్సు ప్రారంభమైంది. రాష్ట్ర నలుమూలల నుండి 700 మందితో ఒక ఉత్సాహపూరిత వాతావరణంలో సదస్సు జరిగింది. రైతుకూలీ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కా॥ వీరబాబు ప్రతినిధులకు ఆహ్వానం పలుకుతూ వక్తలను వేదికపైకి ఆహ్వానించారు. కా॥ ఝాన్సీ సదస్సుకు అధ్యక్షత వహించగా కా॥ వర్మ అమరవీరులకు సంతాపాన్ని ప్రకటించే తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. అమరులకు జోహార్లర్పిస్తూ సదస్సు ప్రతినిధులు రెండు నిమిషాలు మౌనం పాటించిన తర్వాత ప్రసంగాలు ప్రారంభమయ్యాయి.

ఆంధ్రప్రదేశ్ రైతుసంఘాల సమన్వయ సమితి రాష్ట్ర కన్వీనర్, మాజీ వ్యవసాయశాఖా మంత్రి శ్రీ వడ్డే శోభనాద్రీశ్వరరావు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలను సోదాహరణంగా వివరిస్తూ స్ఫూర్తిదాయకమైన ప్రసంగం చేశారు. (ప్రసంగ పూర్తి పాఠం లోపలి పేజీల్లో..)

రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షులు శ్రీ బొజ్జా దశరథరామిరెడ్డి రాయలసీమలో ప్రజలకు సాగునీరు, త్రాగునీరు అందిస్తున్నామంటూ పాలకులు చేస్తోన్న ప్రకటనలను ఎండగట్టారు. (ప్రసంగ పూర్తి పాఠం లోపలి పేజీల్లో)

కేంద్ర ప్రభుత్వ మాజీ సలహాదారు శ్రీ వైవియస్ మహాదేవ్ మాట్లాడుతూ మోడీగారి ప్రజాస్వామ్య ప్రభుత్వ డొల్లతనాన్ని అనేక ఉదాహరణలతో వివరించారు. (ప్రసంగ పూర్తి పాఠం లోపలి పేజీల్లో)




ప్రజాతంత్రవాది **శ్రీ అక్కినేని భవాని ప్రసాద్** మాట్లాడుతూ రాష్ట్రంలో మైనర్ ఇరిగేషన్ ప్రాజెక్టులను పూర్తిచేసి వ్యవసాయ భూములకు సాగునీరు ఇవ్వాలని కోరారు. (ప్రసంగ పూర్తి పాఠం లోపలి పేజీల్లో)

నల్లమడ రైతు సంఘం నాయకులు డాక్టర్ కొల్లా రాజమోహన్ వ్యవసాయ సంక్షోభం గురించి, రైతాంగ ఆత్మహత్యల గురించి, ముఖ్యంగా వ్యవసాయంలో బహుళజాతి కంపెనీల దోపిడీ గురించి వివరించారు. (ప్రసంగ పూర్తి పాఠం లోపలి పేజీల్లో)

వ్యవసాయ విశ్వవిద్యాలయ విశ్రాంత ఆచార్యులు **డా॥ వేణుగోపాల్‌రావుగారు** చాలా ఆవేదనతో, ఆర్ద్రతతో రైతాంగ సమస్యల గురించి మాట్లాడారు. రైతుకు ఉపయోగపడని, రైతును అప్పుల నుండి కాపాడలేని శాస్త్రవేత్తల అధ్యయన కేంద్రాలు ఎందుకు అని ప్రశ్నించారు. **(ప్రసంగ పూర్తి పాఠం లోపలి పేజీల్లో)**

భారత వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ మర్ల సోమసుందరం గారు వ్యవసాయరంగ సమస్యలు పరిష్కారం కావాలంటే భూ సంస్కరణల ఆవశ్యకత ఉందంటూ వివరమైన సందేశాన్ని రాతపూర్వకంగా పంపించారు. **(ప్రసంగ పూర్తి పాఠం లోపలి పేజీల్లో)**

రైతుకూలీ సంఘం (ఆంధ్రప్రదేశ్) రాష్ట్ర కార్యదర్శి కా|మేడ్ వర్మ మాట్లాడుతూ ఉత్తరాంధ్రలో రైతాంగం ఎదుర్కొంటున్న దుస్థితికి, వలసలకు కారణమైన కేంద్ర, రాష్ట్ర పాలకుల విధానాలను వివరించారు. **(ప్రసంగ పూర్తి పాఠం లోపలి పేజీల్లో)**

ఏఐకేఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కామ్రేడ్ ప్రకాష్, కిసాన్ సంఘటన రాష్ట్ర కన్వీనర్ కామ్రేడ్ మరీదు ప్రసాదు, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నాయకులు కామ్రేడ్ కేశవరావు, ఏఐకెఎఫ్ అధ్యక్షులు కామ్రేడ్ వెంకటరెడ్డి ఈ సదస్సులో సౌహార్ద ప్రతినిధులుగా పాల్గొని సందేశాలిస్తూ ఐక్య ఉద్యమాలు నిర్మించాల్సిన అవసరం ఉందన్నారు. ఏఐఎఫ్‌టియూ(న్యూ) రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు తమ సందేశాలనిస్తూ పనిగంటల పెంపుకి వ్యతిరేకంగా, నాలుగు లేబర్ కోడ్ల రద్దు కోసం కార్మిక సంఘాలు దేశవ్యాప్తంగా సమ్మెకు పిలుపునిచ్చాయని, ఆ పిలుపుని విజయవంతం చేయటానికి కార్మిక సంఘాలతో పాటు రైతు సంఘాలు కూడా సహకరించాలని కోరారు. **(సౌహార్ద సందేశాలు లోపలి పేజీల్లో)**

రైతుకూలీ సంఘం రాష్ట్ర అధ్యక్షులు **కా॥ ఝాన్సీ** ముగింపులో మాట్లాడుతూ సదస్సుకు హాజరై విలువైన సందేశాలు ఇచ్చిన మేధావులకు, రైతుసంఘం నాయకులకూ, సోదర సంస్థలకు ధన్యవాదాలు తెలిపారు. సదస్సులో చర్చించిన ఈ విషయాలను రైతాంగం వద్దకు తీసుకుని వెళ్ళి ప్రజలని చైతన్యవంతుల్ని చేస్తూ కేంద్ర, రాష్ట్ర పాలకులకు వ్యతిరేకంగా పోరాటాలకు సిద్ధం చేయటమే మనముందున్న కర్తవ్యం అంటూ ముగించారు. **(ప్రసంగ పూర్తి పాఠం లోపలి పేజీల్లో)**

పునరావాసం కోసం పోరాడుతున్న పోలవరం నిర్వాసితులకు సంఘీభావంగా రాష్ట్రవ్యాప్తంగా కలెక్టర్ ఆఫీసుల ముందు జూన్ 24న నిరసన కార్యక్రమాలు చేపట్టాలని సదస్సు పిలుపునిచ్చింది. ఇంకా రైతాంగ సమస్యలపై పలు తీర్మానాలు చేసింది. **(తీర్మానాల పూర్తి పాఠం లోపలి పేజీల్లో)**

ప్రజాకళాకారులు జనం పాటలు పాడారు. డప్పు నృత్యం, కోలాటం ప్రదర్శించారు. అంతర్జాతీయ శ్రామిక గీతాలాపనతో సదస్సు ముగిసింది.


# రైతుకూలీసంఘం (ఆం.ప్ర.)

# రాష్ట్ర మహాసభల సావనీర్ - 2024




**పేజీలు : 112**

**వెల : రూ. 50/-**

కాపీలకు :

**మైత్రీబుక్‌హౌస్,**

**జలీల్ వీధి,**

**కారల్‌మార్క్స్ రోడ్,**

**విజయవాడ-2**

## ప్రసంగ పాఠాలు :

### శ్రీ వడ్డే శోభనాద్రీశ్వరరావు,

**రైతుసంఘాల సమన్వయ సమితి, రాష్ట్ర కన్వీనర్**

రైతాంగ – ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈరోజు విజయవాడ మాకినేని బసవ పున్నయ్య భవనంలో



రైతుకూలీ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న ఈ సదస్సుకు అధ్యక్షత వహిస్తున్న సోదరీ ఝాన్సీ గారు, అలాగే ఈ వేదిక పైనున్న డాక్టర్ కొల్లా రాజమోహన్ గారు, బొజ్జా దశరధరామ్ గారు, అక్కినేని భవాని ప్రసాద్ గారు, కార్యక్రమంలో పాల్గొంటున్న అనేకమంది పెద్దలు.... స్నేహితులారా.... ఈ సదస్సు ఉద్దేశ్యం గురించి సోదరీమణి ఝాన్సీ గారు చెప్పారు.

స్వాతంత్ర్యం సంపాదించిన దరిమిలా ఆ స్వాతంత్ర్య సమరంలో ఎనలేని త్యాగాలు చేసి అమరులైనవారి స్వప్నాలకు భిన్నంగా ఈరోజు దేశంలో పరిస్థితులు కొనసాగుతున్న విషయం మీకు వేరే చెప్పాల్సిన అవసరం లేదు. రైతాంగపు, సామాన్య ప్రజానీకపు సమస్యలను, అభివృద్ధిని, తగినంతగా పాలకులు పట్టించుకోలేదు. అవసరమైన కార్యక్రమాలు తగినంతగా తీసుకోలేదు. అలాగే బాబాసాహెబ్ అంబేద్కర్ సారధ్యంలో వివిధ దేశాల్లోని రాజ్యాంగాలని అధ్యయనం చేసి మనకి మనం ప్రసాదించుకున్న హక్కులు, ఆ రాజ్యాంగ లక్ష్యాలకు చాలా దూరంగా వెళ్ళిపోతున్న పరిస్థితి ఈరోజు చూస్తా ఉంటే చాలా బాధగా ఉంది.

గత పది ఏళ్లుగా కేంద్రంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం చాలా దుర్మార్గమైన పరిపాలన చేస్తా ఉంది. రైతాంగ సామాన్య ప్రజల ప్రయోజనాలని కార్పొరేట్ సంస్థలకి, ఆశ్రిత పెట్టుబడిదారులకు కట్టబెడతా ఉంది. అత్యంత బాధాకరమైన విషయం ఏంటంటే.... భారత రాజ్యాంగాన్ని తుంగలో తొక్కి, అడవుల్లో నివసిస్తూ తరతరాలుగా అడవులను కాపాడుకుంటూ వస్తూ, దేశంలో పర్యావరణాన్ని కాపాడుతూ వస్తున్న ఆ ఆదివాసీ ప్రజలను ఆ అడవుల నుండి గెంటివేసి భయభ్రాంతులను చేసి ఆ అటవీ సంపదను, అత్యంత విలువైన ఖనిజాలని, బొగ్గును, ఇనుముని కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టడం కోసం, మావోయిస్టుల్ని తుద ముట్టిస్తున్నామనే సాకుతో అత్యంత దుర్మార్గంగా ఆపరేషన్ కగార్ అనే పేరు మీదుగా భారత సైన్యాన్ని ఉపయోగించి భారత ప్రజలనే పిట్టలను కాల్చేసినట్టు కాల్చేస్తా ఉన్నారు. మావోయిస్టు సంస్థలతో సంబంధం లేని గిరిజనులను కూడా చంపేస్తూ ఉన్నారు. దానికన్నా కూడా ఆక్షేపితమైన విషయం ఏమిటంటే... చనిపోయిన వారి శవాలను వారి కుటుంబ సభ్యులకు అందజేయమనే కోర్టుల సూచనను కూడా పాటించకుండా, కడచూపుకు కూడా నోచుకోకుండా చేస్తున్నారు. వారి పట్ల అభిమానం ఉన్న ప్రజలు అక్కడికి వెళ్లి శ్రద్ధాంజలి ఘటించే అవకాశం కూడా ఇవ్వని ఒక నియంతృత్వ పరిపాలన ఈరోజు సాగుతూ ఉంది. కమ్యూనిస్టు సానుభూతిపరులే కాదు మానవత్వం, హృదయం, ఆలోచించే మనసు ఉన్న ఎవరైనా బాధపడే పరిస్థితుల్లో ఈ రోజు పరిస్థితులు కొనసాగుతూ ఉన్నాయి.

ఈ పరిస్థితి ఎందుకు ఏర్పడుతున్నది అనే విషయాన్ని ప్రజలు ఆలోచించాల్సిన అవసరం ఉంది. అంతటి హత్యాకాండ జరపడానికి పాలకులకి ఆ హక్కు ఎక్కడిది? వెనకటికి నక్సల్‌బరి పోరాటంలో..... ఆ రోజుల్లోనే శ్రీకాకుళం జిల్లాలో.... భూస్వాములు, పెట్టుబడిదారులు, వడ్డీ వ్యాపారస్తుల ఆచూకీ కనుక్కొని కొందరిని కమ్యూనిస్టులు చంపిన మాట వాస్తవమే. కానీ, అటువంటి హింసాత్మక ఘటనలే కాకుండా ప్రజలను చైతన్యపరచి, తమ సిద్ధాంతాలకి అనుగుణంగా కూడగట్టే కార్యక్రమాలు చేస్తా ఉన్నారు. కానీ, అక్కడ భారత రాజ్యాంగ చట్ట ప్రకారంగా ఆ గిరిజనులకు, ఆదివాసీలకు ఉన్న హక్కులైన... వారు సాగు చేసుకుంటున్న భూములపైన వారికి హక్కు, అలాగే అటవీ ఉత్పత్తుల పైన వారికి హక్కు... ఇవన్నీ ఉంటే,

వారిని అక్కడ నుంచి బలవంతంగా పంపించేయడమే కాదు, వారికి జీవించే హక్కు కూడా లేకుండా చేస్తున్నారు. లోగడ కాంగ్రెస్ పార్టీ కూడా ఇంత స్థాయిలో కాకున్నా, ఇలాంటి పనులు చేసినవారే. సాల్వాజుడుం పేరుతో ఒక ప్రైవేటు సైన్యాన్ని తయారుచేసి మావోయిస్టులకు వ్యతిరేకంగా ఈ కార్యక్రమాలు సాగించినవారే. ఆ తర్వాత పార్లమెంట్‌లో ప్రాతినిధ్యం ఉన్న సోకాల్డ్ లెఫ్టిస్ట్ పార్టీలు కూడా, బలమైన పార్టీలు కూడా, సుప్రీంకోర్టు తలుపు తట్టి మావోయిస్టుల్ని ఇంత దుర్మార్గంగా చంపుతున్నారని, ఆ పేరు మీదుగా వాళ్లు తప్పు చేస్తే తప్పు చేశారు అని కోర్టుకి తెలియపరచి కోర్టు ద్వారా యాక్షన్ తీసుకోవాలి తప్ప, వారిని చంపే హక్కు మీకు ఎక్కడ నుండి వచ్చింది అని ప్రశ్నించకపోవడం వల్లనే ఇంత జరిగింది. ఇందాక సోదరులు అమరులకి శ్రద్ధాంజలి తీర్మానం పెట్టారు. ఎవరో కొద్దిమందికే జరిగింది అనుకుంటే, భవిష్యత్తులో మనం తిరిగి వెనక్కి జర్మనీలో హిట్లర్ టైంలో ఏం జరిగిందో అదే పరిస్థితి మనదేశంలో కూడా జరగబోతుందని తెలియజేస్తున్నాను.

ఇప్పటికే ఈ దేశంలో ఒక అప్రకటిత ఎమర్జెన్సీ నడుస్తూ ఉంది. తమకు వ్యతిరేకంగా మాట్లాడేవారు తమ అవినీతి కార్యక్రమాలను గాని, తమ తప్పుడు విధానాలను గాని ఎండగట్టి మాట్లాడే వ్యక్తులను అర్బన్ నక్సల్స్ అనే ఒక బ్రాండ్ వేసి చర్యలు తీసుకునే ఆలోచనలను కూడా ప్రభుత్వం చేస్తూ ఉంది. ఈ విషయాలను గమనించుకొని ప్రజలందరూ కూడా కుల, మత, ప్రాంతీయ తత్వాల కతీతంగా ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించుకోవాల్సిన అవసరం ఉంది. అప్పుడే సమాజంలో రైతులకు గాని, కూలీలకు గాని, పేదలకు గాని, బలహీన వర్గాలకు గానీ, తాడిత పీడిత వర్గాలకు కానీ న్యాయం జరిగే అవకాశం వుంటుంది.

ముఖ్యంగా ఈనాడు సమాజంలో, దేశంలో ఎక్కువ సంఖ్యలో ఉన్న రైతులు, కూలీలు, కౌలు రైతులు శ్రమించి సంపద సృష్టిస్తూ వున్నారు. బ్రిటిష్ పరిపాలనా కాలంలో తెల్లవాళ్ళు మన దేశాన్ని కొల్లగొట్టుకుపోయారు. స్వాతంత్ర్యం వచ్చే నాటికి దేశం కరువుతో బాధపడతా ఉంది. అటువంటి పరిస్థితుల్లో మళ్ళీ మన భారతదేశంలో రైతులు, రైతు కూలీలు, కౌలు రైతులు కష్టపడి ఎండనక వాననక ఆరుగాలం శ్రమిస్తూ ఈ దేశానికి ఆహారాన్ని సమకూర్చడమే కాకుండా ఇతర దేశాలకు ఎగుమతులు చేసి విదేశీ మారకద్రవ్యాన్ని సంపాదించేటందుకు కృషి చేస్తా ఉన్నారు. అయితే ముందు నుంచి కూడా మనదేశంలో దురదృష్టం ఏమిటంటే, అధికారంలో ఉన్న వారందరూ కూడా, కొద్ది మినహాయింపులు తప్ప రైతాంగానికి సరైన న్యాయం చేయలేదు. కారణమేంటంటే రైతాంగానికి సరైన స్థాయినిచ్చి వ్యవసాయం లాభసాటిగా సాగనిస్తే వ్యవసాయం లాభదాయకంగా ఉంటే, వినియోగదారులు, వ్యవసాయధారిత పరిశ్రమలలోని కార్మికులు అదనంగా వేతనాల కోసం ప్రభుత్వం మీద డిమాండ్ చేస్తారు. కాబట్టి ఎంతవరకు వీలైతే అంతవరకు తక్కువ ప్రతిఫలమే వాళ్లకు అందేటట్టుగా చేయాలి అనే ఒక స్పష్టమైన ఎజెండాతో జరుగుతా ఉంది.

అందువల్లనే రైతాంగానికి మినిమం సపోర్ట్ ప్రైసెస్ లెక్కించే విధానం రూపొందించే దాంట్లోనే లోపం ఉంది. అది నేను చెప్పటం కాదు, స్వామినాథన్ కమిషన్‌లో చెప్పారు. వాటిని పునః సమీక్షించాలి, పునర్నిర్వచించాలి అని కూడా ఆయన చెప్పారు. స్వామినాథన్ కమిషన్ నియమించే నాటికి అనేక లక్షల మంది రైతులు ప్రత్యేకంగా పత్తి రైతులు, కౌలు రైతులు, బలహీన వర్గాలకు సంబంధించి వారు తీవ్ర రుణ భారంలో కూరుకుపోయారు. వ్యవసాయమే సంక్షోభంలో కూరుకుపోయిన పరిస్థితుల్లో అందరితో మాట్లాడి డా॥ స్వామినాథన్ చాలా బ్రహ్మాండమైన రిపోర్టుని 2006లో ఇచ్చారు. కమిషన్ నియమించిన కాంగ్రెస్ పార్టీ వాళ్లు, ఆ రిపోర్టును ఆమోదించి అమలు చేయడం తర్వాత సంగతి, కనీసం పార్లమెంట్‌లో చర్చకు కూడా పెట్టలేదు. అందులోని కొన్ని చిన్న చిన్న రికమండేషన్స్‌ను ఆమోదించారు తప్ప, అసలు ప్రధానంగా ఉన్న రికమండేషన్.... 'సమగ్ర పంటల ఉత్పత్తి విధానం' అమలు చేస్తే అప్పుడే రైతు ఆత్మగౌరవంతో నిలబడగలుగుతాడు; తన అవసరాలు తీర్చుకోగలుగుతాడు.

మన భారతదేశం ప్రధానంగా వ్యవసాయ దేశంగా ఉంది, కానీ మీరు ఆశ్చర్యపోతారు, బాగా పారిశ్రామికంగా అభివృద్ధి చెందిన యూరోపియన్ దేశాలు 27 దేశాలు కలిపి 'కామన్ అగ్రికల్చరల్ పాలసీ' (సిఏపి) అనే పాలసీతో రైతులకు లాభం చేకూరుస్తున్నారు. అట్లాగే జపాన్.... ప్రపంచంలో పారిశ్రామికంగా గాని, ఎలక్ట్రానిక్స్‌లో గాని అభివృద్ధి అయింది. ఆ దేశంలో రెండో ప్రపంచ యుద్ధం తర్వాత ఒక నిర్ణయం తీసుకున్నారు. ఏమిటంటే, ఇతర

రంగాలలో ప్రజల యొక్క ఆర్థిక స్థోమత ఏ రకంగా ఉంటుందో దానికి అనుగుణంగానే వ్యవసాయ రంగంలో ఉన్న వాళ్ళ ఆర్థిక పరిస్థితి కూడా మెరుగయ్యేందుకు 'బేసిక్ అగ్రికల్చరల్ లా' అనే ఒక పాలసీ పెట్టుకున్నారు. దాంతోపాటు వాళ్లు వీలైనంతవరకు ఇతర దేశాల నుండి దిగుమతులు చేసుకోకుండా ఆహారానికి సంబంధించి తమ దేశంలోనే పండించుకోవాలి, తమ దేశంలో కొనసాగించుకోవాలని డబ్ల్యూటీవోలో పాడి విషయంలో కూడా చివరి వరకూ చాలా పట్టుబట్టారు. జపాన్ దేశంలో ప్రపంచ మార్కెట్ మొత్తం మీద నాలుగు రెట్లు ఎక్కువ చెల్లించి రైతు సంఘాల దగ్గర నుంచి కొంటారు. ఎందుకంటే, ఆ ధాన్యం పండిస్తున్న రైతుల ఆదాయం పరిశ్రమలలో పని చేసే ఉద్యోగులకు కానీ, వాళ్ళ ఆదాయాలకు గానీ క్యుములేటివ్‌గా దగ్గరగా ఉండాలనే దాంతో వాళ్ళు ఆ ధర చెల్లిస్తారు. వాళ్లు రైతులకు కొంత ఎక్కువ ధర చెల్లించి ప్రపంచ దేశాలకు ఎగుమతి చేస్తున్నారు. ఆ విధంగా ఇతర అనేక దేశాల్లో వాళ్ళు ప్రధానంగా వ్యవసాయాన్ని కాపాడుకోవాలి, పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలి అనే దృక్పథంతో వున్నారు.

ఇక్కడ మన ప్రభుత్వాలు సరైన నిర్ణయాలు తీసుకోక పోవడం వలన రైతాంగానికి తీవ్రమైన నష్టం జరుగుతోంది. నేను చెప్పటం కాదు; టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్ (టిఐఎస్ఎస్) మన హైదరాబాదులో ఉంది. వాళ్లు అధ్యయనం చేశారు, సర్వే చేశారు. దాని ప్రకారంగా 1997 నుంచి 2008 వరకు మనదేశంలో రైతులు పెట్టిన వాస్తవ ఖర్చు మీద 38 శాతం తక్కువ తిరిగివస్తోంది. దాని మూలంగా ఆ రోజుల్లో అప్పట్లోనే దేశం మొత్తం మీద దాదాపు లక్షా పదివేల కోట్లు రైతాంగానికి నష్టం జరిగింది. అట్లాగే ఓఈసిడి, ఐసిఆర్ అండ్ ఈఆర్ లు చాలా ప్రసిద్ధి చెందిన సంస్థలు. వీరు చెప్పిన దాని ప్రకారం 2000 సంవత్సరం నుండి 2017దాకా ప్రధానంగా ఆంధ్రదేశంలో 23 బట్టల పరిశ్రమలకు 48లక్షల కోట్ల రూపాయల నష్టం జరిగింది. సంవత్సరానికి దాదాపు 3 లక్షల కోట్లు ఎలా నష్టం జరిగిందో?

అందుకనే సంయుక్తకిసాన్ మోర్చా ఆధ్వర్యంలో దేశంలో రైతాంగం 540 రైతు సంఘాల ఆధ్వర్యంలో ఢిల్లీలో 13 మాసాల పాటు వుద్యమం సాగించారు. స్వామినాథన్ కమిషన్ ప్రకారంగా సమగ్ర పంటల ఉత్పత్తి వ్యయానికి 50 శాతం కేంద్ర ప్రభుత్వం వెచ్చిస్తే, పండించే రైతుకి ఒక ఎకరానికి అదనంగా 17 వేల రూపాయల ఆదాయం వస్తుంది. పత్తి పండించే రైతుకి ఎకరానికి 15 వేల రూపాయలు ఆదాయం వస్తుంది. వేరుశెనగ పండించే రైతులకు 11,200; అపరాలు పండించే రైతుకి 7500 ఈ విధంగా రైతాంగానికి అదనంగా ఆదాయం చేకూరి వాళ్ళ కొనుగోలు శక్తి పెరుగుతుంది. కొనుగోలు శక్తి పెరిగినప్పుడు వస్తువులు కొనుక్కోగలుగుతారు. ఎప్పుడైతే కొనుగోలు శక్తి పెరుగుతుందో, ఉత్పత్తి రంగం అభివృద్ధి చెందుతుంది. ఓవరాల్‌గా ఎకానమీ అభివృద్ధి అవ్వడానికి వ్యవసాయ రంగం కూడా అభివృద్ధి అవ్వాలి.

ఇలాంటి అభివృద్ధికి చర్యలు తీసుకోకుండా, కోట్లాదిమంది ప్రజల కొనుగోలు శక్తి పెరిగేందుకు చర్యలు తీసుకోకుండా, దేశాన్ని ముందుకు తీసుకెళతాం అని చెప్పే మాటలన్నీ కూడా నీటి మీద రాతలే అవుతాయి. ప్రధానంగా కౌలు రైతులకు, సన్నకారు, చిన్న రైతులకు బ్యాంకుల్లో రుణం ఎక్కడ వస్తోంది....? నేను చెప్పడం కాదు, నాబార్డ్ చెబుతావుంది. దేశంలో సన్న కారు, చిన్న కారు రైతాంగం 24 శాతం మంది వడ్డీ వ్యాపారస్తుల దగ్గర అప్పులు తీసుకోవాల్సి వస్తున్నది. మూడు రూపాయల వడ్డీకి అన్న మాట. 2018లో ఢిల్లీలో ఆల్ ఇండియా కిసాన్ సంఘర్ష్ కోఆర్డినేషన్ కమిటీ ఆధ్వర్యంలో 250 రైతు సంఘాల ఆధ్వర్యంలో సమావేశం, ర్యాలీ నిర్వహించి భారత ప్రభుత్వాన్ని.... 'అయ్యా ఆ స్వామినాథన్ కమిషన్ రికమండేషన్ అమలు చేయి, అట్లాగే ప్రస్తుతం రైతాంగం నష్టపోయారు, వాళ్లు అప్పులు కట్టలేకపోతున్నారు, ఒక పర్యాయం రుణమాఫీ చెయ్యి, అట్లాగే కేంద్రం పార్లమెంట్లో పంట రుణ మాఫీ ఉపశమన చట్టం చేసి అన్ని రాష్ట్రాల్లో అమలు చేసినప్పుడే రైతాంగపు ఆత్మహత్యల పరంపర ఆగుతుందని చెప్పాం. కానీ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ దగ్గర నుంచి వులుకు పలుకులేదు. దానివల్లనే మళ్లీ ఇంకా అన్ని రాష్ట్రాల నుంచి రైతు సంఘాలు పెద్ద ఎత్తున ఢిల్లీలో ఆందోళన సాగించాయి. మండుటెండ, చలి, వర్షం వీటన్నిటిని తట్టుకొని ఆందోళన చేస్తే దానిపై అన్ని రకాల నిర్బంధాల్ని ప్రయోగించారు. 720 మంది చచ్చిపోయారు. అయినా ఉద్యమం కొనసాగింది, జలఫిరంగులని వాడారు. చివరికి చెవులు చిల్లులు పడేటట్లు శబ్ద డ్రోన్లు కూడా వాడారు దుర్మార్గులు. అయినా వెనక్కి తగ్గలేదు. ఉద్యమం

కొనసాగింది. చనిపోయిన వారికి ఊర్లలో, పంజాబ్‌లో, హర్యానాలో అంత్యక్రియలు నిర్వహించారు. కానీ కుటుంబ సభ్యులు ఉద్యమంలో ఉంటూనే దాన్ని కొనసాగించారు.

ఎందుకు చెప్తున్నానంటే, ప్రజాస్వామ్యంలో ప్రజల చేత, ప్రజల కొరకు, ప్రజల యొక్క పాలన అని చెప్తున్నా, తామే రాతపూర్వకంగా ఇచ్చిన హామీని తుంగలో తొక్కారు. ఎన్నోసార్లు ఈ డిమాండ్లను ముందుకు తీసుకువస్తున్నాం. అయినప్పటికీ కూడా పట్టించుకోకపోగా, ఇప్పుడు కొత్తగా ఎన్‌పిఎఫ్ఏఎమ్ అనే నూతన విధానం తీసుకురావటం కోసం కార్యక్రమాలు చేస్తా ఉన్నారు. దాంతో అసలు మద్దతు ధరలు, ఇదివరకే కొన్ని రాష్ట్రాల్లోనైనా మార్కెట్ కమిటీల్లో MSP లకి అమ్మితే, అక్కడ వాస్తవికంగా అమ్మే ధరకి ఉన్న తేడాని ధరల స్థిరీకరణ నిధి నుంచిభర్తీ చేసి రైతులకి అందజేసే విధానం ఉండేది. ఇప్పుడు మార్కెట్ ఇంటర్వెన్షన్ స్కీం అనేదాన్ని కూడా మోడీపక్కన పెట్టాడు. పంటల ఇన్సూరెన్స్ స్కీమ్ పెడతామంటున్నాడు. ఆ స్కీములో రైతులంతా చేరితే ఆ ఇన్సూరెన్స్ స్కీము ద్వారా రైతులు లాభపడతారు అని చెబుతున్నారు. స్వతంత్రం వచ్చిన చాలాకాలం తర్వాత, రాజీవ్ గాంధీ ప్రధానమంత్రిగా ఉన్నప్పుడు నేను ఎంపీగా ఉండగా, బలరాం జక్కర్ వ్యవసాయశాఖ మంత్రిగా వుండగా, కార్పొరేషన్ స్కీమ్ అనేది మొదలై, ఆ తర్వాత నేషనల్ అగ్రికల్చరల్ ఇన్సూరెన్స్‌కి లింక్ అయింది. ఇక మోడీ గారు వచ్చిన తర్వాత ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన చేశారు. దాని నిర్వహణ ఎట్లా ఉందంటే, అది రైతులకు మేలు చేయదు, ఆ ప్రైవేట్ ఇన్సూరెన్స్ కంపెనీలకి ఉపయోగ పడుతుంది. తాజాగా గత సం॥ 9 కోట్ల 75 లక్షల మంది రైతులు 1500 కోట్ల రూపాయలు ప్రీమియంగా కట్టారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి 1900 కోట్ల రూపాయలు ప్రీమియంగా కట్టారు. వీళ్లు ఎంతమందికి బీమా ఇచ్చారంటే 45 లక్షల మందికి, 4500 కోట్లు మాత్రమే ఇచ్చారు. ఆలోచించండి, కంపెనీలు ఎంతగా లాభపడుతున్నాయో! ఈ విధంగా ఇన్సూరెన్స్ స్కీమ్ నడుస్తా ఉంది. ఇది చాలా దుర్మార్గం.

ఒకవైపు అదే ప్రభుత్వం బడ్జెట్‌లో కార్పొరేట్ కంపెనీలకు తేరగా రాయితీలు ప్రకటిస్తా ఉంది. ఇన్‌కమ్ టాక్స్ రాయితీ, కార్పొరేట్ టాక్స్ కూడా తీసివేసింది. ప్రభుత్వం ఏటా లక్షన్నర కోట్ల రూపాయలు ధనిక వర్గాలకి మేలు చేస్తున్నది. సన్న, చిన్న కారు రైతులు భారత దేశంలో నూటికి 86 శాతం మంది, రెండు హెక్టార్ల కన్నా తక్కువ భూమి ఉన్న రైతులు 90 శాతం మంది ఐదు హెక్టార్ల కన్నా తక్కువ ఉన్న వారు. వీళ్ళకి న్యాయం చేయాలి, వీళ్ళకి సహాయం చేయాలి, అనే బుద్ధి జ్ఞానం లేకుండా ప్రభుత్వం ఎంతసేపూ ఆ కార్పొరేట్ సంస్థలకి సేవ చేస్తా, వాళ్లకు ఊడిగం చేస్తా వుంది. రాజ్యాంగంలో ఉత్పత్తి సాధనాలు, ప్రభుత్వ సంపద కొద్దిమంది చేతుల్లో కేంద్రీకృతం కారాదని, దేశ ప్రజలందరికీ ఉపయోగపడాలనే విధంగా ఆదేశిక సూత్రాల్లో ఉంటే, దాన్ని పూర్తిగా తుంగలో తొక్కేసి మోడీ ధనిక వర్గాలకు, అదానీకి, అంబానీకి మేలు చేస్తా ఉన్నాడు, అన్ని విషయాల్లో. ఒకటి కాదు, రెండు కాదు, 14 పోర్టులు అదానీకు ఇచ్చాడు. 8 ఎయిర్‌పోర్టులు వాళ్ల కింద ఉన్నాయి. భూగర్భంలో ఉన్న 272 కోట్ల టన్నుల బొగ్గు గనుల్ని వాళ్ళకి ఇచ్చాడు. ఈ విధంగా దేశ సంపదని ధారాదత్తం చేస్తున్నాడు. అతను ప్రధానమంత్రి అయ్యే నాటికి అదానీల యొక్క ఆస్తుల విలువ సుమారు 50 వేల కోట్ల రూపాయలు. కానీ, ఇవాళ వారి ఆస్తి లక్షల కోట్ల రూపాయలకు పెరిగిపోయింది. ఈ ఏడాది గ్రాస్ లాభం 90 వేల కోట్లు. నికర లాభం 40 వేల కోట్ల రూపాయలు. చూడండి ఎంత దుర్మార్గంగా ఉందో పరిస్థితి. అట్లాగే ముఖేష్ అంబానీ వాళ్లకి, జియోకి రాయితీలు ఇచ్చాడు. ఎప్పటినుంచో ఉన్న మన బిఎస్ఎన్ఎల్‌ను బంద్ చేసి, ముందుగా వాళ్లకి పర్మిషన్ ఇవ్వటం ద్వారా కృత్రిమ మార్గాల ద్వారా మొత్తం మార్కెట్‌ని ఆక్రమించి ఆవిధంగా ప్రభుత్వరంగ సంస్థల్ని పూర్తిగా నిర్వీర్యం చేస్తున్నారు. 'డీ-మానిటైజేషన్' పేరు మీదగా ప్రైవేటు వైపుకు తీసుకెళ్తున్నారు. అయితే ప్రభుత్వం ఉన్నది, వ్యాపారం చేయటానికి కాదు అంటాడు మోడీ. విశాఖ ఉక్కుతో సహా ప్రభుత్వ రంగం సంస్థలని ప్రైవేటు వాళ్లకి ధారాదత్తం చేయడానికి ఎవడిచ్చాడు మోడీకి హక్కు అని ప్రశ్నిస్తున్నాను. ఈ రకంగా దుర్మార్గంగా ప్రైవేటు వాళ్లకి కట్టబెడతా ఉంటే మనం చూస్తూ ఎంత కాలం ఊరుకోవాలి? ప్రజలంతా ఆలోచించాలని నేను మనవి చేస్తున్నాను.

విద్యుత్ రంగంలో ఏం జరుగుతుంది? కరెంట్ బిల్లులు ఎట్లా వస్తున్నాయి? గతంలో కాల్చిన కరెంటు, ఎప్పుడెప్పుడో కాల్చిన కరెంటు ఇప్పుడు బిల్లులో వస్తూ ఉన్నాయి. జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం, మోడీ హయాంలో

ఉన్నప్పుడే కోవిడ్ తోటి ఈ దేశం అంతా అల్లకల్లోలమై పోయింది. వాళ్లకి సరైన సదుపాయాలు అందించకుండా లక్షలాదిమంది చనిపోవడానికి కారకుడైన దుర్మార్గుడు మోడీ. ఆ రోజుల్లో ఒక కంప్లీట్ లాక్‌డౌన్ పెట్టి కోట్లాదిమంది ప్రజలు వలస పోయే పరిస్థితిని కల్పించాడు. ప్రజల్ని నానా అవస్థలు పెట్టాడు. ఆకలితో చచ్చిపోయే పరిస్థితి తెచ్చాడు. అటువంటి స్థితిలో రోడ్లమీదకి జనం వచ్చే అవకాశం లేని స్థితిలో విద్యుత్ బిల్-2020 ని ముందుకు తెచ్చాడు? ఇందులో ఏముంది? రైతులకి, సామాన్య ప్రజలకి ఇచ్చే సబ్సిడీని ఎత్తివేయాలి అని ఉంది. దీన్ని రైతు సంఘాలతో చర్చించే పార్లమెంట్‌లో ప్రవేశపెడతాను అని మొదట చెప్పాడు. కానీ అలా జరగలేదు. దానిలో ఉన్న అంశాలన్నీ ఇప్పటికే మోడీ అమలుచేస్తా వున్నాడు.

ఇప్పుడు పెద్ద పెద్ద ప్రాజెక్టులు కట్టాలంటే వందలు, వేల కోట్లు ఖర్చు అవుతుంది. పదేళ్లు, 20 ఏళ్ళు, 30 ఏళ్లు కూడా పడుతూ ఉంది. రైతు తన శ్రమతో, తను గింజలు వేసి, తన పంట పండించి ఈ దేశాన్ని బతికిస్తున్నాడు. అతడికి ఎవరు చేస్తున్నారు మేలు? కాబట్టి, అతనికి కదా ప్రభుత్వం సబ్సిడీ ఇవ్వాల్సింది. దానిని దృష్టిలో పెట్టుకొని ఉచితంగా గాని, తక్కువ రేటుకు గాని రైతులకు కరెంటు అందించాలి అని చెప్పిన మహానుభావుడు కేఎల్ రావు గారు. అన్నగారేమో 50 హెచ్‌పి ఫ్రీ అంటే, రాజశేఖర్ రెడ్డి వచ్చి రైతులకు ఫ్రీ కరెంట్ అన్నాడు. ఇవన్నీ తీసేయాలంటాడు మోడీ. అదానీకి మేలు చేయాలంటాడు. అదానీకి ఈ దేశంలో 15 వేల మెగా వాట్ల థర్మల్ పవర్ ప్రాజెక్టులు ఉన్నాయి. 12 వేల మెగావాట్ల సోలార్ పవర్ ఉంది. 45 వేల మెగావాట్ల సోలార్ పవర్ తయారు చేయాలనేది వాళ్ళ యొక్క లక్ష్యం. అంటే ఈ దేశంలో ఈ పెట్టుబడుల పేరుతోటి విద్యుత్ రంగంలో వచ్చే లాభం, ఆదాయం ప్రధానంగా పొందేవారిలో అదాని నెంబర్ వన్. ఇవాళ పాత గవర్నమెంట్‌లో జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వ హయాంలో స్మార్ట్ మీటర్ల కోసం షిరిడి సాయి అనే సంస్థ కాంట్రాక్టు కుదిరింది. దీంట్లో కొన్ని వేల కోట్ల రూపాయల అవినీతి జరిగింది. స్మార్ట్ మీటర్లు తీసుకొచ్చి ఏర్పాటు చేయడంలో ఇంకా పెద్ద అవినీతి జరిగింది అని ఎవరు అన్నారు? తెలుగుదేశం పార్టీ, చంద్రబాబునాయుడు గారు. తెలుగుదేశం పార్టీ వారు కోర్టులో దావా వేశారు, సిపిఐ రామకృష్ణగారు కూడా దావా వేశారు. ఇంకొక ఆయనేమో స్మార్ట్ మీటర్లు పగలగొట్టి పారేయండి అన్నారు. కానీ మన చంద్రబాబు గారు ఏం చేస్తున్నారు... ఆరోజు ఏ షిరిడి సాయి కంపెనీతో అయితే ఒప్పందం జరిగిందో ఆ ఒప్పందం మేరకే దాన్ని చంద్రబాబు గారు కూడా అమలు చేస్తున్నారు. కానీ ఆరోజు ఏమన్నారు? ఇది చాలా అన్యాయం, దీనికి ఒప్పుకోకూడదు, ఇలా జరగకూడదు, ఈ ఒప్పందానికి మేము వ్యతిరేకం అన్నారు. కానీ ఇవాళ దాన్నే అమలు జరపుతూ ప్రజల ముక్కుపిండి వసూలు చేయటం మీ అందరికీ అనుభవంలోకి వచ్చింది. ఆ విధంగా జరిగిపోతూ ఉంది. అందుకే నాకు ఆశ్చర్యం వేసింది. ఇప్పుడు కొత్తగా ఇండోసోల్ అనే ఆ షిరిడి సాయి కంపెనీకి సంబంధించిన సోలార్ పవర్ ఉత్పత్తి చేసే కంపెనీకి రామాయపట్నం దగ్గర వేల ఎకరాల భూమిని అప్ప చెప్పడమే కాకుండా, జగన్మోహన్‌రెడ్డిగారు కొన్ని రాయితీలను కూడా ప్రకటించాడు. అవి చాలవని చంద్రబాబునాయుడు గారి ప్రభుత్వం కూడా ఈ రోజు ఇంకా అదనంగా రాయితీలను ఇస్తూ ఉంది. ఇంతకన్నా దుర్మార్గం ఇంకోటి ఉందా అని చంద్రబాబు నాయుడు గారిని అడుగుతున్నాను. చైనాలో కొండ అంచుల మీద సోలార్ పవర్ తయారు చేస్తున్నారండి, పంట పొలాల మీద కాదు..ఎక్కడైనా బీడుగా ఉండే పొలాలు ఉంటే వాటిమీద పెడుతున్నారు. ఎక్కడన్నా పనికిరాని పడావు భూములు ఉంటే అక్కడ పెట్టండి...పచ్చని పంట పొలాల మీద పెడతారా సోలార్ పవర్? బ్రహ్మాండమైన రుచి కలిగిన మామిడి పండ్ల తోటల మీద పెడతారా సోలార్ పవర్? ఈ దేశ ప్రజలు అద్భుతమైన రుచి కలిగిన ఉలవపాడు మామిడి పండ్లు తినడానికి నోచుకోలేదా అని ఈ వేదిక మీద నుంచి చంద్రబాబునాయుడుని అడుగుతున్నాను. ఇది సహించం.ఎట్టి పరిస్థితుల్లోనూ దీనికి మేము ఒప్పుకోము అని చెబుతున్నాను. ఉలవపాడు మామిడి తోటలను తీసుకోవాలనే ఆలోచనలు విరమించుకోవాలని డిమాండ్ చేస్తా వున్నాను.

చివరగా ఒక్క మాట. అక్కినేని భవాని ప్రసాద్ గారు ఉన్నారు, వేణుగోపాల్ గారు ఉన్నారు అసలు ఈ ప్రభుత్వం వైఖరి ఏమిటి? రిటైర్డ్ ఇంజనీర్లు ఉన్నారు. మొత్తం రిటైర్డ్ ఇంజనీర్ల సంఘం వారు గోదావరి-బనకచర్ల ప్రాజెక్టు విషయంలో రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాన్ని, అది మంచిది కాదు, అది మాత్రం రాష్ట్ర ప్రయోజనాలకు భంగం కలిగిస్తుంది, అని చెబుతున్నారు. మన హక్కులకి

భంగం కలిగిస్తుంది, ఇంకా బుడమేరు పొంగి బెజవాడ, బెజవాడ చుట్టుపక్కల వున్న దిగువ గ్రామాల్లో లంక గ్రామాలన్నీ కూడా ముంపుకి గురవుతాయని చెప్పినా వినకుండా, ఏమైనా సరే ముందుకు తీసుకు వెళ్లాల్సిందే అంటున్నారు. ఏమిటి చంద్రబాబునాయుడు గారూ, మీకు ఆ గోదావరి–బనకచర్ల మీద అంత ప్రేమ ఎందుకు పుట్టుకొస్తా ఉంది? 50 కోట్లతో పూర్తయ్యే చిన్న చిన్న ప్రాజెక్టులు గానీ, 100 కోట్లతో పూర్తయ్యే ప్రాజెక్టులు గానీ ఏవీ మీకు కనపడవా!? వేదిక మీద ఉన్నాడు మా డాక్టర్ గారు, కొల్లా వెంకయ్యగారి అబ్బాయి కొల్లా రాజమోహన్‌గారు. గుంటూరు ఛానల్‌ని డెవలప్ చేయవయ్యా మహానుభావా, ఎంతవుతుంది కేవలం 200 కోట్ల రూపాయలు మాత్రమే కదా అని పోరాడుతున్నా ఎవరికీ పట్టడంలేదు. పల్నాడులో వరికపూడి సెల ప్రాజెక్టు ఉంది. ఇవన్నీ చేయకుండా గోదావరి–బనకచర్లతో రాయలసీమ సస్యశ్యామలం అయిపోతుందని ఎవరి చెవిలో పువ్వు పెట్టదలుచుకున్నావు చంద్రబాబునాయుడు?.... ఇది చాలా తప్పు. ఆ రోజున జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వానికి ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్..... ఎలా అయితే భస్మాసుర హస్తంగా మారిందో, గోదావరి–బనకచర్ల ప్రాజెక్టు కూడా ఇవాళ ఉన్న ప్రభుత్వానికి భస్మాసుర హస్తమై తీరుతుంది.. అని తెలియజేస్తూ ఈ అవకాశం ఇచ్చినందుకు ధన్యవాదాలు తెలియజేస్తూ ముగిస్తున్నాను.

## శ్రీ బొజ్జా దశరథ రామిరెడ్డి,
### రాయలసీమ సాగునీటి సాధన కమిటీ అధ్యక్షులు



రైతుకూలీ సంఘం రాష్ట్ర సదస్సుకు అధ్యక్షత వహిస్తున్న ఝాన్సీ గారికి, ప్రధాన వక్తగా వచ్చిన వడ్డే శోభనాద్రీశ్వర రావుగారికి, వేదిక మీద ఉన్న పెద్దలకు, అక్కినేని భవానీ ప్రసాద్ గారికి, కొల్లా రాజ మోహన్ గారికి, వర్మ గారికి, వేణుగోపాలరావు గారికి, ఇక్కడికి వచ్చిన నా అన్నలకు, తమ్ముళ్లకు, అక్కలకు, చెల్లెళ్ళకు, పత్రికా విలేఖర్లకు, ఎలక్ట్రానిక్ మీడియా మిత్రులకు కూడా నా హృదయపూర్వక నమస్కారాలు.

ముఖ్యంగా రైతుకూలీ సంఘానికి రాయలసీమ సాగునీటి సాధన కమిటీ తరపున మా ధన్యవాదాలు తెలియజేస్తున్నాం. మా రాయలసీమ అంశాలు ఈ రోజు రాష్ట్రంలో ఉన్న మేధావులకు, మీడియాకు అందరికీ తెలియజేయడానికి ఒక అవకాశం ఇచ్చినందుకు ఈ సంఘానికి ధన్యవాదాలు తెలియజేసుకుంటున్నాం. ముందుగా, మేము ఒక పుణ్యభూమి నుండి వచ్చాం.

రాయలసీమ అంటే పుణ్యభూమి. అన్ని పంటలు పండగలిగే వాతావరణం. అన్ని పంటలు పండే భూమి, అన్ని రకాల పంటలు పండించగలిగే రైతులు, రైతుకూలీలు, కౌలు రైతులు, అదే విధంగా తొలకరి జల్లు కూడా మా దగ్గరికే ముందు వస్తుంది, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో. కృష్ణా, తుంగభద్ర నదులు కూడా మా ప్రాంతం నుండే ప్రవహిస్తాయి. చిన్నా చితకా ప్రాజెక్టులు, ఉమ్మడి మద్రాస్ రాష్ట్రంలో నిర్మాణం జరిగాయి. వాటిలో హక్కులు కూడా సాధించుకున్నాం. ఐతే మాకున్న 90 లక్షల ఎకరాల్లో, దాదాపు ఒక 22% భూభాగానికి నీరు అందేలా ప్రాజెక్టుల నిర్మాణం కూడా జరిగింది. అదే సమయంలో ఈ ఆంధ్రప్రదేశ్‌ను పాలిస్తున్న నాయకులు కూడా మా ప్రాంతం నుండి వచ్చినవాళ్ళే చాలామంది ఉన్నారు. ఈ రోజు ఉన్న ముఖ్యమంత్రిగారు, గతంలో ఉన్న ముఖ్యమంత్రి గారు కూడా మా వాళ్లేనని గొప్పగా చెప్పుకుంటున్న ఈ సందర్భంలో బాధ పడాల్సిన పరిస్థితి కూడా ఉంది.

ఇరవైరెండు శాతం వ్యవసాయ భూమికి సరిపడేటట్టుగా సాగునీటి ప్రాజెక్టులు కట్టిస్తే, ఈ రోజు కేవలం ఎనిమిది శాతం భూమికి మాత్రమే సాగునీరు లభిస్తున్నది. కృష్ణా జలాలు, తుంగభద్ర జలాలు ఉన్నప్పటికీ, ఆ నీటిని వినియోగించుకోలేని పరిస్థితి మా దగ్గర ఉంది. గత సంవత్సరం ముగిసి, కొత్త సంవత్సరం ప్రారంభం అయిన మే 31వ తారీఖు నుండి కృష్ణా, తుంగభద్ర నదుల ద్వారా 90 లక్షల ఎకరాలకు సరిపడా నీటిని వృథాగా సముద్రానికి పారబోశాం. విజయవాడ దగ్గరకి తీసుకొచ్చి నాగాయలంక దగ్గర సముద్రంలో కలపడమే కాకుండా మా శక్తి కొలది 90 లక్షల ఎకరాలకు సరిపడా నీటిని బంగాళాఖాతంలో పారబోసాం.

రాయలసీమలో ఉన్న 90 లక్షల ఎకరాల్లో మేం సాగునీటిని వాడుకోగలిగింది కేవలం 6, 7 లక్షల ఎకరాలకు మాత్రమే. 22 లక్షల ఎకరాలకు సరిపడా

సాగునీటి సరఫరాకి నిర్మాణం జరిగినా కూడా, 90 లక్షల ఎకరాలకు సరిపడా నీటిని సముద్రంలో పారబోసి 6, 7 లక్షల ఎకరాలకు మాత్రమే నీళ్లు పారించుకోగలిగాం అంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం అవుతుంది.

మరి ఈ రోజు ఉన్న నాయకులు అంతా మావాళ్లే, ఇప్పుడున్న ముఖ్యమంత్రి అయినా గతంలో ఉన్న ముఖ్యమంత్రి అయినా మా వాడే. వీళ్ళంతా ఎప్పుడు ఏం మాట్లాడినా సరే, రాయలసీమ ముందు వస్తుంది హామీలలో, ప్రాజెక్టులలో. ఇంతకు ముందే వడ్డే శోభనాద్రీశ్వరరావు గారు చెప్పినట్లుగా గోదావరిపై బనకచర్లతో రాయలసీమ సస్యశ్యామలం అవుతుంది అని మాటలు చెప్తున్నారు. దీనికంటే కొంచెం ముందుకు పోతే, రాష్ట్రం విడిపోయినప్పుడు కూడా, పోలవరం కడితే రాయలసీమ సస్యశ్యామలం అని చెప్పారు. పోలవరం ఆలస్యమవుతుంది అని చెప్పి పట్టిసీమ ప్రాజెక్టును తీసుకొచ్చి ఆ నీళ్లన్నీ కూడా రాయలసీమకే అని చెప్పారు. ఇదంతా కూడా ప్రజల్ని నమ్మించడం కోసం, మభ్యపెట్టడం కోసం.

మరి అదే ముఖ్యమంత్రి గారు ఈ రోజు మా గోరుకల్లు రిజర్వాయర్ గురించి, అంటే SRBC కి సంబంధించిన కీలకమైన ప్రాజెక్టు, వెనకపడిన నంద్యాల జిల్లాలో, అత్యంత దుర్భరమైన బహిలంపల్లె, కొలకుంట్ల, జమ్మలమడుగు ప్రాంతాలకు సంబంధించిన లక్షా తొంభై వేల ఎకరాలకు కీలకంగా ఉండే గోరుకల్లు రిజర్వాయర్ నిర్మాణం కోసం పివి నర్సింహరావు గారు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు అనుమతులు లభించాయి. 1994లో ఆమోదం లభించి, దానికి సిడబ్ల్యూసి క్లియరెన్స్ వచ్చింది. శ్రీ బాగ్ ఒడంబడిక హక్కులతో మొట్టమొదటిగా ఎస్ ఆర్ బి సి ప్రాజెక్టును తెలంగాణకు సంబంధించిన ముఖ్యమంత్రి అంజయ్య గారు తీసుకొచ్చారు. అందులో అంతర్భాగమైన బోరుబండ రిజర్వాయర్‌కు 1994లో సీడబ్ల్యుసి ఆమోదం లభించింది. దాని తర్వాత నుండి ఈరోజు వరకు 16 సంవత్సరాల కాలం చంద్రబాబునాయుడు గారు ముఖ్యమంత్రిగా ఉన్నారు. ఆయన వచ్చినప్పటి నుంచి ఈరోజు వరకు, ఆ నాయకుడు దీని గురించి మాట్లాడుతూ గత ప్రభుత్వం చేసిన విధ్వంసం వల్ల బోరుబండ రిజర్వాయర్ అంతా పాడైపోయిందని, తాము 91% పూర్తి చేశామని, తొమ్మిది శాతం పూర్తి చేయకపోవడం వల్ల విధ్వంసం జరిగిందని చెప్పుకుంటూ నిమ్మల రామనాయుడు గారు మార్చి 20వ తారీఖున అసెంబ్లీలో కూడా స్పష్టంగా ప్రకటించారు. ఈ బోరుబండ రిజర్వాయర్ ఈరోజు తెగిపోయే పరిస్థితి ఉంది. దీన్ని సరైన విధంగా పూర్తిగా నిర్మాణం చేపట్టకపోవడం వల్ల అధికంగా నీరు నిలవడం వల్ల రివిట్‌మెంట్ అంతా కిందకు దిగిపోతా ఉంది. దీనికి తక్షణమే రిపేరు చేయాలి. ఇది రిపేర్ చేయకపోతే 1,90,000 ఎకరాల ఆయకట్టుకు ఇబ్బంది కలుగుతుంది. ఈ 1,90,000 ఆయకట్టుకే కాదు; బోరుబండ రిజర్వాయర్ నుంచి గండికోటకి కూడా నీళ్లు పోవాలి. అదేవిధంగా మధురవాడకు నీళ్లు పోవాలి. అక్కడ కూడా 1,50,000 ఎకరాల ఆయకట్టుకు నష్టం జరుగుతుంది. మొత్తం మూడు లక్షల ముప్పై వేల ఎకరాలకు నష్టం జరుగుతుందని, స్పష్టంగా అసెంబ్లీలో ప్రకటించారు, నిమ్మల రామనాయుడు గారు. మరి ఈ ప్రాజెక్టు ద్వారా మూడు లక్షల 30 వేల ఎకరాలకు నీరందితే సంపద సృష్టించేదా కాదా అనేది స్పష్టంగా అడగాలి.

చంద్రబాబునాయుడు గారు 'నేను సంపద సృష్టిస్తాను ఆ సంపదనంతా మీకు తీసుకొస్తాను' అని చెప్తున్నాడు. ఇక్కడ 200 కోట్ల రూపాయలు బోరుబండపై ఖర్చు పెడితే, 3 వేల కోట్ల రూపాయల సంపద సృష్టించబడతావుంటే మీకు ఎందుకు కనబడటం లేదని స్పష్టంగా మనం అడగాల్సిన అవసరం ఉంది. మరి దీని కోసం మేము అనేక పర్యాయాలు అనేక లెటర్స్ రాశాం. బోరుబండ రిజర్వాయర్ చంద్రబాబు నాయుడుగారు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడే, పూర్తిగా రిజర్వాయర్లో నీళ్లు నిలబెడతామని వారు అంటున్న నేపథ్యంలో మా దగ్గర ఉన్న ప్రజా ప్రతినిధులు మేము ఇంకా ఎక్కువ నీళ్లు నిలబెడతా మంటున్నారు.

ఈ రోజు నంద్యాలలో ఉన్న నాకు ప్రాణభయం ఉంది. నాలాగా ఈ సమాజంలో ఉన్నవాళ్ళంతా భయపడుతున్న నేపథ్యాన్ని మంత్రి గారు అసెంబ్లీలో కూడా ఆవిష్కరించారు. మే 31న ప్రభుత్వం చేయాల్సిన ఆ శంకుస్థాపన కార్యక్రమాన్ని, 2016లో మేమే శంకుస్థాపన చేశాం.

రాయలసీమలో ఉన్న అంశాలను ప్రపంచం దృష్టికి తీసుకువెళ్లాలి అన్న ఉద్దేశ్యంతో ప్రజల చేత స్వచ్ఛందంగా చేయించాం. రాయలసీమలో జరుగుతున్న మోసాన్ని ప్రజలకు తెలియజేయాలని 30 వేల మంది జనానికి, ఇంటింటికి ప్రచారం చేశాం. రాయలసీమలో రౌడీయిజం

ఎక్కువ అనే నేపథ్యంలో, ఎక్కడా ఎటువంటి ఇబ్బంది రాకుండా, 30 వేలమంది జనం ఉన్నప్పటికీ కూడా ఎటువంటి అల్లర్లు చెయ్యకుండా మా కార్యక్రమం జరిగింది. ఆ కార్యక్రమం వీడియోలు కూడా చూపిస్తాం, ఎక్కడైనా ఎవరు మాట్లాడినా తాగడానికి నీరు కోసం మేమిలా వొచ్చాం అనే తప్ప ఏమీ గొడవలూ జరగలేదు. అంత ప్రశాంతంగా, ప్రభుత్వం ఎన్ని ఆటంకాలు ఏర్పర్చినా, ఎంత మంది నాయకులను హౌస్ అరెస్ట్ చేసినా, 30 వేల మందితో ఆ కార్యక్రమాన్ని చేసుకుంటూపోయాం. ఈ సంవత్సరం కూడా మే 31వ తారీఖున 5 వేల మంది అడవి మధ్యలో స్వంత వాహనాలతో వచ్చి, అష్టకష్టాలు పడి ఈ కార్యక్రమాన్ని చేస్తున్నా, ప్రభుత్వానికి మాత్రం ఏమీ పట్టడం లేదు.

మరి ఈ సందర్భంలో, ఈ ప్రాజెక్టు కోసం, మే 31వ తారీఖు జరిగే కార్యక్రమం కోసం మాట్లాడుతూ, వడ్డే శోభనాద్రీశ్వరరావు గారు చెప్పిన అంశానికి మళ్ళీ వస్తాను. ఎందుకంటే ఈ మే 31వ తారీఖు జరిగే కార్యక్రమం ఎంత ముఖ్యం అని తెలుసుకోవాలి. పత్రికా విలేఖర్లు అంతా కూడా అడిగివచ్చారు, గోరుకల్లు ప్రాజెక్ట్ పరిస్థితి ఏంటి అని. ఆంధ్రజ్యోతి, ఈనాడు లాంటి పత్రికలు చెప్పినదాన్ని బట్టి, ఆ ప్రాజెక్ట్ నిర్మాణానికి 200 కోట్ల రూపాయలు కావాలి, అంత కేటాయించినప్పుడు మాత్రమే ప్రాజెక్టు పూర్తి అవుతుంది, కానీ ప్రస్తుతం రాష్ట్రంలో ఉన్న పరిస్థితిని బట్టి, కనీసం 93 కోట్ల రూపాయలు కేటాయిస్తే మేం ఏదోవిధంగా ప్రాజెక్టు నిర్మాణాన్ని పూర్తి చేస్తాం అని అధికారులు ప్రభుత్వాన్ని అడిగినప్పటికీ, ప్రభుత్వం నుండి ఒక్క పైసా రాలేదు. అదే సందర్భంలో వడ్డే శోభనాద్రీశ్వరరావు గారు చెప్పిన విధంగా ఇంజనీర్లు వస్తున్నారు, పోతున్నారు, చూస్తున్నారు, అసలు ఏం చేయాలి అనుకుంటున్నారు వీళ్ళు? ఇదొక విధంగా కబుర్లతో కాలక్షేపం అనిపించేలాగ, 55 కోట్లతో ఫైనాన్స్ మినిస్టర్ను పంపిస్తున్నాం, అక్కడ నుండి నిధులు రాగానే ప్రాజెక్టు నిర్మాణం ప్రారంభించే కార్యక్రమం చేపడతాం అని చెప్తున్నారు అంటే, ఒక రకంగా పంచపాండవులు ఎందరు అంటే రెండు వేళ్ళు చూపించినట్లుగా రెండు వందల కోట్లు కావాల్సి ఉంటే, అధికారులు కనీసం 93 కోట్లు అడిగితే, మంత్రి గారు ఫైనాన్స్ మినిస్టర్కు ప్రతిపాదన చేసి పంపిస్తే, అక్కడినుండి ఎంత డబ్బు వస్తుంది అని తెలియదు గానీ, తొలకరి ఒచ్చింది రాయలసీమకు. కానీ ఒక్క పనీ జరగలేదు. పాలకులు ఆగితే తొలకరి ఆగుతుందా, వానకాలం ఆగుతుందా అని మనం ప్రశ్నించుకోవాలి.

ఇదే సందర్భంలో ముఖ్యమంత్రిగారు మే నెలలో కర్నూలు వచ్చారు. ఒక మార్కెట్, రైతుబజారు, కర్నూలులో చాలా బ్రహ్మాండంగా అభివృద్ధి చెందుతున్నది. దాని గురించి అక్కడ మీటింగ్ పెట్టుకొని, గోరుకల్లు గురించి ఒక ప్రతిపాదన చేసి పోయారు. గోరుకల్లు తెగిపోయే ప్రమాదం ఉంది, దాని రిపేర్కు ఎన్ని డబ్బులిస్తాం అని చెప్పకుండా అక్కడున్న తాగునీటిని ఇచ్చిపోయినట్టే చప్పట్లు కొట్టించుకొని, భజనలు చేసుకొని, భుజకీర్తులు పాడి, మీరు గొప్పవారు సార్ అని పొగిడించుకున్న ప్రజాప్రతినిధులు మనకి ఉన్నారు. అయ్యా, అది తెగిపోయేలా ఉంది, దాని నిర్మాణానికి 20 కోట్లు కావాలి, అది లేకపోతే నీరు ఎలా ఇస్తాం అని అడగలేదు. పైన తుంగభద్ర ఉండగా ఎందుకు నీరు ఎత్తి పోసుకోవాలి అని ప్రజాప్రతినిధులు అడగలేదు, ప్రజలు కూడా అడగలేదు. అంటే ఏ పార్టీకి ఆ పార్టీ ప్రజల్ని మభ్యపెట్టడానికి తయారు చేస్తూ ఉన్న నేపథ్యం ఇది.

నిన్న ఈనాడు పేపర్లో ఒక వార్త రాశారు. గోరుకల్లుకు నిధుల జల్లు అని, నాకు అర్థం కాలా, నిధుల జల్లు అంటే, నిధుల జల్లా లేక నిధుల వరదా అని. వ్యవసాయ శాస్త్రవేత్తలు ఉన్నారు, జల్లు అంటే రెండు చినుకులు పడినా జల్లే, మూడు చినుకులు పడినా జల్లే, పదునైన వర్షం అంటే వేరు. అంటే నిధుల జల్లు కురిపించారు, పదునైన వర్షం కాదు. 200 కోట్లు కావాల్సిన ప్రాజెక్టుకు, కోటి నాలుగు లక్షలు అంటే బావుండదు అని చెప్పి 104 లక్షలు అని రాశారు. ఇలాంటి నిధుల జల్లు కురిపించడం అన్న పరిస్థితి మనకి ఉంటే, దీన్నిబట్టి మనకి ఏం అర్థం అవుతుంది? ఏం జరుగుతుంది ఇక్కడ రాష్ట్రంలో? 2015లో చంద్రబాబు నాయుడు గారు ఉన్నప్పుడు దానికి 5 లక్షలు కేటాయించి పక్కన పెట్టారు. ఇంకో కోటి రూపాయలు పెట్టుంటే పూర్తయిపోయేది ఆ ప్రాజెక్టు. అలాంటి ప్రాజెక్ట్ లేకపోవడం వల్ల ఈ సంవత్సరం జరిగిన వృథా ఏంటంటే, 90 లక్షల ఎకరాలకు సరిపడా నీటిని ఇవ్వగల కెపాసిటీ ఉన్న డామ్, ఒక్క చుక్క కూడా తీసుకోలేక 70 వేల ఎకరాలు ఎండబెట్టుకున్న పరిస్థితికి తెచ్చుకున్నాం. ఒక్క కోటి రూపాయలు ఖర్చుపెట్టలేకపోవడం వల్ల ఇలాంటి

పరిస్థితి తెచ్చుకున్నాం. పాలకులకు తెలీదా వ్యవసాయ ఉత్పత్తి వలన ఎంత సంపద సృష్టి జరిగిందీ అని? ఈ రోజు అదే ఖర్చు కోటి నుండి మూడు కోట్లు అయ్యింది. జగన్ రెడ్డి గారి కాలంలో 32 కోట్ల రూపాయలు అయ్యింది. అంటే ఎంత సంపద సృష్టి జరిగినా కూడా, ఒక ప్రాజెక్టుకు కనీసం 32 కోట్ల రూపాయలు కూడా కేటాయించలేని పరిస్థితి ఉంది. అంటే ఎంత ఒత్తిడి పెంచినా ఒక 32 కోట్ల రూపాయలు కూడా ఒక ప్రాజెక్టుకు ఏడు సంవత్సరాల క్రిందట డబ్బులు ఇవ్వలేని పరిస్థితిఅంటే మాకు అనుమానం వస్తా ఉంది, రాష్ట్రం దివాలా తీస్తుందా అని. దివాలా తీయడానికి కారణం ఎవరు అనేది మీ అందరూ కూడా పరిశోధన చేయాలి. రాష్ట్రాన్ని ఈ పరిస్థితికి ఎందుకు తీసుకొచ్చారు అనేది కూడా పరిశోధన చేయాల్సిన అవసరం ఉంది. కొన్ని కీలకమైన అంశాలు ఇవి. 2014 తర్వాత హైదరాబాద్ కేంద్రంగా రాష్ట్రం ఉండాలంటే విజయవాడ తీసుకువచ్చారు. అవసరం లేకపోయినా కూడా తీసుకురావడం మంచా, చెడా అనేదాని గురించి అవసరం లేదు గానీ, మీ దగ్గర ఆర్థిక స్తోమత ఎలా ఉంది, ఈ రాష్ట్రంలో ఏవైతే ఉమ్మడి రాష్ట్రంలో ఉన్నాయో ఆ ప్రాజెక్టుల నిర్మాణం పూర్తి చేయడం కోసం, చట్టాల్లో పెట్టిన ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం ఖర్చు పెట్టి పూర్తి చేయాలి. నిధులతో పోలవరం పూర్తి చేయాలి. రాష్ట్రంలో ఇది ఒక సంవత్సరంలో అక్కడ ఉండాలి అని చెప్పి ఇవన్నీ కాదు మేము ఇవన్నీ చేసుకుంటామని చెప్పి ధైర్యంగా వచ్చినప్పుడు మీ ఆలోచనా శైలి ఏమైంది? మీ దగ్గర మా గౌరవం ఉందా? మీరు ఒక సమస్యను ఎదుర్కొని పారిపోయి ఇక్కడికి వచ్చి దాన్ని ఒక అవకాశంగా మల్చుకొని అమరావతిలో మీ ఆర్థిక రాజకీయ సామ్రాజ్యాన్ని సృష్టించుకోవడం కోసం చేసిన ఈ విధానాలవలనే ఈరోజు అప్పు అప్రూవ్ అయింది అనేది మనందరం చర్చించు కోవాల్సిన అంశం. ఆ అంశం యొక్క కంక్లూజన్‌కు రావాల్సిన అవసరం ఉంది. దాని తర్వాత వచ్చిన ప్రభుత్వం కూడా డబ్బులు లేకపోవడం వల్లనో లేదా ఏదైనా కానివ్వండి రాయలసీమ ప్రాజెక్టులకు 3 ప్యాకేజీలు అర్ధాంతరంగా 2008లో ఆపేసారు. దీనికంటూ కారణం ఎవరు? ఈ రాష్ట్రం దివాళా కారణం ఎవరనేది మనము, ఇక్కడికి వచ్చిన మిగతావారంతా కూడా ఎకనామికల్ స్టడీ చేయాల్సిన అవసరం వుంది. రాష్ట్ర ప్రభుత్వం ఈరోజు స్పష్టంగా అసెంబ్లీలో ప్రకటించింది. నిమ్మల రామనాయుడు గారు దీనికి డబ్బులు, పెట్టుబడులు, ఫైనాన్స్ మినిస్టర్ దగ్గర నుండి వచ్చిన తర్వాత చేస్తామంటున్నారు. అంటే ఈసారి మళ్లీ వర్షాకాలం వచ్చినప్పుడు మళ్ళీ కొట్టుకుపోయే పరిస్థితి ఉంది. ఈరోజు బోరుబండ రిజర్వాయర్ లోని శ్రీశైలం నుండి రెండు పిఎఫ్ లను గత సంవత్సరం తీసుకువచ్చారు. వెలుగొండలో రెండు పీఎఫ్ లు తీసుకొస్తే, ఆ వేగంతో నీరు వస్తే ఆ వెలాసిటీకి తెగిపోతుంది అని తెలియదా? 30 రోజుల్లో బోరుబండ రిజర్వాయర్ నిండుతుందా, గండికోట నిండుతుందా, అరకు నిండుతుందా? ఇవన్నీ ఏమీ నిండకుండా ఎక్కడికి వస్తాయి నీళ్లు? విజయవాడ నగరానికి వరదలు వస్తాయి. మరి ఆ మాత్రం మీకు తెలియదా ముఖ్యమంత్రి గారు? విజయవాడ నగరంలో వరదలను గమనిస్తే కూడా ఆ నీటిని మనం ఎట్లా వినియోగించుకోవాలి, నీరంతా వాడుకోకపోతే అదంతా ఎట్లా వరదలమయం అయిపోతూనే ఉంటుందో తెలుస్తోంది. ఈ ప్రాజెక్టులు చేయడం లేదంటే, తెలిసి కూడా చేయడం లేదంటే మరి మాకు అనుమానం వస్తోంది. ఈ రాష్ట్రం దివాలా తీసిందా? పోలవరం ప్రాజెక్టు ద్వారా రాయలసీమకు అని చెప్పి మభ్యపరిచి ఆ నీటి మీద హక్కును లాక్కొని ఈ ప్రభుత్వం మొత్తం నీటిని దోచుకుపోతోంది. మరల పోలవరం ప్రాజెక్టు ద్వారా రాయలసీమ సస్యశ్యామలం అంటూ పేర్కొంటుంది. అంటే దాని ద్వారా ఇంకొక పదేళ్లు సినిమా చూపించే భావంలోకి వచ్చారు. వచ్చిన వెంటనే చంద్రబాబునాయుడు అంత గొప్ప నాయకుడు లేడు అని పొగుడుతున్నారు అంటే వాళ్లు వాళ్లు సర్దుకుని తామంతా కలిసి పోతున్నారు. మరి ఈరోజు అదే ఏటీఎంలాగా విశ్వ గురువైన మోడీ గారు చంద్రబాబునాయుడు గారితో కలిసి చేయాలను కుంటున్నారా?

రాష్ట్ర విభజనలో పెట్టుకున్న ప్రత్యేక ప్యాకేజీ డిమాండ్లను అడిగిన వాళ్లు ఒక్కళ్ళు లేరు, చంద్రబాబు నాయుడుగారు గాని, జగన్మోహన్ రెడ్డి గారు గానీ.

ప్రభుత్వం ఈ చిన్న చిన్న ప్రాజెక్టులను కంప్లీట్ చేయటంగాని, లేదా చెరువులను ఉద్ధరించడం గాని చేయదు. ప్రధానంగా చెరువులు, కాలువల మీద ఆధారపడి ఉన్నాం. వీటి అభివృద్ధి కార్యక్రమాలు ఎందుకు చేపట్టడం లేదు? కేవలం 1500 కోట్ల రూపాయలు

ఖర్చు పెడితే పది లక్షల ఎకరాల ఆయకట్టుకు శ్రీకారం జరిగే అవకాశం రాయలసీమలో ఉంది, మేం చూపిస్తాం రండి అంటే మీరు ఎందుకు మాతో మాట్లాడడానికి సిద్ధంగా లేరు? రాయలసీమ విజన్ ఉంది, నా దగ్గర బ్లూప్రింట్ ఉంది అన్నవాళ్ళంతా కూడా, మీ బ్లూప్రింట్లో ఏముందయ్యా చూపించు మాకు అంటే ఎందుకు భయపడుతున్నారో తెలుసుకోవాల్సిన అవసరం ఉంది. మీ బ్లూప్రింట్లో ఏముంది? దివాళా తీసిన రాష్ట్రం పరిస్థితి మాకు తెలీదు అనుకుంటున్నారా? చెప్పాలి.

అదేవిధంగా మన వడ్డే శోభనాద్రీశ్వరరావు గారు చెప్పారు మోడీ గురించి. ఈరోజు ఆయనను విశ్వగురువు అని ప్రచారం చేసుకుంటున్నారు. వడ్డే శోభనాద్రీశ్వరరావు గారు చెప్పినదానితో నేను ఏకీభవిస్తున్నాను, సమాజంలో 99% మంది ఉన్నారు ఇవాళ. సమాజంలో అలాంటి భావజాలాన్ని అంతా ప్రచారం చేసిపెట్టారు, వాట్సాప్ యూనివర్సిటీలో. దాన్ని ఎదుర్కోవాలంటే మన శక్తి సరిపోతుందా? ఈ రోజు మనం ప్రత్యక్షంగా చూసాం. మే 31వ తేదీన జరిగిన కార్యక్రమంలో, ప్రజలను చైతన్యవంతులను చేయకుండా, వాళ్ళ అజ్ఞానాన్ని తొలగించకుండా మనం ఉద్యమాన్ని నిర్మించలేం అని. ఇంటింటికి వెళ్లి, ఏపి అంటే అమరావతి, పోలవరం మాత్రమే కాదు, ఇది ఆంధ్రప్రదేశ్, శ్రీకాకుళం నుండి, కర్నూలు వరకు కూడా ఇది అందరికీ చెందిన ఆంధ్రప్రదేశ్, ఆది అభివృద్ధి చెందాలి అనీ, ఈ ప్రాంతాల ప్రజల మనోభావాలు దెబ్బతినేలా ఎందుకు ప్రవర్తిస్తున్నారని ప్రశ్నిస్తూ, ఇంటింటి ప్రచారం చేసుకుంటున్న నేపథ్యంలో విస్మయం కలిగించే అంశాలు కొన్ని బయటికి వచ్చాయి.

ఇళ్లలో, అన్ని తరాలవాళ్లు, డిగ్రీలు, ఇంటర్మీడియట్ చదువుతున్న పిల్లలతో సహా అందరూ కూర్చొని, మీకు తాగడానికి నీళ్ళు ఎక్కడనుండి వస్తున్నాయి అంటే ఒక నది నుండి అని చెప్పలేని సమాజంలో మనం ఉన్నాం. ఒక నది పేరు చెప్పలేక, భూమిలో నుండి వస్తున్నాయి అని ఒకరు, బోరు నుండి వస్తున్నాయి అని ఒకరు మాట్లాడుతున్న పరిస్థితిలో మనం ఉన్నాం. ఆ సమాజాన్ని చైతన్యవంతం చేయడం కోసం ఇంటింటికి తిరిగాం. నంద్యాల జిల్లా అంతా కూడా. ఇలాంటి ఇంటింటి ప్రచార కార్యక్రమాలు మనం చేపట్టగలిగితే ఈ విశ్వగురువు చేస్తున్న ప్రచారాన్ని అరికట్టగలుగుతాం.

విశ్వగురువు అని చెప్పుకుంటున్న మోదీ గారి గురించి చాలా విషయాలు చెప్పారు. ఆదివాసీల విషయం గాని, పరిశ్రమల విషయం కానీ, మన రాష్ట్రానికి సంబంధించి నంతవరకు, విభజన కాంగ్రెస్ పార్టీ చేస్తే దానికి మద్దతు పలికింది బీజేపీ పార్టీ. రాష్ట్ర విభజన సమయంలో ఎటువంటి సంక్లిష్టతలు రాకుండా, మధ్యన ఉండి పెద్దరికం వహించి, ఇరు రాష్ట్రాలకు కావలసినవన్నీ సమకూర్చాల్సినవాడు, 2023 ఎలక్షన్లలో గెలవడం కోసం, తెలంగాణలో గెలవడం కోసం, మన జుట్టుకు జుట్టుకు ముడి వేసి ప్రత్యేక హెూదా కూడా తెలంగాణకు ఇచ్చేలాగ కొత్త కాన్సెప్ట్ సృష్టించారంటే విశ్వగురువు అవుతాడా అనేది మనం ఒకసారి ఆలోచించాలి. ఈ అంశాలన్నీ మనం చెప్పుకోవాలంటే ఇక్కడున్న మన ఐదు పది మంది, లేక వెయ్యి మంది సరిపోం. ఈ విషయాలన్నింటినీ తీసుకొని ప్రతి పల్లెలో ప్రతి ఇంటింటికి పోయి చెప్పాల్సిన అవసరం ఉంది. శోభనాద్రీశ్వరరావు గారు చాలా విషయాలు చెప్పారు, చాలా పుస్తకాలు రాశారు, ఆ పుస్తకాలను, విషయాలను ప్రతి ఒక్కరికి తెలియజేయాలి.

ఇంకొక బాధాకరమైన విషయం ఏమిటంటే, పేపర్లు చదివే వాళ్లే లేరు. కాలేజీ విద్యార్థులు కూడా జబర్దస్తో ఇంకేదో చూస్తున్నారు తప్ప ఈ అంశాలు తెలీదు. తాగడానికి నీళ్లు ఎలా వస్తాయో, పంటలకు నీరు అవసరం అనీ తెలీదు. ఇలాంటి పరిస్థితుల్లో, ఎన్నికల్లో గెలవడం కోసం రాష్ట్రాల మధ్య తగువులు పెట్టే విశ్వగురువులు ఉన్న నేపథ్యంలో, ఆ తగువులు తీర్చకుండా 2023 అక్టోబర్ 4న ఒక కేబినెట్ నిర్ణయం ద్వారా మన నీటిని, కృష్ణా జలాలను కూడా తెలంగాణకు పంచడానికి, గోదావరి జలాలను పోలవరానికి మళ్లించడం ద్వారా, ఆ జలాలను కూడా తెలంగాణకు మళ్ళించడానికి జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంలో, ఈ కేబినెట్ నిర్ణయాన్ని జీవో జారీ చేశారు. రాయలసీమ ప్రజలపట్ల ఈ మాత్రం బాధ్యత లేకుండా, తమ రాజకీయ ప్రయోజనాలే తమకు ముఖ్యం అనే పార్టీలు మనకి ఉన్న నేపథ్యంలో మనం ఏం చేయగలుగుతాం?

ఇదే సందర్భంలో మనం కూడా తెలుసుకోవాలి, తెలుగుదేశం ప్రభుత్వంలో ఉద్యమకారులు ఉన్నారు, జగన్ ప్రభుత్వంలో ఉద్యమకారులు ఉన్నారు. ఆ ప్రభుత్వంలో ఈ ఉద్యమకారులు పని చేయరు, ఈ ప్రభుత్వంలో ఆ ఉద్యమకారులు పని చేయరు. అంటే వీరు ఉద్యమకారులా,

లేక ఆ పార్టీ యొక్క ఫ్రెండ్సా? ఇవన్నీ మనం అర్థం చేసుకోవాలి. సమస్యలన్నింటినీ అంశాల వారిగా మాట్లాడుతూ, ఇంటింటికి తీసుకుపోయే వాళ్ళను కాకుండా, మేం పుస్తకాలు రాసాం, పేపర్లు ఇచ్చాం అనేవాళ్ళను గుర్తించి లైన్ గీసుకోవాలి. వడ్డే శోభనాద్రీశ్వరరావుగారు ముఖ్యమంత్రికి చాలా డీటెయిల్స్ తో ఒక లెటర్ రాశారు, ఇక్కడ పేపర్లలో ఒక్క వార్త కూడా రాలేదు దాని గురించి. వార్తా పత్రికలు కూడా సమాజంకోసం కాకుండా, రాజకీయ పార్టీలకు సపోర్టుగా వార్తలు రాస్తున్న నేపథ్యంలో మన అందరిమీదా చాలా బాధ్యత ఉంది. ఈ రాష్ట్రం దివాళా తీసిందా, ఒకవేళ దివాళా తీసింది అంటే నిష్పక్షపాతంగా ఎక్కడెక్కడ తప్పులు జరిగాయి అనేది, నాయకుల మీద అభిమానాన్ని పక్కన పెట్టి, లక్షల కోట్ల రూపాయలు టవర్ల నిర్మాణానికి, మరోవాటికి కేటాయిస్తూ కూడా 2, 3 కోట్ల రూపాయల్ని వ్యవసాయాభివృద్ధికి కేటాయించలేని పరిస్థితి ఎందుకు వచ్చింది? లీజు డబ్బులు కూడా ఇవ్వలేకపోతే ఈ ప్రాంతం దివాళా తీసింది అనుకోవాలి. ఇటువంటి పరిస్థితి ఎందుకు వచ్చింది? దీనికి పరిష్కారం ఏంటి అనే దృక్పథంతో మేధావులంతా కూడా పని చేస్తూ, మనం అందరం అర్థం చేసుకొని, దీనిని ఇంటింటికి తీసుకు పోవాల్సిన అవసరం ఉంది అని భావిస్తూ, ఆ దిశగా పనిచేసినప్పుడు మాత్రమే ఈ విశ్వగురువులను ఎదుర్కోగలం, లేకపోతే అవి జరుగుతూనే వుంటాయి. మే 31వ తేదీన కార్యక్రమానికి 5 వేల మంది వస్తే పేపర్లో వార్త లేదు. ప్రజలందరూ స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ఇటువంటి చైతన్యాన్ని నిర్వీర్యం చేయడం కోసం పత్రికలు కూడా తమ శాయశక్తులా తమ గురు భక్తిని ప్రదర్శిస్తూ, రాజకీయ భక్తిని ప్రదర్శిస్తూ పని చేస్తున్న నేపథ్యంలో మన మీద చాలా బాధ్యత ఉందని తెలియ జేసుకుంటూ, ఈ అంశాలను మనం వ్యక్తిగతంగా, పత్రికల ద్వారా లేదా పుస్తకాల ద్వారా ప్రచారం చేసే కార్యక్రమం చేపట్టాలని చెప్పి తెలియజేసుకుంటూ, రాయలసీమ ఈ రోజు చాలా ఇబ్బందుల్లో ఉంది, దీనికి తోడు చంద్రబాబు నాయుడు గారు అనంతపురం జిడిపి గోదావరి జిల్లాల కంటే బాగుందని అన్నారు, ఏం అర్థం దానికి? ఒక్క శాతం నీరు నిలవడం లేదు, 2 లక్షలు ఎకరాలకు తుంగభద్ర నీళ్ళు రావాల్సి ఉంటే 50 వేల ఎకరాలకు మాత్రమే నీళ్లు వస్తున్నాయి. మొత్తం 33 లక్షల ఎకరాల్లో, ఒక లక్ష ఎకరాలకు కూడా సరిపడా నీళ్లు రాని నేపథ్యంలో మీ ప్రాంతంలో జిడిపి బాగుందని మాట్లాడుతున్న నాయకులు ఈ రోజు ఉన్నారు. మరి, యూనివర్సిటీ వాళ్ళు కొత్త టెక్నాలజీ కనిపెట్టారు, ఇరాన్ టెక్నాలజీ లాగా అడవి అంతా బ్రహ్మాండంగా డెవలప్ చేయొచ్చు అని మాట్లాడు తున్నారు, తుంగ భద్ర నీళ్ళు బ్రహ్మాండంగా పారుతున్నాయి అని పత్రికల్లో కూడా తప్పుడు వార్తలు రాస్తున్నారు. రాయలసీమకు చెందిన నాయకులే రాయలసీమకు అన్యాయం చేస్తున్న ఇటువంటి నేపథ్యంలో, రాయలసీమకు చెందిన అంశాలన్నింటినీ కూడా మరింత స్పష్టంగా, విపులంగా మీ డిమాండ్లలో చేర్చాలని చెప్పి కోరుకుంటూ నాకు ఈ అవకాశం ఇచ్చినటువంటి అందరికీ ధన్యవాదాలు తెలియజేస్తూ ముగిస్తున్నాను.

## శ్రీ వై.వి.ఎస్. మహాదేవ్

**కేంద్ర ప్రభుత్వ మాజీ సలహాదారు**



రైతుకూలీసంఘం (ఆం.ప్ర.) రాష్ట్ర సదస్సుకు అధ్యక్షత వహిస్తున్న ఝూన్సీగారు, మాజీ మంత్రివర్యులు వడ్డే శోభనాద్రీశ్వరరావు గారు, మిత్రులు డా॥ కొల్లా రాజమోహన్ గారు, అక్కినేని భవానీ ప్రసాద్‌గారు, వేణుగోపాల్‌గారు, వర్మగారు, ఈ సదస్సుకు హాజరైన అందరికీ నా నమస్కారాలు.

ఆంధ్రప్రదేశ్ పరిస్థితి చూస్తుంటే రామాయణంలోని ఒక కథ గుర్తుకొస్తోంది. రాముల వారు అరణ్యవాసంలో ఉన్నప్పుడు ఒక ఉడత ఆయన పక్కన ఏడుస్తోందట. ఆయన అది చూసి ఎందుకమ్మా ఏడుస్తున్నావు, ఏమి ఇబ్బంది వచ్చింది నీకు అని అడిగాడట. అప్పుడా ఉడుత అయ్యా నా తోక ఇరుక్కుపోయింది, చాలా బాధగా ఉంది అంటే అయ్యోయ్యో ఎక్కడ ఇరుక్కుందో చెప్పమ్మా. అంటే, నీ కాలి కిందనే ఇరుక్కుంది స్వామీ అందట. అలా ఉంది ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ పరిస్థితి. ప్రభుత్వాలు మనల్ని తొక్కిపట్టేస్తున్నాయి. మన ప్రాణాలు తీసేస్తున్నాయి. మనకు కావాల్సిన ఉద్యోగాలు ఇవ్వవు, అవసరమైన నిధులు ఇవ్వవు. ఉద్యోగాల రూపకల్పనకు, విధానమే లేదు. వాళ్ళు చేపడుతున్న ప్రాజెక్టులు చూడండి 30 ఏళ్ళనాడు

మొదలుపెట్టిన వెలిగొండ ప్రాజెక్టు ఎప్పటికీ పూర్తికాదు. పోలవరం మొదలెట్టారు. కేంద్రమే నిర్మిస్తుందన్నారు. కేంద్రప్రాజెక్టు రాష్ట్రం ఎందుకు తీసుకుందో అర్థంకాదు. విభజన సందర్భంగా ఆనాటి కాంగ్రెసు ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌కు పోలవరం జీవనాడి అన్నది. మొత్తం ఖర్చంతా మేమే భరిస్తాం అన్నారు. 58 వేలకోట్ల రూపాయలు అంచనావేశారు. అందులో అధికభాగం నిర్వాసితులకే ఇవ్వాలి. ఇవాళ ప్రాజెక్టు దగ్గరికి వచ్చేసరికి దానిని 41 అడుగులకు తగ్గించేసి, నీరు మాత్రం ఉండేట్లు చేసి నిర్వాసితులకు పంగనామం పెడుతున్నారు. లక్షలమంది నిర్వాసితుల్లో సుమారు రెండువేల మందికి నష్టపరిహారం ఇచ్చేసి ఎలాగోలా ప్రాజెక్టు పూర్తిచేసేసి మా పనైపోయిం దనటం. సరే నువ్వు చెయ్యలేవు. డబ్బులు లేవంటున్నావే, మరి 80 వేలకోట్లతో బనకచర్లకు ఎందుకు వెళ్తున్నావ్?

ఈ మార్గంలో 24 కి.మీ. సొరంగం ఉంది. 240 మీటర్ల ఎత్తుకు నీళ్ళను పంపుచెయ్యాలి. ఇప్పుడు ఎస్ఎల్‌బిసిలో గత 15 సం॥ లుగా సొరంగ నిర్మాణంలో కిందామీదా పడుతూ ఉన్నారు. మొన్నకూడా సొరంగ నిర్మాణం చేయబోతే 12 మంది చనిపోయారు. ఒక సొరంగం తవ్వుతుంటే నీళ్ళు ఎంతో ఫోర్స్‌గా వస్తున్నాయ్. అక్కడ పనిచేసే మనుషులు కొట్టుకుపోయి చనిపోతున్నారు. పరిస్థితి ఇలా ఉంటే మన ముఖ్యమంత్రేమో 24 కి.మీ. సొరంగం తవ్వుతాను, 240 మీటర్ల ఎత్తుకు నీళ్ళు పంప్ చేస్తాను అంటాడు. ఇదంతా ఆయన చేస్తాడనా!, కాదు. కమీషన్ కావాలి. పోలవరం నిధులు అయిపోయాయి. అక్కడ కొత్తగా వచ్చేదేమీ లేదు. కాబట్టి కొత్తగా ఒక 80 వేల కోట్ల ప్రాజెక్టు మొదలుపెడితే మళ్ళీ వీళ్ళు కమీషన్లు దండుకోవటం మొదలుపెడతారు. దాని కోసం చేస్తున్న సిగ్గుమాలిన చర్య బనకచర్ల ప్రాజెక్టు.

మన రాష్ట్రంలోనే ఇలా ఎందుకు జరుగుతోంది? మళ్ళీమళ్ళీ మనం దీనిని ప్రశ్నించుకోవాలి. నేనొక సామాన్య మానవుడిని. అటువంటి నేను ఈ విషయాలపై స్పందించవలసిన, ప్రశ్నించవలసిన అవసరం ఎందుకు వచ్చింది? వీళ్ళు చేస్తున్న ఈ దరిద్రాల వల్ల కాదా? రాష్ట్రాన్ని దోచుకోవటమే పనిగా వీళ్ళు పెట్టుకున్నారు. పెద్దలు చెప్పినట్లు కాయలున్న చెట్లకే రాళ్ళదెబ్బలు అన్నట్లు, ఈ రాష్ట్రం ఒక రత్నగర్భ. ఈ రాష్ట్రంలో వేరుశనగ దేశంలోనే మొదటి స్థానంలో ఉంది. వరి విషయంలో పంజాబుతో పోటీపడగలిగే ఏకైక రాష్ట్రం ఆంధ్రరాష్ట్రం. పూల వ్యవసాయం, ఫల వ్యవసాయం, అక్వాకల్చర్ దేనిని తీసుకున్నా భారతదేశంలో అత్యున్నత స్థానంలో ఉన్నది ఆంధ్రరాష్ట్రం. భారతదేశంలో డీప్ సీ పోర్టులు ఉన్న ఏకైక కోస్టల్ కారిడార్ మన రాష్ట్రంలోనే ఉంది. 900 కి.మీ. పై చిలుకు ఉంది. చక్కని పోర్టు ఉంది. అందుకని ఈ రాష్ట్రాన్ని కబ్జా చేయటానికి పూనుకుంటున్నారు. పోర్టులను అత్యంత చౌకగా ఆదానీకి కట్టబెట్టారు. కానీ, అడిగేవాళ్ళు లేరు. ఆపరేషన్ కగార్ అని మనం మాట్లాడుకుంటున్నాం గానీ, ఈ ఆపరేషన్ కగార్‌కు మూలం విశాఖ ఉక్కు. ఇప్పుడు అర్జంటుగా విశాఖ ఉక్కును తీసెయ్యాలి. తీసేసి చత్తీస్‌ఘడ్ నుండి ఇక్కడికి 12 లైన్ల రోడ్డువేసేసి అక్కడి ఖనిజసంపదను ఇక్కడకు తీసుకువచ్చి ఆదానీకి చెందిన గంగవరం పోర్టు నుండి పంపించాలి. ఇది దీని వెనుకున్న ముఖ్య ఉద్దేశ్యం. అందుకోసమే అక్కడ ఆపరేషన్ కగార్ పేరుతో ఆదివాసీలను చంపుతున్నారు. ఇక్కడేమో విశాఖ ఉక్కు ప్లాంటులో అందరినీ బయటకు పంపించేస్తున్నారు. 14 వందల మందిని ఏం చెప్పకుండా బయటకు తోసేశారు. ఇక నిర్వాసితుల పరిస్థితి మరీ దారుణం. ఉక్కు పరిశ్రమకు 22 వేల ఎకరాల భూమిని ఇస్తే వాళ్ళకు ఈ రోజుకు కూడా ఏమీ ఇవ్వలేదు. 12 వందల రూపాయలు మాత్రమే ఇచ్చారు ఎకరాకు. ఈ దోపిడీ అంతా కూడా మన రాష్ట్రం మూలకేంద్రంగా అదానీకానీ, అంబానీకానీ చేస్తున్నారు.

ఇక వెలుగొండ విషయానికొస్తే, 12 వేలకోట్ల ప్రాజెక్టు. దరిదాపు 6 వేల కోట్ల దాకా ఇప్పటికి ఖర్చు పెట్టారు. నిజంగా వెనుకబడిన ప్రాంతాలు అని రాయలసీమను, శ్రీకాకుళాన్ని అంటారు కానీ, నా దృష్టిలో బాగా వెనకబడిన ప్రాంతం ప్రకాశం జిల్లా. అక్కడ దరిదాపు 5, 6 లక్షల మంది ఫ్లోరైడ్ బాధితులు ఈ నాటికీ ఉన్నారు. పొద్దున్న లేవగానే వాళ్ళ దినచర్య ఏమిటంటే నీళ్ళకోసం ఎదురు చూడటం. అటువంటి ప్రాంతానికి జీవనాడి వంటిది వెలుగొండ. దీనిపై 2023-24 'కాగ్' నివేదిక ఏం చెప్పిందంటే, ఈ వెలుగొండ అనేది వైట్ ఎలిఫెంట్, దీంట్లో నీళ్ళు లేవు. మరి "వైట్ ఎలిఫెంట్" అయితే ఇన్ని వేలకోట్లు ఎందుకు ఖర్చుపెట్టారు? ఎందుకంటే కమీషన్ల కోసం. ఏదో ఒక ప్రాజెక్టు పెట్టటం, కమీషన్లు జేబులో వేసుకోవటం. ఇదుగో ఇప్పుడు

గోదావరి-బనకచర్ల గురించి మాట్లాడుతున్నారు. సాధ్యాసాధ్యాలు పక్కన పెట్టండి. వాళ్ళ కమీషన్లు వాళ్ళ జేబుల్లో పడ్డాక మళ్ళీ ఎత్తు తగ్గించాలంటారు. లేకుంటే తెలంగాణా వాళ్ళు అడ్డుపడుతున్నారంటారు. వీళ్ళే అర్థాంతరంగా ఆపేస్తారు. వాళ్ళ డబ్బులు ముట్టాయి. మరి దీనికి అయిన అప్పంతా ఎవడు భరించాలి? ఈనాడు ఆంధ్ర రాష్ట్రంలో 60 శాతం ప్రజానీకానికి ఒక్కొక్కరికి లక్షాయాభైవేల రూపాయల ఆస్తి ఉండకపోవచ్చు కానీ, అందరినెత్తిన లక్షాయాభైవేల రూపాయల అప్పు మాత్రం ఉంది. ఈ అప్పు ఎవరు తీర్చాలి?

నిన్న గాక మొన్ననే 'తల్లికి వందనం' అనే పేరిట విద్యార్థుల చదువుకొరకు సహాయం చేస్తున్నామంటూ ఆర్భాటంగా ప్రకటనలు గుప్పించుకున్నారు. గత ప్రభుత్వ హయాంలో 'అమ్మ ఒడి' అన్నారు. వాళ్ళ సొమ్ము కాదుగా ఏ పేరైనా పెడతారు. ఈ కార్యక్రమానికి డబ్బులు ఎక్కడ నుంచి వచ్చాయంటే 7 వేల కోట్ల రూపాయల బాండ్లు 7 శాతం వడ్డీకి 15 సంవత్సరాలకు కుదువబెట్టి చంద్రబాబు అప్పుతెచ్చాడు. ఎవడు కట్టాలి ఆ అప్పు? చంద్రబాబు కడతాడా? మనకు ఈ మధ్య కరెంటు మోత ఎక్కువై పోయింది. మనం ఎంత వాడుకున్నామన్న దానితో సంబంధం లేకుండా ట్రూఅప్ ఛార్జీల పేరిట విపరీతంగా బాదేస్తున్నారు. ప్రతి విషయంలోనూ ఇదేతంతు. ప్రజల మక్కుపిండి మరీ వసూలు చేస్తున్నారు. రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మారుస్తున్నారు. దీన్ని మనం ఎదుర్కోలేమా? అసలు నిజంగా రాష్ట్రం అప్పులకుప్పగా మారాల్సిన పరిస్థితి ఉందా అంటే లేదనేదే సమాధానం.

ఈ రాష్ట్రం కువైట్ దేశంకంటే ధనవంతమైన రాష్ట్రం. ఇది నేనేదో గాలివాటుగా చెప్పటం లేదు. రుజువులతో చెబుతున్నాను. మన రాష్ట్రంలో గోదావరి బేసిన్‌లో ఉండే అమలాపురం ప్రాంతం నుండి ప్రతి సంవత్సరం 2 లక్షల 50 వేలకోట్ల రూపాయలు గ్యాసు పట్టుకుపోతున్నారు. ఇది మామూలు గణాంకాల్లో చెప్పాలంటే 40 mscm లు (మిలియన్ స్టాండర్ట్ క్యూబిక్ మీటర్స్) గ్యాసును కొలిచే కొలమానం. ఇంత గ్యాసును ప్రతి సంవత్సరం పట్టుకుపోతూ మనకేం ఇస్తున్నారు అంటే చిల్లుకానీ కూడా ఇవ్వటం లేదు. మాట మాట్లాడితే చంద్రబాబు నాయుడుగారు నా దగ్గర డబ్బుల్లేవ్ అంటుంటాడు. గత సంవత్సరం సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం ఒక తీర్పు ఇచ్చింది. ఏమనంటే ఏ రాష్ట్రంలో అయితే ఖనిజాలు ఉంటాయో, ఆ రాష్ట్రానికి వాటి మీద పన్ను వేసే అధికారం ఉంది అని. అది కూడా అప్పటికి 3సంత్సరాల ముందు నుంచి ఈ పన్ను వసూలు చేసుకోమని కూడా చెప్పింది. మన రాష్ట్రం నుండి 2లక్షల 50వేలకోట్ల రూపాయల విలువైన గ్యాసు బయటకు పోతున్నది. దీనిమీద తక్కువలో తక్కువ 8శాతం పన్ను వేసినా కూడా, ప్రతి సంవత్సరం మన రాష్ట్రానికి 22 వేల కోట్ల రూ॥ వస్తాయి. తీర్పు వచ్చి ఏడాది గడచిపోయింది. ఎందుకు దానిని అమలు చేయటంలేదు? ఎందుకంటే ఆ అంబానీ దగ్గర డబ్బులు తీసుకొని జేబులో వేసుకుంటున్నారు.

అధికారంలోకి వచ్చినప్పటి నుంచీ వీళ్ళకు ఒకటే పిచ్చి. డబ్బు, డబ్బు, డబ్బు దాని కోసం ఏమైనా చేస్తారు. ఎంతైనా ప్రజలకు అసౌకర్యం కల్పిస్తారు. ఈ గ్యాసు వెళ్ళటం కోసం పొలాల్లో పైపులైనులు వేశారు. అవి ఉన్న పొలాలను ఆడపిల్లల పెళ్ళిళ్ళ సందర్భంగా ఇస్తానంటే ఎవరూ తీసుకోవటంలేదు. ఏమైనా ప్రమాదాలు జరుగుతాయేమోనని భయపడుతున్నారు. ఇవి రైతుల కష్టాలు. పోనీ వాళ్ళకేమైనా డబ్బులు ఇస్తారా అంటే ఇవ్వరు. అక్కడ 35 వేలమంది జాలరులు నిర్వాసితులయ్యారు. వాళ్ళకేమీ ఇవ్వలేదు. కానీ 65 లక్షల కోట్ల గ్యాసు ఉంది. ప్రపంచంలోనే మిథైల్‌హైడ్రేట్ అనే సంపద భూగర్భంలో మన దగ్గర ఉంది. ఈ రకంగా ప్రాజెక్టుల పేరుతో డబ్బులు తీసుకుపోతున్నారు. ఇంకోపక్క గ్యాసు పట్టుకుపోతున్నారు. మనకు మాత్రం ఒక్కరూపాయి కూడా ఇవ్వటం లేదు. ఇదంతా మనం భరించాలా? ఏం చెయ్యాలి మనం? దీనికి నేనొక సవాలు విసిరాను. నాకొక పార్టీ లేదు. నేను సోషల్ మీడియాను వేదికగా చేసుకున్నాను.

ఈ మధ్య మోడీ గారు ఒక యుద్ధం చేశారు. కాదు; చేశాననిపించాడు. కొండ నాలుకకు పోతే ఉన్న నాలుక ఊడిందన్నట్లుగా చేశాడు. కాశ్మీర్‌లో ఉగ్రవాదుల దాడుల్లో 26 మంది చనిపోయారు. నువ్వేం చేశావు అంటే ఇంకో 23 మందిని చంపేశావు. అనేక మందిని హాస్పిటళ్ళ పాలు జేశావు. నాలుగు రాఫెల్ యుద్ధ విమానాలు పోగొట్టావ్. సుఖోయ్ ఒకటి పోయింది. మిరాజ్ ఒకటి పోయింది. ఒక రాఫెల్ ఖరీదు 3 వేల కోట్లు అంటే 12 వేల కోట్లు అక్కడే పోయాయి. మొత్తం మీద 20 వేలకోట్ల సొమ్ము ఖర్చుపెట్టావ్. పోనీ ఇంతా ఖర్చుపెట్టినందుకు ఆ పెహల్గాం

ఉగ్రవాదులను ఏమైనా చంపివచ్చారా అంటే అదీ లేదు. మరి ఎందుకు వెళ్ళావ్ యుద్ధానికి? మళ్ళీ సీజ్‌ఫైర్ అన్నావే ఎందుకు? ఏం సాధించావు? అది కూడా సీజ్‌ఫైర్ అని ట్రంప్ చెబుతాడు, ఈయన చేస్తాడు. అసలు ట్రంపుకి ఏం సంబంధం? ఎక్కడో అమెరికాలో ఉన్న ట్రంపు చెబితే ఇక్కడ యుద్ధం ఆగిపోవటమేమిటి? ఇదేదో మ్యాచ్ ఫిక్సింగ్‌లా ఉంది. క్రికెట్‌లోనే మ్యాచ్ ఫిక్సింగ్‌లు అనుకున్నాంగానీ, యుద్ధాల్లో కూడా మ్యాచ్‌ఫిక్సింగ్‌లు మొదలయ్యాయన్న మాట. అక్కడ డబ్బులు పోతాయి. ఇక్కడ విమానాలు పోయాయి. కాకపోతే ఇక్కడ వాటికి డబ్బులు మనం కట్టాలి.

దీనిపై సోషల్‌మీడియా వేదికగా మేం ట్విట్టర్‌లో పోరాటం చేశాం. ఎందుకంటే ఈ మోడీ బాగా విష ప్రచారం చేసేది సోషల్‌మీడియా, ఎలక్ట్రానిక్ మీడియాలోనే. ఈ రెండూ ఆయన చేతుల్లోనే ఉన్నాయి. దరిదాపు 30 లక్షల గ్రూపులు ఉన్నాయి. ఇందులో వున్న వాళ్ళకు ఇంకేమీ పనిలేదు. జనాన్ని రెచ్చగొట్టటం తప్ప. దీనికి భిన్నంగా మేము ఒక 22 మందిమి గ్రూపుగా వాళ్ళను చాలా గట్టిగా ఎదుర్కొన్నాం. మీరేం సాధించారని ఈ సంబరాలు జరుపుకుంటున్నారని పదేపదే ప్రశ్నించాం. గంటకు 10 నుంచి 15 ట్వీట్లు చేశాం. అసలు ఆర్మీని నిర్దేశించటానికి నీకేం అధికారం ఉంది అని ప్రశ్నించాం. గెలవలేనివాడివి యుద్ధానికి ఎందుకు వెళ్ళావ్ అని అడిగాం.

ప్రజల మనసుల్లో మన భావాలు చొప్పించటానికి నేను ఎన్నుకున్న మార్గం సోషల్‌మీడియా. మేము పెట్టిన పోస్టింగులను చూసి అపోజిషన్ వాళ్ళు ప్రశ్నిస్తే, దానికి చంద్రబాబు బనకచర్లపై అపోహలు సృష్టిస్తున్నారని అంటున్నాడు. 190 టిఎంసిల పోలవరాన్ని నువ్వు 140 టిఎంసిలకు కుదించి, ఉత్తరాంధ్రకివ్వాల్సిన 60 టిఎంసిలు ఎక్కడ నుంచి తెచ్చిస్తావ్? వర్షం పడకపోతే ఉత్తరాంధ్ర పరిస్థితి ఏంటి? విశాఖపట్నం, విజయనగరంల నదులకు అనుసంధానం లేదు. అది గోదావరి మీదే ఆధారపడి ఉంది. మరి దానికి నీళ్ళు ఎవరిస్తారు? అని ప్రశ్నిస్తే అపోహలు సృష్టిస్తున్నారంటాడు.

గత ఎన్నికల్లో వారణాసిలో మోడీ నామినేషన్ వేశాడు. నామినేషన్ వెయ్యటానికే నేను మరొక మిత్రుడు వెళ్ళాం. రాజ్యాంగం ఎంత దరిద్రంగా తయారయిందంటే– ఇంతకు ముందు ఛీఫ్ ఎలక్షన్ కమిషనర్ కావాలంటే సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్, అపోజిషన్ లీడరు, ప్రధానమంత్రి ఉండేవారు. ఇప్పుడేం చేశారు? అపోజిషన్ లీడరు, క్యాబినెట్ మినిస్టర్, ప్రైం మినిస్టరు ఉంటారు. క్యాబినెట్ మినిస్టరు, ప్రైం మినిస్టరు ఒకటే పార్టీ కదా! ఇక అక్కడ ప్రజాస్వామ్యం ఏముంది? ఇక అక్కడ నుండి వచ్చే ఎలక్షన్ కమిషనర్ కూడా వాళ్ళ తొత్తే అవుతాడు కదా! టి.ఎన్.శేషన్ లాగా స్వతంత్రంగా పనిచేసిన ఎన్నికల కమిషనర్ ఒక్కడూలేడు. అలా చేస్తే ఉండలేడు, వీళ్ళు ఉండనివ్వరు, తీసేస్తారు. అలాంటి ఎన్నికల కమిషనర్ల కింద పనిచేసేవాళ్ళే రిటర్నింగ్ ఆఫీసర్లు. వాళ్ళు మాత్రం ఇంకెంత బాగా చేస్తారు? మాకుసవాలక్ష అడ్డంకులు పెట్టారు. మోడీ పోటీ చేసిన ఆ స్థానంలో వేసిన నామినేషన్ల సంఖ్య ఎంతో తెలుసా, ఏడంటే ఏడే, భారతదేశంలో అతి తక్కువ నామినేషన్లు వచ్చింది అక్కడే. అక్కడ ఏవో సాకులు చెప్పి మా నామినేషన్‌ను అంగీకరించలేదు. ఇదీ మన ప్రజాస్వామ్యం. ఇలాంటి ప్రజాస్వామ్యాన్ని నడుపుతున్న ఒక భయంకరమైన ఫాసిస్టు చేతిలో దేశం ఉంది.

నేను సర్వీసులో ఉండగా గుజరాత్ రాష్ట్రంలో పనిచేశాను. అక్కడ నేను ఒకసారి టాక్సీలో ప్రయాణం చేస్తూ ఉండగా నమాజువేళ అవటం వల్ల చాలామంది ముస్లింలు మా కారుకు అడ్డంగా వచ్చేశారు. కారు డ్రైవరు వాళ్ళను బండబూతులు తిట్టడం, నాకు భయమేసింది. వాళ్ళు చాలా మంది ఉన్నారు. డ్రైవరును హెచ్చరించాను నోరు అదుపులో పెట్టుకోమని. అప్పుడు అతనేమన్నాడంటే, వాళ్ళు ఇక్కడ బతకాలంటే అన్నీ మూసుకుని పడి ఉండాల్సిందే అన్నాడు. ఇదీ ఫాసిజం అంటే. గుజరాత్‌లో ఫాసిజం ఇలా ఉంటుంది. అలాంటి ఫాసిజానికి నాయకత్వం వహించినవాడు మోడీ. అలాంటి ఫాసిస్టు చేతిలో ఈ దేశం ఉందంటే, ఈ దేశం ఎటువైపు పోతుందో మనం ఆలోచించాలి. దీనిని మనం ఖచ్చితంగా ఎదుర్కోవాలి.

ఆంధ్రరాష్ట్రానికి వస్తే ఇక్కడ అధికార పక్షం గానీ, ప్రతిపక్షంగానీ మోడీ చేతిలో కీలుబొమ్మలు. ఒక పాత్రికేయ మిత్రునితో మాట్లాడుతూ ఈ మధ్య మీ ఆర్టికల్స్ రావటం లేదేమిటని అడిగాను. చాలా ఉన్నాయండీ సాక్షిపత్రిక వద్ద, బిజెపి వాళ్ళు క్లియరెన్సు ఇస్తే వేస్తాడట అన్నాడు. పవన్‌కల్యాణ్ గురించి మాట్లాడాలంటే అదో జోకర్ క్యారెక్టరు. ఎప్పుడు ఏం మాట్లాడతాడో తెలియదు.

ఒకరోజు 'మానాన్న హారతితో సిగిరెట్ వెలిగించుకునే వాడిన'ంటాడు. రెండో రోజు 'మాది చాలా సనాతనమైన కుటుంబం' అంటాడు. ఇంకోసారి చేగువేరా అంటాడు, తానో కమ్యూనిస్టునంటాడు, ఇక్కడ చాలా మంది కమ్యూనిస్టులతో తిరిగాడు కూడా ఒకప్పుడు. ఇప్పుడు తిరుపతి అశుద్ధమై పోయిందంటాడు కల్తీ నెయ్యి వల్ల. ఇదీ మన రాష్ట్రం పరిస్థితి. జోడు మద్దెల వాయింపు. ఒక పక్కనేమో వీళ్ళ మానాన వీళ్ళు దోచుకుపోతున్నారు. మరో పక్క కేంద్రం నుండి వాళ్ళు దోచుకుపోతున్నారు.

విశాఖ ఉక్కు ప్లాంటు పనిచేయటం లేదు అంటారు. 14 వేల కోట్లు డబ్బులిచ్చాను అంటారు. ఈ 14 వేల కోట్ల ప్యాకేజీలో ఫ్యాక్టరీకి గానీ, కార్మికులకు గానీ ఏమీ ఇవ్వలేదు. 8వేల కోట్లు బ్యాంకు రుణాలకు వాడుకున్నారు. 5వేలకోట్లు వి.ఆర్.ఎస్.కు వాడుకున్నారు. 1500 కోట్లు ట్యాక్సు రిటర్న్‌ల కింద తీసేసుకున్నారు. ఇదే విశాఖ ఉక్కు 1 లక్షా 25 వేల కోట్లు ట్యాక్సుల రూపంలో కేంద్ర ప్రభుత్వానికి కట్టింది. అది చెప్పరు. 14 వేల కోట్ల ప్యాకేజీ అని మాత్రం ఘనంగా ప్రచారం చేసుకున్నారు. ఎడాపెడా కార్మికులను తొలగిస్తున్నారు. 3 వేల మంది కార్మికులు పనిచేయాల్సిన కీలకమైన చోట్ల 2 వేల మంది కూడా లేరు. కార్మికుల కొరతవల్ల ఏదైనా ప్రమాదం సంభవిస్తే పరిస్థితి భోపాల్‌గ్యాస్ దుర్ఘటనను మించిపోతుందని ఎవరెంత మొత్తుకున్నప్పటికీ ప్రభుత్వాల చెవికెక్కటం లేదు.

ఇక ఇప్పుడు ఏది మాట్లాడినా బనకచర్ల అనే అంటున్నారు. రాష్ట్రంలో అనేక చిన్న తరహా ప్రాజెక్టులు ఉన్నాయి. 1200 కోట్లు ఖర్చుపెడితే వంశధార, నాగావళి అనుసంధానం అవుతుంది. ఎందుకని చెయ్యటం లేదు? వెలుగొండకు నీటి కేటాయింపులు లేవు. అదొక పెద్ద చిక్కుప్రశ్న. పేరులోనే వెలుగు తప్ప ప్రాజెక్టులో ఎప్పటికీ వెలుగురాదేమో ననిపిస్తుంది.

ప్రకాశం బ్యారేజి నుండి కిందకు నీరు ఒదులుకుని వెల్లటూరు రిజర్వాయర్‌లో వేసుకుంటే 3 టిఎంసిలు అవ్వవా. అక్కడ నుండి కావలసివస్తే నల్లమల రిజర్వాయర్‌కి ఎత్తిపోసుకోవచ్చు. రాయలసీమకు నీళ్ళు ఇవ్వవచ్చు. దీనికి ఎక్కువ ఖర్చు కాదు కదా! ఎంతో తక్కువ ఖర్చుతో అయిపోయే వీటిని మానేసి, 80వేల కోట్లు, లక్ష కోట్లు ఖర్చు అంటే, వీళ్ల కమీషన్ల కోసం మాత్రమే ఆ భారమంతా ప్రజలు భరించాల్సిందే. ఇలా చెప్పుకుంటూ పోతే ఎన్నో ఉన్నాయి. మనం చెయ్యాల్సింది ఒక్కటే, పోరాడటం, ఖచ్చితంగా పోరాడుదాం.

2029 ఎన్నికల కొరకు 'ఉత్తరాంధ్ర మేధావుల' ఐక్యవేదిక రూపకల్పన జరిగింది. అక్కడున్న 24 సీట్లలో మేం ఖచ్చితంగ వీళ్ళను ఈజీగా గెలవనివ్వం. గత ఎన్నికల సందర్భంగా చెప్పారు, స్టీలుప్లాంటు అమ్మనివ్వబోమని, నిర్వాసితులకు డబ్బులిపిస్తామని. కాంట్రాక్టు వర్కర్లందరినీ క్రమబద్ధీకరిస్తామన్నారు. అందుకే కదా గాజువాకలో అత్యధిక మెజారిటీతో గెలిపించింది, తెలుగుదేశం పార్టీని. కానీ వాళ్ళు ఇప్పుడు చేస్తున్నదేమిటి? అపాయింట్‌మెంట్ ఇవ్వరు. ఎవరూ కలిసిరావటం లేదంటారు. లేదంటే అమరావతిలో మీటింగులు ఉన్నాయంటారు. పిల్లి కళ్ళు మూసుకుని పాలుతాగుతూ ఎవరూ చూడటం లేదు అనుకుంటుందట. చూస్తున్నారు ప్రజలు!

నిజంగా మన ఖర్మ ఏంటంటే మూడవ శక్తి లేదు. అయితే క్రూరుడు లేదా నీచుడు. ఇదీ మన పరిస్థితి ప్రస్తుతం. మూడవ శక్తి ఉత్పన్నం కావలసిన అవసరం ఉంది. తెలంగాణాలో అదే జరిగింది. మూడవ శక్తి ఉత్పన్నమైంది. కేంద్రానికి అటువైపు వెళ్ళాలంటే భయం. అయినా వదిలిపెట్టటం లేదనుకోండి. మన దగ్గర కూడా మూడవ శక్తి రావాల్సిన సమయం ఆసన్నమైంది, వస్తోంది. ఉత్తరాంధ్రలో మేం స్థిరపడిపోయాం. వచ్చే నెల నుండి పాదయాత్రలు కూడా మొదలు పెట్టబోతున్నాం. బొజ్జా దశరథ రామిరెడ్డి గారి లాంటివాళ్ళు ముందుకు వచ్చి ప్రజా సమస్యలపై గళమెత్తితే వారితోపాటు మేము కూడా వచ్చి కలుస్తాం. అప్పుడే మనలను పీక్కుతింటున్న రాజకీయ పార్టీలకు గట్టి సమాధానం చెప్పగలుగుతాం. అందరికీ ధన్యవాదాలు.

## డా॥ కొల్లా రాజమోహన్

**నల్లమడ రైతుసంఘం నాయకులు**



అధ్యక్షులు ఝాన్సీ గారు, వేదిక మీద ఉన్న పెద్దలు, సభకు వచ్చిన రైతుకూలీ నాయకులందరికీ కూడా నమస్కారం. భారతదేశంలో ఉన్న విధంగానే మన రాష్ట్రంలో వ్యవసాయం చాలా కష్టంతో

కూడుకొని ఉంది. కష్టంతో అంటే వ్యవసాయం సంక్షోభంలో ఉంది అనే మాట అంటాము. వ్యవసాయం బాగా వుండాలి అంటే, మొదట కావాలసింది భూమి, తరువాత నీరు కావాలి. అందులో పండించటానికి మానవ శ్రమ, మనిషి కావాలి. ఈ రోజున భూమి గురించి మర్ల సోమసుందర్ ఒక్కరే చెప్పారు. తక్కిన వాళ్ళు పట్టించుకోలేదు దాని గురించి, తెలియక కాదు. అయితే నీరు గురించి, ప్రాజెక్టుల గురించి మాట్లాడారు. భూమి గురించి నేను ఎందుకు చెబుతున్నాను అంటే ఎక్కువగా స్వామినాథన్ సిఫార్సులలో కనీస మద్ధతు ధర (ఎంఎస్‌పి) గురించి చాలా ముఖ్యమైనదిగా చెబుతున్నారు.

కానీ ఆయన 2006లో సబ్మిట్ చేసిన రిపోర్టులో మొదటి రికమండేషన్ భూసమస్య పరిష్కరించమని చెప్పాడు. దాని గురించి రైతుకూలీ సంఘాలు, పార్టీలు, ప్రజలు మాట్లాడకపోవడం నాకు చాలా బాధగా ఉంది. కానీ ఈ రోజున నాకు చాలా సంతోషంగా ఉంది. మర్ల సోమసుందర్ ఒక పేపరు పూర్తిగా భూమి గురించి ఉన్నది. భూమి పరాధీనం అవుతున్నది, వ్యవసాయం చేసే వారి చేతుల్లో భూమి లేదు. వ్యవసాయం ఎవరు చేస్తున్నారు? అట్టడుగునున్నవారు ఏమీ చేయలేక వ్యవసాయం చేస్తున్నారు. వాళ్ళ దగ్గర డబ్బులు ఉన్నా, లేకపోయినా గానీ, కౌలుకు తీసుకొనైనా గానీ వ్యవసాయం చేస్తున్నారు. వాళ్ళేగానీ లేకపోతే ఈ రోజున వ్యవసాయం అనేది లేదు. మనం ఆహార ఉత్పత్తుల్లో స్వయం సమృద్ధి సాధించాము. పాలు, ఆహార నిల్వలు పెరుగుతున్నాయి. అలాగే 80 కోట్ల మందికి ఉచిత ఆహార పథకం కింద బియ్యం ఇస్తున్నాం అని మాట్లడుతున్నారు. కానీ వ్యవసాయాన్ని నిలబెడుతుంది ఎవరు అంటే అట్టడుగున ఉన్న చాలా కొద్దిగా భూమి ఉన్నవాళ్ళు, భూమి లేకపోయినా కౌలుకు తీసుకున్నవాళ్ళు ఈ రోజున వ్యవసాయాన్ని నిలబెడుతున్నారు.

కానీ ఈ భూమి సమస్యను పరిష్కరించకుండా దాని చుట్టూ ఉన్న సమస్యల గురించి మాట్లాడటం వలన ప్రయోజనం లేదు. ఎందుకనంటే భూమి నాది కాదు. నేను కౌలుకి తీసుకొని వడ్డీకి డబ్బులు తీసుకొని పెట్టుబడిగా పెట్టి వ్యవసాయం చేస్తున్నాను. ఇంత చేసినా కూడా పంట దిగుబడి రాకపోతే నేను ఏమి చెయ్యాలి? అప్పులపాలు అవ్వాలి. దాని కోసం రకరకాల పురుగు మందులు, ఎరువులు వేస్తాము, దానికి చాలా ఖర్చులు పెడతాము. ఎందుకోసం? అధిక దిగుబడి బాగా రావాలని. శాస్త్రవేతలు గానీ, సొంత భూమిదారులు గానీ భూమి పాడైపోతున్నది అని చెబుతుంటారు. పూర్తిగా ఎరువులు లేని, పురుగు మందులు లేని ఆరోగ్యకరమైన, ఆర్గానిక్‌గా పండించినవి కావాలి అని వినియోగదారుడు చెబుతున్నాడు. కానీ కౌలుకు తీసుకొని వ్యవసాయం చేస్తున్న రైతులకు, కౌలుదారులకు ఏమి కావాలి? తను పెట్టిన పెట్టుబడి తిరిగి రావాలి.

భూమి సమస్య పరిష్కరిస్తే భూమి ఎవరి చేతిలో ఉంటే వాడే వ్యవసాయం చేస్తాడు. అది చేయకుండా, భూమి ఎవడి పేరు మీదో వుంటుంది. వాడి బిడ్డలు అమెరికాలో ఉంటారు. భూమి కూడా వాడి పేరు మీదే ఉంటుంది. కౌలు కూడా వాడికే ఇవ్వాలి, కౌలులో ఒక్క రూపాయి తగ్గినా ఒప్పుకోడు. ఈ రోజున వ్యవసాయం అంతా కూడా వ్యవసాయం చేసేవాడి చేతిలో లేదు. అసలు 'దున్నేవాడికే భూమి' అనే నినాదం ఈ రోజు పనికిరాదని చెబుతున్నారు. ఆ నినాదం పని చేస్తుందో లేదో నాకు తెలీదు కానీ, వ్యవసాయం చేసేవాడి చేతిలో భూమి లేకపోతే ఖచ్చితంగా వ్యవసాయం సంక్షోభం నుండి బయటపడే అవకాశం లేదు. వ్యవసాయం చేసే వాడి చేతిలో భూమి పెట్టాలంటే నువ్వు ఏమి చేస్తావో మాకు తెలియదు, ఏదైనా నువ్వు చెయ్. మొత్తం ప్రభుత్వానికి అప్పగిస్తావా? ప్రజలకి అప్పగిస్తావా? లేకపోతే సీలింగ్ పెడతావా? ఏదైనా పెట్టు. స్వామినాథన్ గొప్ప అని చెప్పే వాళ్ళుం కూడా, భూసంస్కరణలను అమలు చేయాలనే ఆయన మొదటి రికమండేషన్ను డిమాండ్ చేయటం లేదు. భూమికి సీలింగ్ రూల్ పెట్టాలి. తరువాత భూమిని ఎవడికి బడితే వాడికి ఇవ్వకూడదు. అంబానీకి, అదానీకి ఎవడికి ఎంత భూమి కావాలి అంటే అంత భూమి వాళ్ళ చేతుల్లో పెట్టే పరిస్థితి నుండి బయటపడాలని స్వామినాధన్ చెప్పినా ఎవరూ దాన్ని పట్టించుకోరు, ఆ విధంగా ఆలోచించరు, అసలు బయటకు చెప్పరు. ఈ విధంగా ఆలోచించకపోతే వ్యవసాయ రంగ సంక్షోభం నుండి బయటపడే పరిస్థితి లేదు. ఇది మొదటిది.

ఇక రెండోది ఏమిటి అంటే, ఈ రోజున వ్యవసాయం చేసే వాళ్ళకి ఏమైనా మిగులుతుందా? ఉదాహరణకు ఉమ్మడి గుంటూరు జిల్లా, నెల్లూరు, కర్నూలు, నంద్యాల

వంటి కొన్ని ప్రాంతాలలో కౌలు రైతులు లేదా పెట్టుబడి పెట్టలేని వాళ్ళు కూడా అప్పోసొప్పో చేసి వ్యవసాయం చేస్తున్నారు. ఈ వ్యవసాయంలో గత సంవత్సరం, అంతకు క్రితం సంవత్సరం ఒక క్వింటా పొగాకు 15 వేలకు, 20 వేల రూపాయిలకు కూడా అమ్మారు. ఎకరాకి సుమారుగా 50 వేలు మిగిలింది. 50 వేలు ఏ పంటలో మిగులుతుంది? ఏ రకం అయిన పంటలకైనా లాభం వచ్చే పరిస్థితి లేనప్పుడు పొగాకు చాలా ఆశాజనకంగా ఉంది. చాలా మంది రైతులు పొగాకు వేశారు. కానీ, ఈ సంవత్సరం 'పొగాకు కొనము' అంటున్నారు. కొనము అని ఎందుకు అంటున్నారు? ఈ సంవత్సరం ఎక్కువమంది పొగాకు వేశారు కదా అంటున్నారు. వాస్తవానికి ఎక్కువ ఎకరాలు వేయలేదు, కానీ చాలా ఎక్కువ మంది రైతులు వేశారు. కాబట్టి దానిని ఉపయోగించుకొని అసలు తాము కొనబోమని, ఇప్పటి వరకు కొనలేదు. కొనకపోతే ఇప్పుడు ఏమి చేయాలి? అసలు ఏమీ లేనటువంటివాడు కూడా 30, 40 ఎకరాలు కౌలుకు తీసుకొని వ్యవసాయం చేసి, పెట్టుబడి సరిపోకపోతే, వాడి దగ్గర వీడి దగ్గర 5 రూ॥, 10 రూ॥ వడ్డీకి అప్పులు చేసిన వాడి పరిస్థితి ఇప్పుడు ఏమి కావాలి? గత 10, 15 రోజుల నుండి నలుగురు రైతులు చనిపోయారు. ఎందుకు చనిపోయారు? ఈ అప్పులు ఎలా తీర్చాలో తెలియదు. అప్పులు ఇచ్చినవాళ్ళు 'నీ పొగాకు అమ్ముడేపోలేదు, నా అప్పు ఎప్పుడు తీరుస్తావురా' అని వాళ్ళు అడుగుతుంటే ఒత్తిడి తట్టుకోలేక ఆత్మహత్య చేసుకుంటున్నారు. మేము చెబుతున్నాము పిచ్చోళ్ళారా ఆత్మహత్యలు చేసుకోవడం వల్ల ఏమిటిరా ఉపయోగం?! ఆ బాధ భార్యకు, పిల్లలకు ఉంటుంది. నువ్వు చనిపోయిన తర్వాత వాళ్ళు బాధపడాలా? నువ్వు చచ్చేముందు పోరాటం చేసి చావరా అని చెబుతున్నాం. కానీ, వాళ్ళ బాధ అటువంటిది.

ఎవడు కొనాలి? పొగాకు కంపెనీ వాడు కొనాలి. పొగాకు కంపెనీ వాడు ఎవడు? ఐటిసి కంపెనీ, గాడ్‌ఫ్రై ఫిలిప్స్ కంపెనీ, విఎస్‌టి కంపెనీ, బ్రిటీష్-అమెరికన్ టుబాకో కంపెనీ వంటి పెద్ద పెద్ద కంపెనీలు ప్రపంచంలో ఉన్న పొగాకును కొనడం దగ్గర నుండి సిగరెట్లు తయారు చేసి అమ్మే వరకు కూడా – మొత్తం వ్యవహారం చూసేది – ఈ 4, 5 కంపెనీలు మాత్రమే. ఈ 4, 5 కంపెనీలను ఏమంటారు? బహుళజాతి కంపెనీలు అంటారు. మన వాళ్ళు ఎప్పుడూ చెబుతుంటారు, ఎంఎన్‌సి (బహుళజాతి) కంపెనీలు అనేవి దోపిడీ చేస్తున్నాయి అని చెబుతుంటారు. అయితే అవి ప్రత్యక్షంగా కనబడవు. కానీ వాస్తవంగా ఈ రోజున పొగాకు పండించే ప్రాంతంలో ఆ రైతులు అంతా ఈ ఎంఎన్‌సి కంపెనీల దోపిడీని ప్రత్యక్షంగా అనుభవిస్తున్నారు. ఇంక ఏ విధంగా కూడా వ్యవసాయ రంగంలో ఎంఎన్‌సి కంపెనీల దోపిడీ అర్థంకాదు. ఒక భూస్వామి ఉంటే భూస్వామి వ్యతిరేక పోరాటం చేస్తాము. ఆ ప్రాంతంలో అలా కాదు. కంపెనీ యజమాని ఎక్కడో ఉంటాడు. వాడు మనకు కనిపించడు. ఐటిసి కంపెనీ దగ్గరకు వెళితే వాడు గేట్లు అన్నీ మూసేశాడు. ఒకడు వచ్చి మీరు లోపలకు వెళ్ళటానికి వీల్లేదన్నాడు. అయితే మేమంతా బయటే కూర్చుంటాం అని చెప్పి ధర్నా చేశారు రైతులు.

ఇక వీరు ఈ పొగాకుపై ఎంత సంపాదిస్తున్నారు అంటే, గత సంవత్సరం 20, 25 వేల రూపాయలకు కొన్న పొగాకును, ఈ సం॥ అసలు కొనటంలేదు. లేదా, 3, 4 వేల రూపాయలకు కొనుగోలు చేస్తున్నారు. లక్ష, లక్షన్నర రూపాయలు పెట్టుబడి పెట్టి వ్యవసాయం చేసిన సామాన్య రైతు, పేద రైతు ఏమి కావాలి? పొగాకు చాలా ఎక్కువ పండిందని, వాళ్ళకు కొనే అవసరం లేదనీ అనుకోవడానికి వీల్లేదు. అసలు ఈ పొగాకు లేకుండా ఏ సిగరెట్టు కూడా తయారు కాదు. 'సిగరెట్లు త్రాగకూడదు, ప్రమాదం, క్యాన్సర్ వస్తుంది, చనిపోతారు' అన్నప్పుడు పొగాకును నిషేధించవచ్చు కదా! గంజాయిని నిషేధించారు కదా!? అట్లాగే నిషేధిస్తే, గొడవే లేదు. లేదూ ఫలానా రకం పంట వేస్తే కనీస మద్ధతు ధరకు కొంటానని చెప్పండి. ఏ పంట వేయాలో చెప్పరు. ఈ పంట ఎందుకు వేశారు అని అంటారు. మొన్న ఒక కేంద్ర మంత్రి వచ్చినప్పుడు అడిగితే, మీరందరూ పొగాకు పండించారు. కాబట్టి, మేము కొనలేకపోతున్నాం అంటున్నాడు. అసలు ఏవిధమైన పంట వేయమంటావో చెప్పు, అది చెప్పరు.

ఒక సిగరెట్టు ఎంత బరువు ఉంటుందో తెలుసా. ఒక గ్రాము అంత కంటే తక్కువ ఉంటుంది. ఒక కేజీ పొగాకు మంచిది అయితే 150, 200 రూపాయలకు కొంటున్నారు. బాగా కొంటే 300 రూపాయలకు కొంటున్నారు. ఒక కేజీ పొగాకుతో 12,500 సిగరెట్లు తయారు చేయవచ్చు. ఒక సిగరెట్టు ఎంత ధర ఉంటుంది?

గోల్డ్‌ఫ్లాక్ ఒక్కొక్క సిగరెట్టు 10 రూ॥లు. 1 కేజీ 300 ధర పెట్టి పొగాకు కొనుగోలు చేస్తే 12,500 సిగరెట్లు వస్తాయి. అంటే ఒక 1 కేజీ పొగాకుతో 1,25,000 రూ॥ వస్తున్నది. 1,25,000లో 300 పోతే 1,24,700 కంపెనీ వాడికి లాభం మిగిలింది. 1,24,700 రూ॥లతో వాడు వ్యవహారమంతా నడిపిస్తున్నాడు. ఏమిటి ఆ వ్యవహారం అంటే వాడు ఫ్యాక్టరీ పెట్టాలి, జీతాలు ఇవ్వాలి, సిగరెట్లు తయారు చేయాలి. రిటైల్ దగ్గర కింద నుండి పై వరకు అందరికీ పంచుకుంటూ పోవాలి. పంచుకుంటూపోయినా తరువాత రైతుకు ఇచ్చేది మాత్రం ఆ 300 రూపాయలే. కానీ వాడికి మిగిలేది 1,24,700 రూపాయలు. ఇంత దారుణమైన దోపిడీ ఎక్కడా లేదు. ఈ దోపిడీ ఎవడు చేస్తున్నాడు? ఒక బహుళజాతి కంపెనీవాడి దోపిడీ అక్కడ ఉంది. ఈ డబ్బులన్నీ వాడు ఏమి చేస్తున్నాడు? వాడు ఈ రైతుల దగ్గర పిండి వసూలు చేసిన వాళ్ళకు లక్షల రూ॥ల జీతాలు ఇస్తాడు, షేర్ హోల్డర్స్‌కి ఇస్తున్నాడు. ఇది అంతా మాయజాలం. ఈ కంపెనీ సిఇఓ, మేనేజింగ్ డైరెక్టర్‌కి జీతం 25,16,00,000 రూ॥లు, ఒక నెలకు 2,09,33,333 రూ॥లు. ఒక సగటు భారతదేశ రైతు నెలసరి ఆదాయం 1667 రూ॥లు. అసలు ఏమైనా పోలిక ఉందా? రైతాంగ సంక్షోభానికి కారణమైన ఈ డబ్బులన్నీ బహుళజాతి కంపెనీలు తీసుకొని వెళ్ళి, వాళ్ళు అనుభవిస్తున్నారు. ఈ ఐటిసి కంపెనీవాడు 1912లో గుంటూరులో అద్దె ఇంట్లో ఉన్నటువంటి వాడు. ఇప్పుడు రింగు రోడ్డులో బ్రహ్మాండమైన వెల్కమ్ హోటల్ కట్టాడు. అందులో ఒక రోజు ఉండాలి అంటే అద్దె 6,800 రూ॥లు. అదంతా ఎక్కడి నుండి వచ్చింది? రైతుల దగ్గర నుండి దోచుకున్నదే. ఈ ప్రాంతంలో పొగాకు రైతుల రక్తమాంసాలను పిండి ఆ డబ్బులు సంపాదించిన టుబాకో కంపెనీలు, ఈ రోజున 'పొగాకు వెయ్యండి' అని చెప్పి ఇప్పుడు కొనడం లేదు.

ఇంకొక్క అంశం : వ్యవసాయంలో బహుళజాతి కంపెనీలు ఎలా చొరబడ్డాయి అంటే, ముందు విత్తనాలు తయారుచేసి అమ్మకం మొదలుపెట్టారు. పూర్వం విత్తనాలు అనేవి ఏవిధంగా తయారు చేసేవారు? పొలంలో పంట నుండి వచ్చిన మంచి గింజలను దాచుకుని, విత్తనాలుగా తర్వాత వాడుకునేవారు. కానీ ఈ రోజున విత్తనాలన్నీ షాపుకు వెళ్ళి కొనుక్కోవాలి. ఈ విత్తనాలు వాడు ఎలా తయారు చేస్తున్నాడు? వాడు ఒక చోట కొంతమంది రైతులతో విత్తనాలను తయారు చేయించి, అమ్ముతున్నాడు. మహికో, సింజెంటా, కార్గిల్ వీరంతా ఎక్కడి నుంచి వచ్చారు? రైతుకూలీ సంఘంగా 1990లలో ముందుగా డంకెల్ ప్రతిపాదనల గురించి వ్రాశారు. అసలు ఈ డంకెల్ అంటే ఏమిటి? మన భారతదేశంలో విత్తనాల దగ్గర నుంచి పురుగు మందులు, ఎరువులు అన్నింటి మీద, వ్యవసాయం మీద పూర్తిగా వాళ్ళదే పెత్తనం. మిర్చి గానీ, పొగాకు గానీ అసలు ఏ పంటకైనా పురుగుల మందులు ఉపయోగించకుండా దిగుబడి వచ్చే పరిస్థితి లేదు. వంకాయ, బెండకాయ, ఏ కూరగాయ అయినా వాడి కంపెనీ విత్తనాలు, కంపెనీ పురుగు మందులు, కంపెనీ ఎరువులు వాడనిదే దిగుబడి వస్తుందా? కొంతమంది 'ఆర్గానిక్ కావాలి, సేంద్రియంగా పండించిన పంటలు కావాలి' అంటున్నారు. ఎలా వస్తాయి? వ్యవసాయం చేయాలి అంటే వాళ్ళు నిర్ణయించిన విత్తనాలు, ఎరువులు, మందులు ఉపయోగించాలి. ఈ విధంగా బహుళజాతి కంపెనీలు వ్యవసాయంలోకి పూర్తిగా చొరబడ్డాయి.

ఇందాక చెప్పిన ఐటిసి కంపెనీ, వ్యవసాయానికి సంబంధించిన 140 రకాల బ్రాండ్‌ల వస్తువులు తయారు చేస్తున్నది. మనం గోధుమలు విసురుకోవడానికో, పట్టించుకోవడానికో లేదు; 'ఆశీర్వాద్' అట్టా వాడే తయారు చేస్తున్నాడు, మనం షాపుకెళ్ళి కొనుక్కోవడమే. బిస్కెట్స్, న్యూడిల్స్, చిప్స్ ఇవి అన్నీ కూడా వాడే వ్యవసాయ ఉత్పత్తుల నుంచి తయారు చేసి, మనకే అమ్మి విపరీతమైన లాభాలు సంపాదిస్తున్నాడు. మన దగ్గర ఏ రేటుకు కొంటున్నాడు? మనకు ఏ రేటుకు అమ్ముతున్నాడో పరిశీలిస్తే, వ్యవసాయ రంగంలో జరిగే దోపిడీ మనకు అర్థమవుతుంది. ఇక్కడ డైరెక్ట్‌గా మిర్చి, పొగాకు రైతులకు జరుగుతున్న దోపిడీని చూస్తే అర్థం అవుతుంది. బంగాళదుంపలు గుజరాత్‌లో రైతులు పండిస్తే, 'ఈ బంగాళదుంపల విత్తనం నాది, నేను తయారు చేసింది' అని చెప్పి కోటి రూ॥లు నష్టపరిహారం చెల్లించాలని కేసుపెట్టి కోర్టు నుంచి రైతులకు నోటీసులు పంపించాడు. ఎవడు వాడు? పెప్సీ అనే బహుళజాతి కంపెనీ. కోటి రూ॥లు చెల్లించాలి అని నోటీసులు పంపిస్తే, 'అసలు మేము కోటి రూపాయలు ఎప్పుడూ చూడలేదు, మేము

ఎక్కడ నుండి కట్టాలి, కట్టలేము' అని రైతులు చెప్పారు. భారతదేశంలో రైతులు, రైతు సంఘాలు పెద్ద గొడవ చేస్తే అప్పుడు అది సద్దుమణిగింది. అప్పుడు ఎన్నికలు కూడా దగ్గరలో ఉండటంతో, సమస్య పెద్దదవుతుందని, దానిని నుండి వెనకకు తగ్గారు.

ఇందాక మాట్లాడిన మహదేవ్ గారు చెప్పారు. కేజీ బేసిన్‌లో ఉన్న గ్యాస్ ఎక్కడికి వెళ్తున్నది? 1500 కి.మీ దూరంలో ఉన్న గుజరాత్ రాష్ట్రానికి వెళుతున్నది. ఎవరు తీసుకువెళుతున్నారు? అంబానీ తీసుకెళుతున్నాడు. అంబానీ ఏం చేసుకుంటాడు అంత గ్యాస్? అమ్ము కుంటున్నాడు. ఒక రోజుకు కోట్ల రూపాయల లాభం పొందుతున్నాడు. అంబానీకి వచ్చే ఆదాయంలో 30% లాభాలు, ఈ కేజీ బేసిన్‌లో నుండే వస్తున్నాయి. అంబానీకి వంద రూపాయల ఆదాయం వస్తే, అందులో 30 రూ॥లు ఒక్క మన కేజీ బేసిన్‌లో ఉన్న గ్యాస్ నిక్షేపాల నుంచే వస్తున్నది. ఒక్క గ్యాసే కాదు; పెట్రోల్, డీజిల్ లభిస్తున్నాయి. రాజమండ్రికి 30 కి.మీ దూరంలో ఉన్న ప్లాంట్‌లో శుద్ధి చేసి అమ్ముకుంటున్నారు. దానిలో మనకు ఏమైనా లాభం వస్తుందా? ఏమీ రావడం లేదు. ఆఖరికి కనీసం పన్నులు విధించడానికి కూడా లేదు. వాళ్ళను ఏ విధంగానూ కదిలించడానికి లేదు. ఈరోజున అంబానీ ఒకడిని చూపించి, వాడికి రాజ్యసభ సీటు ఇవ్వమంటే జగన్ ఇస్తాడు, చంద్రబాబు ఇస్తాడు. వాడు మంచివాడా, కాదా తర్వాత సంగతి, వాళ్ళు ఉండమంటే ఉంటారు, లేకపోతే లేదు.

రైతులు 'పొగాకు కొనండి, కొనకపోతే నష్టపోతామని' రోడ్ల మీదకు వచ్చి పెద్ద ఎత్తున పోరాటం చేస్తే, అప్పుడు వ్యవసాయశాఖా మంత్రి వచ్చి మూడు మీటింగ్‌లు పెట్టాడు. మూడు మీటింగ్‌లల్లో ఈ ఎంఎన్‌సి వాడు ఎంతటి వాడైనా గానీ, కొనేలా చేస్తామని చెప్పాడు. ఎవరూ కొనకపోతే అప్పుడు మేమే కొంటామని చెప్పాడు. ఫిబ్రవరి నుంచి గోల చేస్తుంటే ఇంతవరకూ కొనిపించింది లేదు, కొనిందీ లేదు. ఎదురుచూడటమే సరిపోతున్నది. ప్రజలకు మాయమాటలు చెప్పి సినిమాలో చూపించినట్లు ఆసక్తికరంగా, థ్రిల్లింగ్‌గా ఉండే రాజకీయ ఘటనలు అన్ని రాజకీయ పార్టీలకూ కావాలి. రాజధాని ప్రాంతంలో వేశ్యలు అన్నారని ఒక దాని మీద ఒక వారం రోజులు చర్చ, ఇంకొకడు ఏదో అంటే దాని మీద ఇంకొన్ని రోజులు చర్చ. కానీ అసలు సమస్యలైన తిండి సమస్య, వ్యవసాయ సమస్య, అప్పుల సమస్య, రేట్ల సమస్య, మద్దతు ధరల సమస్య మొదలైన వాటి గురించి ప్రజలు ఆలోచించకుండా అసలు సమస్యల గురించి పోరాటం చేయనీయకుండా పక్కదారి పట్టించి, చేస్తున్నారు. కులం పేరుతో, మతం పేరుతో ప్రజలను విడగొడుతున్నారు.

మీరు ఏ ఊరైనా, ఎక్కడికైనా వెళ్లండి ఇదే పరిస్థితి. ఇక్కడ ముఖ్యంగా రెండు రాజకీయ గ్రూపులు ఉన్నాయి. ఒకటి వైసిపి, రెండు టిడిపి పార్టీలు ఉన్నాయి. ఒకరి మీద ఒకరు నిందలు, దూషణలు, దాడులు చేసుకుంటూ ప్రజలను రెచ్చగొడుతూ బలిచేస్తున్నారు. ప్రజలను భావజాలపరంగా దిగజార్చి దుర్మార్గంగా, అన్యాయంగా మంచిని మంచి అనలేని దారుణ దుస్థితిలోకి తీసుకు వచ్చారు. ఈ సదస్సుకు హాజరైన వాళ్ళలో సగం మంది పెద్దవాళ్లే, ముందు వీళ్ళు పోట్లాడినా, పోట్లాడకపోయినా, ప్రజల భావజాలాన్ని సరైన పద్ధతిలో ఉంచడానికి ప్రయత్నం చేయాలి. పోరాటం ఖచ్చితంగా చేయాలి, పోరాటం చేస్తేనే నువ్వు సాధించగలవు, సాధిస్తేనే బ్రతకగలవు. ఆత్మహత్య శరణ్యం కాదు, పోరాటమే శరణ్యం అని చెప్పి ముందుకు నడిపించాలి.

పాలస్తీనాలో గాజాలో పోట్లాడుతున్నారంటే సాధారణమైనదా? టెక్నాలజీ ఇంత అభివృద్ధి చెందినా మూడు సంవత్సరాల నుండి చూస్తున్నాం ఇజ్రాయిల్ వాడు ఏమీ చేయలేకపోతున్నాడు. చనిపోయిన వాళ్లు చనిపోతున్నా, పోరాడే వాళ్ళు పోరాడుతున్నారు. అక్కడ చిన్నపిల్లల నుండి ముసలివాళ్ల వరకూ అందరూ పోరాడు తున్నారు. ఆ పోరాటం ముగించరానిది. పోరాడటం అనేది మానవుడికి పుట్టుకతోనే వచ్చినది, దానిని మనం మర్చిపోయి ఈ రాజకీయ మాయాజాలంలో పడి కొట్టుకుపోతున్నాం. మనం ఈరోజు పేపర్ చూస్తే, 'వాడు వీడిని అంటాడు, వీడు వాడిని తిడతాడు'. ఇదే మొత్తం ఉంటుంది తప్ప ప్రజా సమస్యలు గురించి మాట్లాడటం లేదు. ఒక్కసారి మనం ఆలోచిస్తే వ్యవసాయం అనేది చాలా తీవ్ర సంక్షోభంలో ఉంది. ఈ వ్యవసాయ సంక్షోభం నుండి బయటపడాలి అంటే ప్రధాన కారణాలను పరిష్కరించాలి. ఒకటి భూమి. ఆ భూమి సమస్య పరిష్కరించాలి. రెండోది, వ్యవసాయ రంగంలో బహుళజాతి కంపెనీలను అదుపుచేయాలి. ఆ విధంగా మనం అందరం

పోరాటం చేయాలి. ఇది ముఖ్యమైనది. నాకు ఈ అవకాశం ఇచ్చిన మీ అందరికీ కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను.

## శ్రీ అక్కినేని భవాని ప్రసాద్, ప్రజాతంత్రవాది



సభకు నమస్కారం. సభాధ్యక్షులు, రైతు కూలీ సంఘం రాష్ట్రాధ్యక్షులు కామ్రేడ్ ఝాన్సీ గారికి, అలాగే వేదికను అలంకరించిన పెద్దలందరికి, సమావేశానికి వివిధ ప్రాంతాల నుండి విచ్చేసిన సోదర సోదరీమణులకు, ముఖ్యంగా మనల్ని అలరించిన కళాకారులకు, అలాగే పత్రికా ప్రతినిధు లందరికీ కూడా నా నమస్కారం.

నేను గత 30 సంవత్సరాల నుండి ఒక సామాన్య కార్యకర్తగా, ఇరిగేషన్ రంగంలో కృషి చేస్తున్నాను. పులిచింతల ప్రాజెక్టు నిర్మాణం కోసమని కృష్ణా డెల్టా పరిరక్షణ సమితి అనేదాన్ని ఏర్పరిచి దాని ద్వారా మనవాళ్లు కృషి చేయడం జరిగింది. ఈ సదస్సు సందర్భంగా ఒక విషయాన్ని మీ దృష్టికి తీసుకు వస్తాను. మన రాష్ట్రానికి కృష్ణ, గోదావరి నదులు రెండు ప్రధానమైన నదులు. రెండు నదులకి కూడా మన రాష్ట్రం చివరి రాష్ట్రం. మన పైన ఇంకా అనేక రాష్ట్రాలు ఉన్నాయి. చివరి రాష్ట్రమవటంతో, వరదలు వచ్చినప్పుడు నీరంతా వచ్చేయడం వలన మన పంటలన్నీ మునిగిపోతూ, కరువు వచ్చినప్పుడు నీరు లేక ఎండిపోతూ ఉంటాయి. ఈ రెండూ నష్టమే కలిగిస్తాయి తప్ప, లాభం కలిగించవు. కానీ మనకి భౌగోళికంగా ఉన్న పరిస్థితిని మనం ఎదుర్కోవలసి ఉంటుంది. అలాగే ఈ కృష్ణా నదినే తీసుకున్నట్లయితే మహాబలేశ్వరం దగ్గర ప్రారంభమై మన హంసలదీవి వద్ద సముద్రంలో కలిసే వరకు సుమారు 1400 కిలోమీటర్లు ప్రయాణం చేస్తూ, మహారాష్ట్ర, కర్ణాటక, తెలంగాణ, చివర్లో ఆంధ్రాలో ఇక్కడ సముద్రంలో కలుస్తోంది. దీన్ని 1969లో జస్టిస్ బచావత్ అధ్యక్షతన ఒక కమిటీని ఏర్పరిచి ఒక ట్రిబ్యునల్‌ని ఏర్పరిచారు. ఈ ట్రిబ్యునల్‌కు 'కృష్ణా జలాలను వివిధ రాష్ట్రాల మధ్య ఎలా పంచాలి' అనే కార్యక్రమాన్ని కేంద్ర ప్రభుత్వం అప్పజెప్పింది.

వాళ్లు రాష్ట్రాలతోనూ, అన్ని ప్రజా సంఘాలతోనూ అనేక చర్చలు జరిపి కృష్ణా నదిలో సుమారు 2,120 టీఎంసీల నీరు సాగునీరుగా ప్రవహిస్తుందని తేల్చారు. దాన్ని ఆంధ్రప్రదేశ్‌కు 811 టిఎంసిలు, మహారాష్ట్రకు 560 టీఎంసీలు, కర్ణాటకకు 500 టీఎంసీల నీటిని కేటాయించారు. మన ఉమ్మడి రాష్ట్రానికి 811 టీఎంసీల నీరు రాగా, 2014లో మన రాష్ట్ర విభజన జరిగినప్పుడు, ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల అపెక్స్ కౌన్సిల్‌లో ఇద్దరు ముఖ్యమంత్రులు కూర్చొని ఆంధ్ర రాష్ట్రానికి 512 టీఎంసీలు, తెలంగాణకు 299 టీఎంసీల నీటిని వాడుకునేటట్టుగా ఒక అంగీకారానికి వచ్చారు.

ఈ అంగీకారం ప్రకారం మనకి నీటిని విడుదల చేయటం జరుగుతుంది. ఇది కాకుండా ఇంకో అంశం ఏమిటంటే, కృష్ణానదికి చివరి రాష్ట్రంగా ఉన్న ఆంధ్రప్రదేశ్‌కు 100 సంవత్సరాల కాలంలో 75 సంవత్సరాలు మాత్రమే నికరంగా కృష్ణానది జలాలు వచ్చే అవకాశం ఉన్నందువలన, ఆ మిగిలిన 25 సంవత్సరాలకుగాను జరిగే నష్టాన్ని భర్తీ చేసేందుకు మిగులు జలాలను వాడుకునే అవకాశాన్ని, హక్కుని కూడా ఈ ట్రిబ్యునల్ కల్పించింది. ఆ నీటిని వినియోగించు కోవాలంటే ఏదో ఒక ప్రాజెక్ట్‌ని రూపకల్పన చేయవలసి ఉంది. దాని ప్రకారమే మనం ఉమ్మడి రాష్ట్రంగా ఉన్నప్పుడు, హంద్రీనీవా వంటి ప్రాజెక్ట్‌లను మిగులు జలాల ఆధారంగా నిర్మించి, 'రాయలసీమకు నీళ్లు ఇవ్వాలి' అన్న ప్రతిపాదన ముందుకు వచ్చింది. దాని నిర్మాణం ప్రారంభించి నేటికి దాదాపు 30 సంవత్సరాలు అయింది. అది ఈనాటికీ పూర్తి కాలేదు. 'ఎందుకు పూర్తి కాలేదు?' అన్న ప్రశ్నకు ఇంతకుముందు మాట్లాడిన దశరథ రామిరెడ్డిగారు జవాబు చెప్పారు. 'ముఖ్యమంత్రులు ఎక్కువమంది రాయలసీమ వారే వచ్చారు. సంజీవరెడ్డి దగ్గర నుండి మొదలుపెట్టి నేటి చంద్రబాబునాయుడు వరకు చూస్తే ముఖ్యమంత్రిగా ఎక్కువ కాలం రాయలసీమ వారే ఉన్నారు. మరి 'రాయలసీమ వాళ్లే రాయలసీమ గురించి పట్టించుకోకపోతే ఇంక ఎవరు పట్టించుకుంటారు?' ఇది మన రాజకీయ పార్టీల దౌర్భాగ్య స్థితి. అధికారంలోకి వస్తున్న ప్రతి పార్టీ కేవలం ఈ ఐదేళ్ల కాలంలో తమ గురించి, తమ రాజకీయ భవిష్యత్తు గురించి ఆలోచించు కుంటున్నారు తప్ప, "మనం అధికారంలో ఉన్న ఐదు

సంవత్సరాలలో ప్రజలకు ఏం చేయాలి? ఎలా చేయాలి? ఈ ప్రజలకు మనం ఏ విధంగా ఉపయోగపడతాం?" అనే ఆలోచన మనకున్న రాజకీయ పార్టీలలో ఏ పార్టీకి కూడా లేదన్నది నిర్ద్వంద్వంగా చెప్పగలిగే వాస్తవం.

అలాగే ఈ నేపథ్యంలో చూసినప్పుడు ఇప్పుడు కొత్తగా "రాయలసీమను రత్నాలసీమగా మారుస్తాం" అన్న మాటలు మన నాయకుల నోటి నుండి వెలబడుతున్నాయి. 'దానికి నాంది, ప్రస్తావన ఏంట్రా' అంటే పోలవరం- బనకచర్ల. దానిని ఎందుకు కడుతున్నారు, దాని యొక్క ప్రాధాన్యత ఏంటీ అన్న విషయాలను ఇంతకుముందు మాట్లాడిన మహాదేవ్ గారు వివరించారు.

టెక్నికల్‌గా కూడా మేము ఒక సమావేశాన్ని నిర్వహించి ఆ సమావేశ వివరాలను, రాష్ట్ర నీటిపారుదల శాఖామంత్రి రామానాయుడు గారికి ఒక అప్పీల్ ఇవ్వటానికి వెళ్ళాము. "సార్! దీనివల్ల మనకి ఉపయోగమేమీ లేదు. ఇది నష్టం కలిగిస్తుంది దీనిని వెంటనే ఆపండి" అని చెబితే, ఆయన ఒకే ఒక మాట చెప్పాడు "బాబూ! ఇదంతా పెద్దాయన చూసుకుంటున్నాడు. నేనేమీ చెప్పలేను" అని. భారీ నీటిపారుదలశాఖా మంత్రే 'ఏమీ చెప్పలేను' అంటే, అధికారాలన్నీ కూడా ఒక వ్యక్తి చేతుల్లోకి వెళ్లిపోతున్నాయి అని అర్థం. రాష్ట్రంలో ముఖ్యమంత్రి చేతిలోకి, కేంద్రంలో అయితే ప్రధానమంత్రి చేతిలోకి. వాళ్లు తీసుకున్న నిర్ణయాలని అమలుపరుస్తున్నారే తప్ప, ప్రజాస్వామ్యయుతంగా పాలన జరగటం లేదు. "ప్రజాసంఘాలని, రైతుకూలీ సంఘాలని లేక ఇతర సంఘాలను కూడా పిలిచి దీన్ని నిర్ణయించవలసిన అవసరం ఉంది. రాష్ట్ర భవిష్యత్తుకు సంబంధించిన విషయం ఇది. కాబట్టి దీన్ని మీరు ఖచ్చితంగా ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి ముఖ్యమంత్రితో మాకు సమావేశం ఏర్పాటు చేయండి" అని అడిగితే, ఆయన నుండి ఇప్పటివరకు సమాధానం లేదు.

మరి 'ముఖ్యమంత్రి ఎలా ప్రవర్తిస్తున్నాడు' అన్నది మీరందరూ కూడా గ్రహించాలి. అసెంబ్లీలో ప్రతిపక్షం కూడా లేకపోవడంతో ఆయన ఎంతసేపూ ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకుంటున్నాడు. ఇవాళ ప్రజలే ప్రతిపక్షంగా మారాల్సిన పరిస్థితిని మనం చూస్తున్నాం. నేడు మనం మన ఉద్యమ విధానాన్ని, పోరాడే తత్వాన్ని "పోనీలే" అని వదిలేస్తే, రాబోయే తరాలకు తీరని అన్యాయం చేసిన వాళ్ళం అవుతామని, దీన్ని ప్రతి మనిషి ఆలోచించుకోవాలని మనవి చేస్తున్నాను.

ఎందుకంటే, ఆయన ప్రతిపాదించిన దాని ప్రకారం చూస్తే పోలవరం ప్రాజెక్టు దగ్గర నుండి అంటే పట్టిసీమ వద్ద ఉన్న 200 టీఎంసీల వరదనీటిని బనకచర్లకు తీసుకువెళ్తామంటున్నారు. వరద నీరు అంటే మహా అయితే గోదావరిలో ఒక 50 రోజుల పాటు ఉంటుంది. ఈ 50 రోజుల్లో 200 టిఎంసిల నీటిని సుమారు 400 కిలోమీటర్లు ప్రయాణం చేయించి 294 - 300 మీటర్ల ఎత్తుకి లిఫ్ట్ చేసి, 4 వేల మెగావాట్ల విద్యుత్తుతో, ఈ లిఫ్ట్ పంపులను పనిచేయిస్తూ, చివరిగా ఎక్కడో బనకచర్లలో పెడతామంటున్నారు. బనకచర్ల దగ్గర ఉన్న ప్రాజెక్టుకు అవసరమైన నీరు కేవలం 111 టీఎంసీలు మాత్రమే. ఆ 111 టీఎంసీల అవసరానికి పోతిరెడ్డిపాడు దగ్గర 44 వేల క్యూసెక్కుల నీరు పెంచి, శ్రీశైలం రైట్ మెయిన్ టన్నెల్ దగ్గర కూడా 44 వేల క్యూసెక్కులు చేస్తే ఖచ్చితంగా ఆ నీళ్లను మనం ఇవ్వగలం. దీనికోసమని 84 వేల కోట్లు ఖర్చుపెట్టి ప్రాజెక్టును నిర్మించాల్సిన అవసరం లేదు.

అలా అని నీరు అవసరం లేదా అంటే ఉంది. ప్రకాశం, నెల్లూరు జిల్లాలు కానీ ఇటువైపు కృష్ణా, గుంటూరు జిల్లాలలో ఇప్పటికీ నీటి కోసం అలమటించే ప్రాంతాలు ఉన్నాయి. 200 టీఎంసీల ఆ గోదావరి నీటిని తీసుకొచ్చి ఉపయోగించాలంటే, కృష్ణా నికర జలాలను ఏవైతే మనం వినియోగించుకుంటూ ఉన్నామో, ఆ పద్ధతిలో తీసుకురావాలి. అంతే తప్ప ఆ నీటిని ఇష్టారాజ్యంగా "కృష్ణా కెనాల్‌లో కలుపుతాము, లేకపోతే, శ్రీశైలం రైట్ కెనాల్‌లో కలుపుతాము" అలా ఎక్కడపడితే అక్కడ కలుపుతాం' అంటే అది సాధ్యం అయ్యే విషయం కాదు. దానివలన తీవ్రమైన పరిణామాలు సంభవిస్తాయి. కాబట్టి దీన్ని ప్రభుత్వం దృష్టిలో పెట్టుకోవాలని కూడా చంద్రబాబు నాయుడు గారిని అడుగుతున్నాం. "మీ చేతిలో అధికారం ఉండేది ఐదు సంవత్సరాలు పాటు. ఐదు సంవత్సరాలకి గానూ ఒక సంవత్సరం అయిపోయింది. మిగిలి ఉన్న నాలుగు సంవత్సరాలలో ఈ ప్రాజెక్టును మీరు కట్టలేరు. వచ్చే 5,10 ఏళ్లకు ప్రాజెక్ట్ స్పిల్ ఓవర్ అవుతుంది". ఇలా స్పిల్ ఓవర్ అయ్యే (కదలికలు లేకుండా నిలిచిపోయే) ప్రాజెక్టులన్నింటిని గురించి ప్రభుత్వం వీలైనంత ఎక్కువ మందితో చర్చలు జరిపి, అనేక సెక్షన్ల

ప్రజలను కూడా భాగస్వామ్యం చేసుకొని, వారి అభిప్రాయాలను కూడా తీసుకొని ముందుకు వెళ్లాలి. అలాకాకుండా మీకు ఇష్టం వచ్చినట్లు "మేము ఊహించాము, మేమే చేస్తాము" అన్న పద్ధతిలో వెళ్ళటం సరైనది కాదని, నేను వారికి సవినయంగా మనవి చేస్తూ ఉన్నాను. వారు ఖచ్చితంగా దీనిని గురించి పునరాలోచించాల్సిన అవసరం ఉంది. ఈమధ్య దక్కన్ క్రోనికల్ పత్రికలో ఒక వార్త వచ్చింది. అది ఏమిటంటే, శ్రీశైలం రైట్ మెయిన్ కెనాల్ యొక్క పరిధిని 80 వేల క్యూసెక్కులకు పెంచుతారంట. పోతిరెడ్డిపాడు రిజర్వాయర్ 44000 క్యూసెక్కులు ఉన్నప్పుడు ఇది 80 వేల క్యూసెక్కులకు పెరిగి, పోతిరెడ్డిపాడు కంటే ఎక్కువ ఎత్తు అయితే ఉపయోగపడదు కదా?! కేవలం కాంట్రాక్టుల కోసం, రాజకీయ నాయకుల యొక్క కమిషన్ల కోసం జరిగే ఈ కార్యక్రమాలన్నీ కూడా వాళ్ల జేబులు నింపుకోవడానికి, వాళ్ళు దోచుకోవడానికి చేస్తున్నవేనన్న ప్రజల అభిప్రాయం నూటికి నూరుపాళ్లు సరైనదేనని నేను అభిప్రాయపడుతున్నాను. కాబట్టి మనం దీన్ని ఖచ్చితంగా ఎదుర్కోవాల్సిన అవసరం ఉంది.

అలాగే ఇంతకుముందు వక్తలు చెప్పినట్లు కృష్ణా నదిలో 30 టీఎంసీల నీటిని పోలవరం నుండి వచ్చే 80 టీఎంసీల నీటి కోసం ఇప్పటికే మనం కోల్పోతున్నాం. అలాగే ఇప్పుడు ఈ 200 టిఎంసిల నీటిని కలిపితే మరలా ఇంకో 70, 80 టీఎంసీల నీటిని మనం కోల్పోతాం. అధికారులకి మాత్రమే లాభం కలిగించే ఈ పద్ధతిని మనం ఆమోదించవలసిన అవసరం లేదు. ఖచ్చితంగా ఇలాంటి దుర్మార్గపు నిర్ణయాలను ఎదుర్కోవాల్సిన అవసరం ఉంది. అలాగే 'గోదావరి జలాలలో 1400 టీఎంసీల నీటిని ఉమ్మడి రాష్ట్రంగా వాడుకోవచ్చు' అని చెబితే, ఇప్పుడు తెలంగాణ వాళ్లు ఏమంటున్నారు, 950 టీఎంసీల నీటిని మాకు ఇచ్చేయండని వాళ్లు అడుగుతున్నారు.

ఈ సమస్య పరిష్కారానికై ఒక ట్రిబ్యునల్‌ను వేసి, వాళ్ళ అవసరాలు ఏంటి, మన అవసరాలు ఏంటి, ఎవరెవరు ఎంత నీటిని వాడుకోవాలనిది స్పష్టంగా తేల్చాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వం మీద ఉంది. కానీ ఆ దిశలో కేంద్ర ప్రభుత్వం ఏరకమైన చర్యలూ చేపట్టడం లేదు. విజయ్ కుమార్ కమిటీ సిఫార్సులలో కొన్ని పొరపాట్లు ఉన్నాయి. ఉదాహరణకు ప్రపంచవ్యాప్తంగా 100 సంవత్సరాలలో, 75 సంవత్సరాల నికర జలాలను లెక్కించి దాని ఆధారంగా నీటిని కేటాయిస్తారు. కానీ ఆయన 65 సంవత్సరాలకి, 55 సంవత్సరాలకు కూడా నీటిని లెక్కించి, అందులో మిగులు జలాలను కూడా వివిధ రాష్ట్రాలకు కేటాయించడం జరిగింది. దానివల్ల నష్టపోయేది చివరి రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్. మేము అంతా విజయ్ కుమార్ ట్రిబ్యునల్ ఇచ్చిన తీర్పును ఖచ్చితంగా ఎదుర్కోవాలని, దానిలో ఉన్న పాయింట్స్ అన్నింటినీ కూడా ఆ రోజున ముఖ్యమంత్రిగా ఉన్న కిరణ్ కుమార్ రెడ్డి గారి దృష్టికి తీసుకెళ్తే, ఆయన వెంటనే రివ్యూ మీటింగ్‌ను ఏర్పాటుచేసి, అక్కడున్న ఇంజనీర్లు, లాయర్లు, ఆనాటి అడ్వకేట్ జనరల్ కూడా మేము చెప్పిన పాయింట్లను ఆమోదించగా, ఆయన సుప్రీంకోర్టులో ఎస్ఎల్‌పి వేశారు. కాబట్టి ఇవాళ ఇంకా బచావత్ ట్రిబ్యునల్ ద్వారా మనకున్న హక్కులను మనం కాపాడుకోగలుగుతున్నాం. కానీ రాబోయే రోజుల్లో, అసలు ప్రజల గోడు పట్టించుకోని, ప్రజా సంఘాలు చెప్పే అంశాలను ఆలోచించని ప్రస్తుత ప్రభుత్వాలు ఇలాగే ముందుకెళితే, మనకు భవిష్యత్తులో జరిగేదంతా నష్టమే. కాబట్టి ప్రజలందరూ చాలా అప్రమత్తంగా ఉండవలసిన అవసరం ఉంది. ఝాన్సీగారి లాంటి వాళ్ళు, మీలాంటి వాళ్ళందరూ ప్రతి ప్రాంతంలో కూడా దీని గురించి విస్తృతంగా చర్చలు జరపాలి, ఆలోచనలను రేకెత్తించాలి. మనం ప్రభుత్వానికి ఖచ్చితంగా మన యొక్క వ్యతిరేకతను తెలియజేయాల్సిన అవసరం ఉందని నేను అభిప్రాయపడుతున్నాను. ఈ నేపథ్యంలో చూసినప్పుడు ఈరోజు బనకచర్ల – పోలవరం అంటున్నాం. అసలు పోలవరం ప్రాజెక్టును 41.15 మీటర్లలో పూర్తి చేసి సరిపెట్టే ప్రయత్నాలను మనం చూస్తున్నాం. గత కేంద్ర ప్రభుత్వ బడ్జెట్లో 41.15 మీటర్లకు సరిపడా రీహాబిలిటేషన్ ఖర్చు ఏదైతే ఉందో, అంటే అప్పటికి సుమారుగా 20 వేల కుటుంబాలకు ఇవ్వవలసిన పరిహారాన్ని ఇచ్చేసి చేతులు దులుపుకునేటటువంటి ప్రయత్నం కేంద్రం చేస్తోంది. కానీ పోలవరం ప్రాజెక్టు 45.72 మీటర్ల ఎత్తు లేకుండా కడితే దానివలన తీవ్రమైన నష్టం జరిగేది మనకి. కాబట్టి ఖచ్చితంగా మనం దాన్ని ఎదుర్కోవాల్సిన అవసరం ఉంది. పోలవరం ప్రాజెక్టు ఖచ్చితంగా 45.72 మీటర్ల ఎత్తుతోనే కట్టాలి. దానికి కావలసినటువంటి నిధులు ఎంతైనా సరే. పోలవరం

ప్రాజెక్టు కేంద్ర ప్రభుత్వ ప్రాజెక్ట్‌గా ప్రకటించారు కాబట్టి, దాన్ని కేంద్ర ప్రభుత్వమే భరించాలని మనం డిమాండ్ చేయవలసిన అవసరం ఉంది.

అలాగే అన్ని రాజకీయ పక్షాలు కూడా ఆ విషయంలో ఏకాభిప్రాయంతో వ్యవహరించాలి. మన పక్కనున్న తమిళనాడు రాష్ట్రంలో కావేరీ జలాల విషయంలో వివాదం వచ్చినప్పుడు రాష్ట్రంలో ఉన్న అన్ని రాజకీయ పార్టీలు ఒకే వేదిక మీదకు వచ్చి, ఒకే మాట మాట్లాడాయి. మన దౌర్భాగ్యం ఏమిటో గాని, మనకు ఎన్ని పార్టీలు ఉన్నా, అన్ని పార్టీలను కలుపుకొని వెళ్లాల్సిన బాధ్యతను అధికారంలో ఉన్న పార్టీ గుర్తించదు. పోనీ, మాలాంటి వాళ్ళం 'ప్రజాసంఘాల వారందరితో కలిసి వెళ్దామని, కలిసి మాట్లాడదామం'టే అధికార పార్టీల వాళ్లు రారు. కాబట్టి ప్రజలే దీన్ని ఎదుర్కోవాల్సిన అవసరం ఉంది. ప్రజలే దీంట్లో భాగస్వామ్యం వహించి, దీన్ని ముందుకు తీసుకు వెళ్తారని ఆశిస్తూ, ఈ అవకాశం ఇచ్చినందుకు ధన్యవాదాలు తెలియజేసుకుంటూ సెలవు తీసుకుంటున్నాను.

## డా॥ ఎన్. వేణుగోపాల్‌రావు,

**వ్యవసాయ విశ్వ విద్యాలయ విశ్రాంత ఆచార్యులు**



వేదిక మీద ఉన్న ఝాన్సీ గారు, వర్మ గారు, అలాగే ఈరోజు పరిచయమైన మహదేవ్‌గారు, మిత్రులు రాజమోహన్ గారు, రైతుకూలీ సంఘంలో పనిచేస్తున్న అనేక మంది పెద్దవాళ్ళు, అనేక మంది రైతాంగం ఇక్కడ ఉన్నారు. మొదటే సాగునీటి వ్యవహారం గురించి, ప్రభుత్వాల అన్యాయం గురించి దశరథ రామిరెడ్డి గారు మాట్లాడారు. కొంతమంది దీన్ని ఇష్టపడతారు, కొంతమంది ఇష్టపడరు. కానీ, వాస్తవం అది. దాన్ని అంగీకరింపచేయడం సాధ్యతరమని ఝాన్సీ గారు అనుకున్నారు కాబట్టి, ఇంతమంది ఇక్కడకు వచ్చారు. ముఖ్యంగా వ్యవసాయానికి సంబంధించిన ఇంతమంది మహిళలు రావడం చాలా గొప్ప విషయం అని నేను అనుకుంటున్నాను. వాస్తవానికి నేను ఇక్కడికి రావడానికి కారణం కూడా అదే. ఝాన్సీ గారి ఆదర్శంతో కొంతమంది రావడం, వ్యవసాయం గురించి ఆలోచించడం చేస్తారని.

మొదట్లో వ్యవసాయం స్త్రీలకి సంబంధించిందే. మీలో చాలామంది గమనించే ఉంటారు, స్త్రీ లేనిదే వ్యవసాయం లేదని. కానీ ఇవాళ ఉన్న స్త్రీ పరిస్థితి ఏంటంటే, కనీసం 11-12 శాతం మంది స్త్రీలకు భూమి మీద, వ్యవసాయం మీద ఏ హక్కూ లేదు. ఇది నేను చెప్తున్నది కాదు; రెండు రోజుల క్రితం UNO తీర్మానం చెబుతోంది. 2026 ను, ఉమెన్స్ ఫార్మర్ ఇయర్‌గా UNO గుర్తించింది. మీరందరూ గుర్తుపెట్టుకోండి. ఎందుకంటే వ్యవసాయంలో ముఖ్య పాత్ర పోషిస్తున్న స్త్రీలకి వ్యవసాయం మీద ఏ హక్కూ ఉండదు. భూమి మీదా ఏ హక్కు ఉండదు. దాని ఫలితంగానే వారు బానిసల్లా పనిచేస్తారు. బానిసలు మాత్రమే వాళ్ళు. ఈ అంశాన్ని నాలుగు రోజుల క్రితం హిందూ పత్రికలో ఇద్దరు యుఎన్ఓ మహిళా ప్రతినిధులు రాశారు. మీకందరికీ ఈ విషయాన్ని చెప్పాలని నేను ఇక్కడ నిలబడ్డాను.

శోభనాద్రీశ్వరావు గారు, ఇంకా అటువంటి ముఖ్యులు 60-70 సంవత్సరాలు వయస్సు పైబడినా, కృషిచేస్తున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఒక వంద మంది ఏజెంట్లను పెట్టి ఒక ఛానల్ ద్వారా 'వీళ్ళందరూ తప్పుడు ప్రచారం చేస్తున్నారు. మీరు ఖండించండి' అని అందరినీ తిట్టిస్తున్నాడు. ఇంతటి హీనమైన పరిస్థితికి కారణం ఏంటండీ? ఇంతకు ముందు మహదేవ్ గారు చెప్పారు, రాజమోహన్ గారు చెప్పారు. దానికి కారణం ఏంటంటే, మనం మౌనంగా ఉండటమే. ఇది యోగాంధ్రప్రదేశ్ కాదు. ఇది మూగాంధ్రప్రదేశ్. మూగగా ఉన్నారు కాబట్టి, ఇది మూగాంధ్రప్రదేశ్. శాస్త్రవేత్తలు, అధికారులు అందరూ మూగవోయారు. ఇటువంటి ఉద్దేశ్యంతోనే ఇంతసేపు మాట్లాడుకుంటున్నాం. పరిష్కారం ఏమిటి? స్వామినాథన్ గారి సూచన అయిన గిట్టుబాటు ధరలు రావాలనే ఒక ముఖ్యమైన అంశాన్ని ప్రచారం చేసేటప్పుడు, భూమి సమస్యను కలిపారు. స్వామినాధన్ సిఫార్సులలో అన్నిటికంటే కీలకమైన అంశం, భూమి మాత్రమే. అది కాకుండా, ఎవరు అసలు రైతులు?' అనేది. రిటైర్డ్ కాబోయే ముందు స్వామినాథన్, చైనా అగ్రికల్చర్ సైన్సెస్ ల్యాబ్ సలహాదారుడుగా ఉన్నాడు. అక్కడ ఆయన గుర్తించిన ముఖ్యమైన విషయం ఏంటంటే, ఎవరైతే వ్యవసాయం చేస్తారో వాళ్ళకే భూమి ఉండాలి; లేకపోతే వదిలేసేయాలి, అంతే. అటువంటి పరిస్థితి రాకుండా భారతదేశం

బాగుపడదని చెప్పకనే చెప్పాడు. మీకు ఇంకో వుదాహరణ చెబుతాను. ఆయన ప్రత్యేకత గురించి చాలామంది చాలా విషయాలు మాట్లాడేవాళ్ళు ఉన్నారు. ఆయన తన కుటుంబంలో తల్లిదండ్రుల ద్వారా తనకు సంక్రమించిన 11-12 ఎకరాల భూమిని రైతులకు వదిలేసాడు. రెండోది, అన్నింటికంటే ముఖ్యమైనది, అనేక అంశాలు దేశ వ్యాప్తంగా చర్చించినప్పుడు, వ్యవసాయంలో జరగాల్సిన మార్పుల గురించి ఆయన మాట్లాడాడు. ఆ నివేదిక అందిన 10 సంవత్సరాల తర్వాత, వ్యవసాయ రంగంలో ముఖ్యులందరూ, చెన్నైలో మీటింగ్ పెట్టినప్పుడు, అందులో ఆయనను ఇలా అడిగారు : 'పది సంవత్సరాలు అయింది మూడు ప్రభుత్వాలు మారాయి – యూపీఏ ప్రభుత్వం ఉన్నప్పుడు నివేదిక ఇచ్చారు. ఎన్డీఏ ప్రభుత్వం వచ్చింది. వాళ్ళూ పట్టించుకోలేదు; వీళ్ళూ పట్టించుకోలేదు. మీరేమంటారు' అని అంటే ఆయన ఏం చెప్పాడంటే, "ప్రజల్లో చైతన్యం లేని పరిస్థితి దీనికి కారణం. ప్రజల్ని మీరంతా చైతన్యం చేయగలిగితే ఆటోమేటిగ్గా అవన్నీ అమలవుతాయి" అన్నాడు. మన చైతన్యం మొద్దుబారి పోయిందా? మన ఆంధ్రప్రదేశ్ ఈ పరిస్థితికి దిగజారిందా? కొల్లా రాజమోహన్ గారు మాట్లాడుతూ, దాదాపు అధికారులు, అనధికారులలో, జాదూగాళ్లు ఎక్కువైపోయిన తర్వాత ఇవన్నీ జరుగుతున్నాయి.

అందుకనే మిత్రులారా! ఇవన్నీ నేను నెగిటివ్‌గా మాట్లాడటంలేదు. వాస్తవం ఏంటంటే, మన చైతన్యం పెరగాలి; మనం పోరాడాలి. పొగాకు విషయంలో శోభనాద్రీశ్వరావు గారి వంటి పెద్దవాళ్ళంతా వచ్చి అధికారులతో మట్లాడినా చలనం లేదు. ఓకే అంటారు, మళ్లీ బయటికి పోగానే ఎవరి దారి వాళ్ళు చూసుకుంటారు. ఇంతవరకు ఇలా చూడలేదు. ఇవాళ కూడా ముగ్గురు రైతులు చనిపోయారు. ఆ పరిస్థితి రాకుండా మనం చూడాలి అంటేే, ఆంధ్రప్రదేశ్‌లో రైతు వ్యవసాయం అంటే కుటుంబ వ్యవసాయం నిలబడాలంటే ఏం చేయాలి? ఈ విషయాన్ని రైతుకూలీ సంఘం ఆలోచిస్తుందనే నమ్మకంతో మీ ముందు నిలబడ్డాను. నేను ఇప్పుడే ఈ రకంగా ఆలోచిస్తున్నానని అనుకోకండి. ఇంతకుముందు ఝాన్సీ గారి లాంటివాళ్ళో, శోభనాద్రీశ్వరరావు గారు లాంటివాళ్ళో నా మీద ప్రభావం చూపెట్టి, నేను సర్వీస్‌లో ఉన్నప్పుడు కూడా 'మనం వెళ్లే దారి తప్పుంది. ఏదో తప్పు చేస్తున్నాం. స్వీయ పరిశోధన చేసుకోవాలని భావించాను. హరిత విప్లవంతో బ్రహ్మాండమైన ఉత్పత్తులు వచ్చాయి. 50 మిలియన్ టన్నుల నుంచి 300 మిలియన్ టన్నుల వరకు ఉత్పత్తి పెంపుజేశాము. మనకి ప్రపంచంలో ఒక రకమైన ఆహార భద్రతను కల్పించుకున్నాం. 'మన మహిళలు, మన పిల్లలు బాగా ఉంటారు. మన భవిష్యత్ తరం బ్రహ్మాండంగా ఉంటుంది. భారతదేశం అద్భుతంగా ఉంటుందని' చెప్పి, పేపర్‌పై లెక్కలు చూపారు. ఏ వైస్‌ఛాన్సలర్ చెప్పినా అదే చెబుతా ఉంటాడు. మీరు గమనించే ఉంటారు వైస్ ఛాన్సులర్లు ఏ పరిస్థితుల్లో ఉన్నారో. మీరు చూసే ఉంటారు, కొంతమంది ప్రదర్శన చేస్తున్నారు, యోగా చేయండి అని. నాగార్జున యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రదర్శన చేస్తున్నాడు. నెల రోజులు యోగా చేస్తారంట. మే 21 నుంచి జూన్ 21 వరకు యోగా చేసి తరిస్తారంట. ఈ పరిస్థితుల్లో ఉంది భారతదేశం అని చెప్పడానికి, ఆంధ్రప్రదేశ్ ప్రత్యేకత మీ దృష్టికి తేవడానికి ఈ విషయం చెబుతున్నాను. ఇది వ్యక్తిగత విమర్శ కాదు. మనం ఆత్మ విమర్శ చేసుకొని, అసలు ఏంచేయాలి, మన ప్రత్యేకత ఏంటి అనేది తెలుసుకోవాలి.

ఆంధ్రప్రదేశ్ ప్రత్యేకత, మన సాగుభూమి. 2014లో రెండు రకాలుగా, అది కూడా స్వార్థపూరిత ధోరణిలో 60 మంది ఎమ్మెల్యేలు ఉన్న ఒక పార్టీ ప్రేక్షక పాత్ర వహించినప్పుడు జరిగిన కుట్ర. పెద్దపెద్ద కమిషన్లు 'రాష్ట్రాన్ని సమానంగా అభివృద్ధి చేయాలంటే ఇటువంటివి చేయొచ్చు' అని సూచించినా, వాటిని పరిగణలోకి తీసుకోలేదు. పెద్ద వారందరికీ తెలుసు, శ్రీకృష్ణ కమిషన్ గురించి. అది అదృష్టమో, దురదృష్టమో, శ్రీకృష్ణ కమిషన్ పర్యటనకు ముందే ఆంధ్రప్రదేశ్‌లోని హైదరాబాద్ కాకుండా మిగిలిన 23 జిల్లాలను సర్వే చేశాం. సర్వే చేసి, అక్కడ పరిస్థితులు, అసమానతలు ఎలా ఉన్నాయి? స్త్రీలు ఎలా ఉన్నారు? పిల్లలు ఎలా ఉన్నారు? రైతులు ఎంతమంది ఉన్నారు? ఏ పరిస్థితుల్లో ఉన్నారు? కొంత మాకున్న అవగాహన ప్రకారం కొంతమంది మిత్రులతో కలిసి వీటన్నింటినీ సర్వే చేసి, శ్రీకృష్ణ కమిషన్‌కి మా రిపోర్టును కూడా ప్రజెంట్ చేయడానికి మాకు అవకాశం దొరికింది. వారు కన్విన్స్ అయ్యారు. ఆయన అధ్యయనం చేసి, అన్ని విషయాలు తెలుసుకొని, 'ఈ రాష్ట్రంలో అసమానతలు అనేవి అన్నిచోట్ల ఉన్నాయి. రాయలసీమ,

నార్త్ కోస్టల్ జిల్లాలే కాదు. మొత్తం అన్ని జిల్లాల్లో అసమానతలు ఉన్నాయి. దీనికి కారణాలు ఎక్కడున్నాయి? ప్రభుత్వ లోపాలు ఏంటి?' ఈ అంశాలన్నీ క్రోడీకరించి ప్రభుత్వం ముందు పెడితే, వాళ్లు తీసుకున్న నిర్ణయం ఏమిటి? వెంటనే రాష్ట్రాన్ని చీల్చేశారు.

చంద్రబాబు నాయుడు గారు ఇక్కడ అధికారంలోకి వచ్చారు. తాను ప్రజా పరిపాలన చేస్తానని, పెద్ద ప్రచారం చేస్తే ఆయన్ని గెలిపించారు 2014లో. 2014 నుంచి 2019 దాకా ఏం చేశారు? దశరథరామిరెడ్డి గారు చెప్పినట్టుగా, ఎక్కడైతే నీళ్లు కావాలో, దాని గురించి ఆలోచించడు. ఎవడినైతే ఉద్ధరించాలో, అతని గురించి ఆలోచించడు. ఎక్కడైతే సారవంతమైన భూములు ఉంటాయో అక్కడికి వెళ్తాడు. 'వ్యవసాయం నుంచి సాగుభూమిని వ్యవసాయేతర పనులకు మరల్చకూడదు. ఈ దేశం నిజంగా భవిష్యత్తులో వ్యవసాయ ఆధారిత కుటుంబ వ్యవస్థగా నడవాలి అంటే, సారవంతమైన భూములను వ్యవసాయేతర పనులకు వాడకూడదు' అని స్వామినాథన్ రిపోర్టులో స్పష్టంగా రాశాడు. ఈ విషయాన్ని స్వామినాథన్ కూడా ఒకసారి గుర్తు చేశాడు. కానీ స్పందన లేదు. దాన్ని అవతల పడేశారు. కొన్ని వేల సంవత్సరాల నుంచి కూడుకొని ఉన్న ఒండ్రు నేలలో, రెండు – మూడు పంటలు పండే దాదాపు 30 వేల ఎకరాల్లో పెట్టి, ఇదే రాజధాని అని ఇక్కడ టవర్లు కడుతున్నాం' అని చెప్పారు. దీన్ని వ్యతిరేకించినవాళ్ళని పనికిమాలినవాళ్లని, అమాయక ప్రజల్ని రెచ్చగొడుతున్నారని చెబుతున్నారు. ఇరిగేషన్ ప్రాజెక్టులలో కానీ, క్యాపిటల్ కన్స్ట్రక్షన్‌లో కానీ ఎన్నో లోపాలు ఉన్నాయి. భవిష్యత్తు గురించి ఆలోచించకుండా 'నా కుటుంబం, నా తర్వాత నా కొడుకు, నా మనవడు పరిపాలించాలి' అని ఆలోచిస్తున్నాడు గాని, రాష్ట్ర భవిష్యత్తు గురించి ఆలోచించడంలేదు. అందరూ దృష్టిలో పెట్టుకోని, ఆలోచించండి. 'మనల్ని నాశనం చేసే ప్రభుత్వాలు వచ్చాయి. మనం మౌనంగా ఉంటే నష్టపోతాం' అని మళ్లీ మళ్లీ చెప్పడానికి నేను ఇక్కడ నిలబడి మాట్లాడుతున్నాను.

మనకి 80 లక్షల హెక్టార్ల సాగుభూమి ఉంది. మనకి అనుకూలమైన పరిస్థితులు చాలా ఉన్నాయి. బహుశా భారతదేశంలో ఎక్కడా లేని అవకాశాలు మన రాష్ట్రంలో చాలా ఉన్నాయి. అనేక రకాల వైవిధ్య పంటలున్నాయి. జీవనదులున్నాయి. అనేక నీటి వనరులున్నాయి. మనకి దాదాపు 1200 మిల్లి మీటర్ల వర్షపాతం నమోదయ్యే ప్రాంతాలు చాలా ఉన్నాయి. 600 మిల్లీమీటర్ల సగటు వర్షపాతం ఉండే ప్రాంతాలు కూడా ఉండొచ్చు. మనకున్న పంటల్లో వైవిధ్యత ప్రత్యేకంగా ఉంది. వ్యవసాయంలో కూడా వైవిధ్యత ప్రత్యేకంగా ఉంది. ట్రైబల్ అగ్రికల్చర్ నుంచి అధునాతన అగ్రికల్చర్ దాకా ఎంతో వైవిధ్యత మనకి కనపడుతుంది. అలాగే తిండి గింజల ఉత్పత్తిలో మనం ముందున్నట్లుగా ఇంతకుముందు చెప్పారు. వరిలో ముందున్నాం. అలాగే కూరగాయల విషయంలో, పండ్ల విషయంలో, పాల విషయంలో, చేపల విషయంలో, అనేక రంగాలలో ముందుకెళ్ళిపోయాం. మనల్ని గుర్తించారు. గ్రీన్ రెవల్యూషన్ విషయంలో మన రాష్ట్రం ప్రత్యేకంగా ఉందని అందరూ గుర్తించారు. ఇవి మనకున్న అవకాశాలు.

కానీ అవరోధాలు ఏమిటి? వ్యవసాయ రంగంలో మిగులు ఉన్నపుడు ఏం చేస్తారు? మామూలుగా ఆర్థిక సూత్రం ప్రకారం, వ్యవసాయ రంగంలో మిగులుని పరిశ్రమలకు వాడతారు. కానీ మన రాష్ట్రంలో ఏం జరిగింది? పరిశ్రమలు కాకుండా, సర్వీస్ సెక్టార్ పెరిగింది. వ్యవసారంగాన్ని కుంగదీసి, వ్యవసారంగం మీద కాలు వేసి తొక్కిపెట్టి, సర్వీస్ సెక్టార్‌ని పెంచారు. ఇవాళ విద్యా, వైద్య రంగాల పరిస్థితి ఏ రకంగా ఉందో చూశాం. నిన్న ఒకాయన అడుగుతున్నాడూ. 'ఏమండీ! ఈమధ్య మీ స్కూల్లో సంఖ్య బాగా పెంచేశారే, మాస్టర్స్‌ని పెంచుతా మన్నారు కదా! ఏమైంది' అని? వాడు పదిహేను వేలు ఇస్తా అంటున్నాడు, ఎవడొస్తాడండి?! ఎవడూ రాడండి!! దాదాపు 50 నుంచి 60 శాతం మంది ప్రైవేట్ స్కూళ్లలో పనిచేస్తారు. ఆ ప్రైవేట్ స్కూళ్ళు నడిపేదెవరు? ప్రభుత్వంలోని పాలకులు. ఇటువంటి దుస్థితి వచ్చింది మనకు. వ్యవసాయ రంగం పూర్తిగా నష్టపోయి, సర్వీస్ రంగం పెరిగిపోయింది.

మామూలుగా మనకి ఉన్న ఇంకో లోపం ఏంటంటే, అమెరికా వ్యవసాయాన్నో, లేక చైనా వ్యవసాయాన్నో, ఇంకొక వ్యవసాయాన్నో చూస్తాం. కానీ, "బతుకు భద్రత" లేదు. 'ఈ దేశంలో ఉన్న కుటుంబాలు బాగా బతకాలి. ఈ దేశానికి ఆహార భద్రత ఉండాలి. సోషల్ సెక్యూరిటీ ఉండాలి. మనం ఇంకొకరి మీద ఆధారపడకూడదు'. అనే అంశాలు గుర్తుపెట్టుకుంటే, మనం మన వ్యవసాయాన్ని

సంస్కరించుకోగలుగుతాం. మనం మామూలుగా మరొకరితో పోల్చుకోవచ్చు. ఇరాన్‌తోనో, జపాన్‌తో, కొరియాతోనో పోల్చుకోవచ్చు. కానీ మనకున్న పరిస్థితులు, మన వాతావరణం, మన భూములు, మన కుటుంబాల పరిస్థితులు భిన్నంగా ఉన్నప్పుడు, దానికి తగినట్టుగానే ప్రణాళికలు ఉండాలి. స్వామినాథన్ కూడా చాలా స్పష్టంగా చెప్పిన విషయం ఏంటంటే, భారతదేశానికి అనువైన వ్యవసాయ విధానాన్ని రూపొందించుకొని, కుటుంబ వ్యవసాయాన్ని రూపొందించుకొని (అంటే భారతదేశంలో ఉన్న నూటికి నూరు మంది వ్యవసాయంలో ఉండాలని కాదు). వ్యవసాయం మీద ఒత్తిడి తగ్గించాలి. వ్యవసాయం మీద ఒత్తిడి తగ్గాలంటే ఏం చేయాలి? ఆబ్సెంటివ్ ల్యాండ్ లార్డ్‌లు (గైర్హాజరీలోని భూస్వాములు) తగ్గిపోవాలి. వ్యవసాయం చేయని వాళ్ల చేతుల్లో భూమి ఉండకూడదు. డాక్టర్ రాజమోహన్ గారు ఒకటికి రెండు సార్లు ఈ విషయం చెప్పారు. స్వామినాథన్ ఈ విషయాన్ని చాలా స్పష్టంగా పేర్కొన్నాడు. ఆబ్సెంటివ్ ల్యాండ్ లార్డ్ మూలాన జరిగే నష్టమేమంటే, వ్యవసాయ రంగం ఇలా తయారవడం. మనకి ఉత్పత్తి కనపడతా ఉంటుంది. కానీ, రైతులు ఆత్మహత్య చేసుకుంటూవుంటారు.

ఈ 15-20 సంవత్సరాల్లో పాలకులు 'ఎన్నో సంస్కరణలు తెచ్చాం. ఎన్నో మార్పులు తెచ్చాం. కొత్త కొత్త వ్యవసాయ పద్ధతులు తీసుకొచ్చామని చెప్పటాన్ని మనం చూస్తున్నాం. ప్రకృతి వ్యవసాయం అని ఒకాయన; మరోపక్క బీజేపీవాడు ఆవు పేడ, గోమూత్రంతో వ్యవసాయం చేయాలని చెబుతున్నారు. ఈ రెండిటి మధ్య మనం నలిగిపోతూ ఉంటాం. ఈ రకమైన ధోరణలతో వ్యవసాయంలో ఉపాధి భద్రత నిలపడంలో విఫలయ్యారు. అట్లాగే కార్పొరేట్ల చేతుల్లోకి వెళ్లిపోయిన విత్తనాల పరిస్థితి గురించి డాక్టర్ గారు చెప్పారు. ప్రతి విత్తనాన్ని-గిరిజన ప్రాంతాల్లో తప్పించి-మైదాన ప్రాంతాల్లో ఉన్న ప్రతి రైతు మార్కెట్ కెళ్ళి కొనుక్కోవాలి. ఎంతో దోపిడీ ఉంటుంది. విత్తనాన్ని నీ ద్వారా తయారు చేయించి, 15-20 రెట్లు ధర పెంచి, తిరిగి మీకు అమ్ముతున్నాడు. దీని వల్ల రైతుకు నష్టం వస్తే, వాడు జవాబుదారీ కాదు. ఇటువంటి దాడి జరుగుతున్నప్పుడు మనం ఏం చేయాలి? దీని గురించి కూడా ఆలోచించాలి.

మనకి 80 లక్షల హెక్టార్ల భూమి ఉందని అనుకున్నప్పుడు, దాదాపు 30 నుంచి 35 లక్షల హెక్టార్లు వరి వ్యవసాయానికి పోతుంది. రాయలసీమ జిల్లాల్లో తక్కువ నీళ్లు ఉన్న ప్రాంతాల్లో కూడా వరి పంటవేస్తే బాగుంటుందనే రైతులు ఎక్కువ మంది కనపడుతున్నారు. అది చాలా దురదృష్టకరమైన పరిస్థితి. ఇవాళ ఏదో ఇద్దరు ముగ్గురు ప్రచారం చేసి ప్రత్యామ్నాయ పంటలు జొన్న, సజ్జ, లేదా ఇటువంటి పంటలు పండించమని ప్రచారం చేస్తుంటే, కొంత పెరిగింది కానీ, అంతకు ముందు మనకున్న మూల వనరులన్నీ పోగొట్టుకున్నాం కదా! ఇవాళ మూల వనరులు కావాలంటే ఆదివాసీలైన వాళ్ల దగ్గరే మొత్తం ఉన్నాయి. అలాగే వాణిజ్య పంటలు పెరిగాయి. పత్తి, మిర్చి, ఇటువంటి వాటిల్లో ఇరుక్కుపోయాం. నిన్న ఒక పెద్ద మనిషి ప్రకృతి వ్యవసాయం మీద పెద్ద ఉపన్యాసం చెప్పాడు. దాదాపు 28 నుంచి 30% ప్రకృతి వ్యవసాయం చేస్తున్నారట. రసాయనాలు వాడట్లేదట. కానీ ఇవ్వాళ ఆంధ్రప్రదేశ్ నంబర్ వన్ ఇన్ ద కంట్రీ ఇన్ యూజింగ్ కెమికల్స్. మనం ఊహించలేం. రసాయన ఎరువుల వాడకంలో గానీ, పురుగుమందుల వాడకంలో గానీ దేశంలో నెంబర్ వన్ గా ఉన్నాం మనం. ప్రకృతి వ్యవసాయం ఏమైంది? ఏం సమాధానం చెబుతారు? ప్రకృతి వ్యవసాయం ఎందుకు చేయట్లేదు వాళ్ళు? ఎందుకు అందరూ గోవులను పెంచుకోవట్లేదు? అందరూ పేడ నీళ్లు వేసి కూర్చోవచ్చు కదా! అధికారులు కూడా ఆలోచించే పరిస్థితి లేదు. ప్రకృతి వ్యవసాయం కోసం 100 కోట్లు ఖర్చు పెట్టారు. అజిత్ ప్రేమ్‌జీ అనే ఒక పెద్ద మనిషి ఒకాయన, దానధర్మాలు చేసి ప్రకృతి వ్యవసాయం చేయండి అని చెప్పాడు. ఒక కంప్యూటర్ కంపెనీ ఆయన డబ్బులు ఇస్తే ఆ డబ్బులతో మాలాంటి ఒక పదిమందిని పోగు చేసి, 'ఏం చేయబాకండి. పేడ నీళ్లు కొట్టండి. మెదలకుండ కూర్చొని చూస్తా ఉండండి.' ఇదే ప్రకృతి వ్యవసాయం' అని మాతో ఉపన్యాసాలు చెప్పించారు. మీ అందరినీ చూసి ఒక విషయం చెబుతున్నా. ఉదయం మిత్రులు చెప్పినట్టు, మీ అంచనాకి మీ ప్రాంతంలో ఉన్న జల వనరులను చూసినట్లయితే, మొత్తం ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న జల వనరులన్నింటితో ఉపరితల నీటి ద్వారా ప్రతి ఎకరా సాగు చేయడానికి దాదాపు ఒక పంటకి సరిపోతుందని నిపుణులు అంచనా వేశారు. సుందరయ్య

గారు మొత్తం ఆంధ్రప్రదేశ్‌లోని నీటి వనరులని సర్వే చేసి, ఒక ఎకరానికి గ్యారెంటీ ఉండేటట్టుగా, నమ్మకమైన వ్యవసాయం జరిగేట్టుగా నీటి వనరులు ఇవ్వడానికి అవకాశం ఉందని చెప్పారు. అట్లాగే ఐఏఎస్ ఆఫీసర్లు శంకర్, యుగంధర్ గారు కలిసి ఇంకొక సర్వే చేసి, ఈ రాష్ట్రంలో ఉన్న భూమి అంటే ఆబ్సెంటీ ల్యాండ్ లార్డ్స్ చేతుల్లో లేకుండా, దేవాదాయ భూములు, చర్చి భూములు, మసీదు భూములు పంపిణీ చేసినట్లయితే, ఈ రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి రెండు, మూడు ఎకరాల భూమి ఇవ్వవచ్చని తీర్మానం చేశారు. ప్రతి రైతు కుటుంబానికి మూడు ఎకరాలు ఇవ్వడానికి అవకాశం ఉన్నంత భూమి మన దగ్గర ఉందని రాజశేఖర్ రెడ్డి మంత్రివర్గంలోని ఒకాయన తీర్మానం చేశాడు. భూస్వాముల భూమి పునః పంపిణీ గురించి గానీ, సాగునీటి పునః పంపిణీ గురించి గానీ పాలకులు ఎప్పుడన్నా ఆలోచించారా? పట్టించు కున్నారా? ఊరికే పట్టించుకున్నట్టు నటించారు కానీ, పట్టించుకోలేదు. పట్టిసీమ, బనకచర్ల, ఇవన్నీ పాలకవర్గం బడాయి. అక్కడ ఏం జరగదు. మిమ్మల్ని అంతా మోసం చేస్తారు.

అమెరికా లాంటి దేశంలోనే తిరగబడిన మేఘ లాంటి అమ్మాయిని చూశాం. 'ఇది అన్యాయం, అక్రమం' అని ప్రకటించింది. ఇక్కడ మనం మాట్లాడటం లేదు. అంతకంటే అన్యాయం వుందా? రైతులు పురుగుమందులు తాగి చచ్చిపోతున్నారు. అయినా మనం చూస్తూ ఊరుకుంటున్నాం. నేను, రాజమోహన్ గారు, ఇటువంటి మిత్రులు కొందరు కలిసి అగ్రికల్చర్ యూనివర్సిటీలోనే ఒక మీటింగ్ పెట్టాం. అయ్యా! మనం పరిశోధనలు చేస్తున్నాం. వ్యవసాయంలో ముందున్నామని చెబుతున్నాం. రైతులకి కొత్త కొత్త సాంకేతిక పరికరాలు ఇచ్చామని చెబుతున్నాం. మరి రైతులేంటి ఈ రకంగా ఉన్నారు? ఎవరూ వ్యవసాయం చేయడానికి ఇష్టపడట్లేదు. వ్యవసాయం చేసేవాడు చచ్చిపోతున్నాడు. మరి మన బాధ్యత ఏమిటంటే, ఎవరూ మాట్లాడటం లేదు. మామూలుగా అక్కడి అధికారులు కూడా ఇంట్రెస్ట్‌గా కూర్చోలేదు అక్కడ. ఈ పరిస్థితి ఉన్నప్పుడు మనం ఏం చేయాలనేదే మనం ఆలోచించాలి.

మనం ఇంకా చాలా సంస్కరణలు చేసుకుంటూ వచ్చాం. అంతకుముందు మన చంద్రబాబునాయుడు గారే చిత్తూరు జిల్లాలో 'కుప్పం వ్యవసాయం' అని ఇజ్రాయిల్ నుంచి ఒక కంపెనీని తీసుకొచ్చి కుప్పం వ్యవసాయం సాగించారు. దానితో కలిసి వ్యవసాయం చేస్తే రైతులందరకూ బ్రహ్మాండంగా ఆదాయం వస్తుంది. బెంగళూరుకి, అక్కడ చుట్టుపక్కల ఉన్న పట్నాలకు పంపించొచ్చు అని చెప్పి, రైతులను ఊరించి భూమి తీసుకుని వ్యవసాయం మొదలెట్టారు. మూడు సంవత్సరాల తర్వాత 'మాకు ఈ వ్యవసాయం వద్దు బాబోయ్' అని ఎటోళ్లు అటు వెళ్లిపోయారు. ఆ కంపెనీవాడు కూడా వెళ్ళిపోయాడు. ఏమైంది? కాంట్రాక్టు వ్యవసాయం అని తర్వాత ఇంకొక ఆయన వచ్చాడు. వరంగల్ జిల్లా జనగాం దగ్గర కాంట్రాక్టు వ్యవసాయం సాగించాడు. సంవత్సరం అవ్వగానే ఎటోళ్లు అటు వెళ్లిపోయారు. అసలు వీళ్ళు ఈ రకమైన తమాషా ఎందుకు చేస్తున్నారు? మహదేవ్ గారు చెప్పారు. అధికారం నుండి బయటికి వెళ్ళిన తర్వాత అడ్రస్ ఉండదు. వాళ్ళు పెట్టిన పథకాలు విఫలమవుతాయి. మళ్లీ భవిష్యత్తు తరాన్ని నాశనం చేస్తారు అనే విషయాన్ని ఇక్కడ మళ్ళీ గుర్తు చేయడానికి చెబుతున్నాను. ఆ కుప్పం వ్యవసాయం కానీ, ప్రకృతి వ్యవసాయం కానీ వ్యవసాయ యూనివర్సిటీ ఎందుకు చేయట్లేదు? వ్యవసాయ యూనివర్సిటీ ఎందుకు అసలు? అడిగారా ఎప్పుడైనా? వ్యవసాయ శాఖ ఎందుకు? నాలాంటోడు ఎవరైనా అడిగితే నోరు మూసుకొని కూర్చోవయ్యా! నీకు ఎందుకు? అని అంటారు. వ్యవసాయ శాఖ ఎందుకు? మీరందరూ మమ్మల్ని పోషిస్తున్నారు. మాలాంటి వాళ్ళని ఎందుకు పోషిస్తున్నారు? ఎందుకు పెట్టాలి మాకు తిండి?

ఇప్పుడు మ్యాక్స్ చట్టం (మ్యూట్యువల్లీ ఎయిడెడ్ కో-ఆపరేటివ్ సొసైటీస్ యాక్ట్) అని ఒకటి వచ్చింది. మామూలుగా పరస్పర సహకారంతో, ప్రతి రైతుకు పాత్ర ఉండేటట్టుగా డయరీలు పెట్టాం మనం. పది, పదిహేను డయరీలు పెట్టాం. ఇవాళ డైరీ పరిస్థితి ఏంటి? ప్రతిదాన్నీ దాని ఓనర్ సొంతం చేసుకున్నాడు. ఉదాహరణకు విశాఖపట్నంలో ఉండే విశాఖ డయరీ, గుంటూరు సంగం డయరీ. మ్యాక్స్ చట్టాన్ని పనికిరాకుండా చేశారు. మ్యాక్స్ చట్టం చాలా ఉన్నతమైనది. ప్రొడ్యూసర్స్ కోఆపరేటివ్ సొసైటీ అని ప్రచారం చేస్తున్న ప్రభుత్వం, ఆ మ్యాక్స్ చట్టాన్ని గౌరవించనప్పుడు ఏం జరిగిందో గుజరాత్‌లో

చూసాం; ఇప్పుడు ఆంధ్రప్రదేశ్‌లో చూస్తున్నాం. ఇది దౌర్భాగ్యమైన పరిస్థితి. దీన్ని మనం గుర్తుపెట్టుకోవాలి.

ఆంధ్రప్రదేశ్‌లో ఈ 15-20 సంవత్సరాల్లో 8-9 రైతు కమిషన్లు వేశారు. ఎందుకయ్యా! ఈ రైతులు ఇంత మంది చనిపోతున్నారు. (నేను వాస్తవానికి ఎక్కువసేపు మాట్లాడలేను. ఎందుకు ఎక్కువసేపు మాట్లాడుతున్నానంటే, మిమ్మల్ని చూసి నా మనసులో మాట చెప్పడానికి అవకాశం ఉందని మాట్లాడుతున్నాను. మీలాంటి పోరాటం చేయాలి. మనం అంతా కలిసి ఏదో ఒకటి చేయాలి అని ఆశపడే వాళ్లని చూసినప్పుడు వచ్చిన ప్రేరణతో మాట్లాడుతున్నాను. నన్ను క్షమించండి. నేను ఎక్కువ మాట్లాడితే. జరుగుతున్న విషయాలన్నిటిని మీ దృష్టికి తీసుకురావడానికి ప్రయత్నం చేస్తున్నాను.) ఇవాళ ఉన్న వనరులన్నింటినీ దుర్వినియోగం చేస్తున్నారు. నేను కొత్తగా చెప్పిన విషయాలు కాదు ఇవి. స్వామినాథన్ గారి కమిషన్ లేదా ఇంతకుముందు పెద్దవాళ్లు కేశవరావుగారి లాంటివాళ్ళు చూసిన విషయాలు. వ్యవసాయం ఈ విధంగా నడవదు. వ్యవసాయం భూసంస్కరణ దగ్గర నుంచి, నీటి సంస్కరణ దగ్గర నుంచి, పంటల సంస్కరణ దగ్గర నుంచి, మనం అనుసరిస్తున్న వ్యవసాయ విధానాలు మార్చుకునే దగ్గర నుంచి సూచనలు చేశారు. వాళ్లలో ఇద్దరు, ముగ్గురు స్త్రీలు కూడా చాలా ప్రముఖ పాత్ర పోషించారు. వాళ్లందరూ గుర్తు చేసింది ఏమిటంటే, మనం ఎగబడి ఎక్కడి నుంచో తీసుకొచ్చి, పెట్టుకోనవసరంలేదు. ఇక్కడున్న వనరులు ఉపయోగించుకొని, ఇక్కడున్న వ్యవసాయదారుల్ని కొద్దిగా ఆలోచింపజేసి, వాళ్లకి అండగా ఉండే ప్రభుత్వం ఉంటే ఇక్కడ వ్యవసాయం నిలబడుతుంది అని సూచించారు. వ్యవసాయ మిషన్ అప్పుడు పెట్టారు. వ్యవసాయ మిషన్ ప్రతినిధి ఒకాయన చెప్పేది ఏమిటంటే 'మాకు ముందు ప్రకృతి వ్యవసాయం ప్రసాదించండని' చెబుతున్నాడు. 'రైతుల్ని రక్షించండి. ప్రభుత్వం బాధ్యత ఇది. మీరు చెప్పే అన్ని రకాల సంస్కరణలు ఇక్కడున్న చట్టాలకి తట్టుకునే టట్టుగా, స్థానికంగా ఇబ్బందులు కలిగించని పద్ధతులు పాటించండి' అని చెప్పి సూచించాల్సింది పోయి, ఆవు పేడ తెచ్చుకొని ఉపయోగించండి అని చెబుతున్నారు. ధరల స్థిరీకరణ నిధి అని పెట్టారు. అంటే ఈ ధరలు ఇలా ఉండేట్టుగా, రైతులు నమ్మేట్టుగా - రేపు పత్తి రేట్ ఇంత ఉంటుంది. పొగాకు రేటు ఇంత ఉంటుంది. మిర్చి రేట్ ఇంత ఉంటుంది అని మార్కెట్ స్థిరీకరణ ఉండాలంటే ప్రభుత్వ జోక్యం ఉండాలి. అది ఎక్కడైనా ఉండొచ్చు. ప్రపంచంలో చాలా దేశాల్లో వుంది. పార్లమెంటులో నిర్మలా సీతారామన్ కూడా చెప్పారు. మరి ఏమైంది? పత్తి అంతా రోడ్డు మీద పడేసి, ఉల్లిపాయలన్నీ పారబోసే పరిస్థితి వస్తే ప్రభుత్వం ఏం చేస్తోంది? అగ్రికల్చర్ మినిస్టర్ చెప్పాడు, ధరల స్థిరీకరణ నిధి తీసుకొస్తామని. ఆచరణ లేదు. డాక్టర్ గారు గత మూడు నెలల నుంచి పొగాకు రైతుల గురించి తిరుగుతున్నాడు. ఎంతో మంది అధికారులను కలిశాడు. కంపెనీ వాళ్ళని కలిశాడు. 'మేము రైతుల కోసమేనండి. మా ప్రభుత్వం రైతుల కోసం అని' చెబుతారు. కానీ ఆచరణలో ఉండదు.

అందుకని ఈ అంశాలను దృష్టిలో పెట్టుకొని తాత్కాలిక ఆకర్షణలకి లొంగకుండా, ఆల్టర్నేటివ్ ప్రభుత్వం కావాలని - మహాదేవ్ గారు చెప్పింది నాకు నచ్చింది. జగన్ గారు బాగోలేదు, చంద్రబాబు గారు బాగోలేదు. ప్రత్యామ్నాయ ప్రభుత్వం కావాలి. ఎవరన్నా కమిషన్ వేస్తే, ఆ కమిషన్ సిఫార్సుల్ని అమలు చేయాలి. అటువంటి కేంద్ర ప్రభుత్వం లేదు, రాష్ట్ర ప్రభుత్వం లేదు. అటువంటి ప్రభుత్వం కావాలి. దానికోసం ప్రయత్నం చేయాలి. మనం పోరాటం చేస్తే ఇవన్నీ జరిగే పరిస్థితి వుంది. మీరందరూ చూసే ఉంటారు - చాలామంది యువతులు బయటికు వచ్చి మాట్లాడుతున్నారు. మీరు అటువంటి దారిలో ఉండాలని రైతుకూలీసంఘం అటువంటి పోరాటాలు చేస్తుందని ఆశిస్తూ సెలవు తీసుకుంటున్నాను.

## కా॥ వర్మ

**రైతుకూలీ సంఘం (ఆం.ప్ర.) రాష్ట్ర కార్యదర్శి**



సభాధ్యక్షులు, వేదిక మీద ఉన్న పెద్దలు, సదస్సుకు హాజరు అయిన వివిధ జిల్లాల నుంచి వచ్చిన రైతులు, మేధావులు అందరికీ రాష్ట్ర కమిటీ తరఫున విప్లవ అభినందనలు తెలియ జేస్తున్నాను. ఈరోజు ఉదయం నుంచి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక, రైతాంగ వ్యతిరేక విధానాల గురించి మనం మాట్లాడుకుంటూ ఉన్నాం. వక్తలు కూడా

రకరకాల రూపంలో దేశంలో ఏం జరుగుతుంది? రాష్ట్రంలో ఏం జరుగుతుంది? మనం ఏం ఆలోచించాలి? అనే విషయాలపై ఇచ్చిన సందేశాలు చాలా విలువైనవి, ముఖ్యమైనవి. వెనకబడిన రాయలసీమ ప్రాంతంలోని ఇరిగేషన్ సమస్యలు కానీ, అక్కడ ప్రజల సమస్యలు గానీ, దశరథ రామిరెడ్డి గారు మాట్లాడారు.

రాయలసీమకి, ఉత్తరాంధ్రకి వెనకబడిన ప్రాంతాల, ప్రత్యేక నిధులు, ప్రత్యేక కేటాయింపులు ఉంటాయని చెప్పి ఈ పాలకులు, గత పాలకులు అనేక సందర్భాల్లో, అనేకసార్లు మాట్లాడుతున్నా ఇప్పటికీ ఆ ప్రాంతాల్లో వెనుకబాటుతనం, పేదరికం, కరువు, వలసలు పెరుగుతూనే ఉన్నాయనే విషయం మనకు అర్థమవుతుంది. తూర్పు కనుమలకు ఆనుకొని ఉండటం వలన ఉత్తరాంధ్ర ప్రాంతంలో జీవ గడ్డలు కానీ, నదులు కానీ, ముఖ్యంగా వంశధార, నాగావళి పెద్ద నదులు, దానితోపాటు 7-8 ఉపనదులు, అనేక గడ్డలు పారుతున్నా కూడా తీవ్రమైన కరువు ఎందుకు ఉంది? అంటే, అక్కడ ఉన్న ప్రాజెక్టు లన్నిటినీ పెండింగ్‌లో పెట్టారు. దాదాపు 40 సంవత్సరాల క్రితం జంఝావతి ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసి, ఒరిస్సాతో ఉండే సమస్యల సాకుతో దాన్ని ఈరోజుకీ పూర్తి చేయలేదు. వంశధార రెండో దశ ప్రాజెక్ట్ కూడా ఒరిస్సా సమస్యతోటే పెండింగ్ పడి ఆగిందని ప్రచారం చేస్తున్నారు. వాస్తవానికి ఆ రాష్ట్ర ప్రభుత్వాల ఆటంకాల కంటే మన పాలకులకి చిత్తశుద్ధి లేకపోవడం వలననే పెండింగ్ ప్రాజెక్టులు ఏవీ కూడా పూర్తి కావడం లేదు. అదేవిధంగా అక్కడ ఉన్న నీటి వనరులు, చిన్న చిన్న ప్రాజెక్టులు కూడా మెయింటెనెన్స్ లేకుండా వున్నాయి. గతంలో నిర్మాణంలో ఉన్న తోటపల్లి వంటి ప్రాజెక్టులకి కూడా పూర్తిస్థాయిలో నీరు అందలేని పరిస్థితి ఉందనే విషయాన్ని మనం గమనించాలి.

పాలకులు విశాఖపట్నాన్ని ఆర్థిక రాజధాని అని, దానికి బ్రహ్మాండంగా సముద్ర తీర ప్రాంతం ఉందని, మూలపాడు నుంచి కాకినాడ వరకు మేము కొత్త ఎక్స్‌ప్రెస్ హైవేలు వేస్తున్నాము అని చెప్పి మాట్లాడుతున్నారు. అదేవిధంగా ఇవాళ వైజాగ్ పోర్ట్ నుంచి నేరుగా రాయపూర్ కేంద్రానికి గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే పేరు తోటి ఆరు వరుసల, ఎనిమిది వరుసల రోడ్లు వేస్తూ ఉన్నారు. ఈ రోడ్లన్నీ కూడా ఒరిస్సా, చత్తీస్‌ఘడ్, ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న ఏజెన్సీ ప్రాంతాల మీదుగా వేసిన రోడ్లుగా, మనకి అభివృద్ధిగా చూపిస్తున్నారు. వాస్తవానికి ఆ ప్రాంతంలో ఉండే వనరులన్నింటినీ కూడా నేరుగా పోర్టుకు ఎగుమతి చేసుకోవడానికి, ఇతర దేశాల నుంచి దిగుమతి చేసుకున్న వస్తువుల్ని నేరుగా రాయపూర్ లాంటి కేంద్రాలకి తరలించడానికి ఆ రోడ్లను వేస్తున్నారు తప్పితే, ప్రజల అభివృద్ధి కోసం లేదా అక్కడ ఉన్న గిరిజనుల అభివృద్ధి కోసం అని చెప్పుకుంటున్నవేవీ వాస్తవాలు కాదు. ప్రజలు కేంద్రంగా ఇక్కడ అభివృద్ధి జరగడం లేదు. ప్రజల కోసం అభివృద్ధి చేయడం లేదు. మల్టీ నేషనల్ కంపెనీలకి, బహుళజాతి కంపెనీల అవసరాలకి, వాటి దోపిడీ ప్రయోజనాల కోసం, వాళ్ళు ఇస్తున్న పథకాలను విశాఖపట్నం కేంద్రంగా ఏ గవర్నమెంట్ వచ్చినా ప్రకటిస్తూ ఉంది.

అందులో భాగంగా విశాఖపట్నం కేంద్రంగా మన పాలకులకు లక్ష ఎకరాల భూమి కావాలంట. ఆ లక్ష ఎకరాల సమీకరణ కోసం ఇవాళ భూములు ఎక్కడెక్కడ ఖాళీగా ఉన్నాయి?, లేదా ఏ ప్రాంతంలో రైతుల భూములను తీసుకోబోతున్నారో అక్కడి భూములను ఖాళీ చేయించే పద్ధతుల్లో ఇవాళ సర్వే జరుగుతున్న పరిస్థితి ఉంది. కాబట్టి, మన పాలకులు ప్రజల జీవితాలను విధ్వంసం చేస్తూ, ప్రజల జీవితాలను సర్వనాశనం చేస్తూ ఇంకోపక్క కంపెనీలలో ఉద్యోగాల కోసం మేము ఇదంతా చేస్తున్నామంటూ ఉన్నారు. గత పాలకులని, ఈ పాలకులని మా ప్రాంతానికి వచ్చినప్పుడు మేము ఒకటే అడిగాం. ఉత్తరాంధ్ర ప్రాంతంలో పూర్వం నుంచి చాలా జూట్ మిల్లులు ఉన్నాయి. అవన్నీ వ్యవసాయధారిత పరిశ్రమలు. అదేవిధంగా, పంచదార మిల్లులు ఉన్నాయి. ఈ పంచదార మిల్లుల్ని, జూట్ మిల్లుల్ని మీరు రక్షించండి! అందులో పొందుతున్న ఉపాధి కానీ, దానిమీద ఆధారపడిన రైతాంగానికి కానీ అవి చాలా అవసరం అని చెప్పి మేము అనేక సందర్భాలలో అడిగినప్పుడు, ఇద్దరూ వాగ్దానాలు చేశారు. ఇద్దరూ అధికారంలోకి వచ్చినప్పుడు కూడా, నూటికి నూరు శాతం పంచదార ఫ్యాక్టరీలు, జూట్ మిల్లులు మూత పడిపోయి ఉన్నాయి. అదేవిధంగా ఫెర్రోఎల్లాయిస్ ఫ్యాక్టరీలు కూడా విద్యుత్ చార్జీల భారం పెరగడంతోటి మూత పడిపోయి ఉన్నాయి. ఉన్న ఉపాధి అవకాశాలన్నిటినీ ధ్వంసం చేస్తూ, స్టీల్ ప్లాంట్ లాంటి ఫ్యాక్టరీలను మూసివేస్తూ, కొత్తగా మిట్టల్ ఫ్యాక్టరీకి నక్కపల్లి దగ్గర వేలాది ఎకరాల

భూములు ఇస్తున్నామని, ఆ కంపెనీకి సొంతగనులు ఇస్తున్నామనే పేరుతో ఈ ప్రభుత్వం పెద్ద ఎత్తున ప్రచారం చేస్తూ వుంది. అంటే, మన ప్రభుత్వరంగ విశాఖ స్టీల్ పరిశ్రమను మూసివేసి, ఒక ప్రైవేట్ మిట్టల్ కంపెనీ వాడితో కొత్త ఫ్యాక్టరీ పెట్టబోతున్నామని మాట్లాడు తున్నారంటే, ఈ పాలకులు ఎవరి పక్షాన ఉన్నారో చాలా స్పష్టంగా అర్థం అవుతుంది. ఇప్పటికే కిరండల్ ప్రాంతం నుంచి ఐరన్ ఓర్ అంతా జపాన్‌కి వెళ్తూ ఉంది. వైజాగ్ దాకా తీసుకువచ్చి, వైజాగ్ పోర్ట్‌లో దాన్ని లోడ్ చేసి జపాన్ తీసుకు వెళ్తున్నారు. గంగవరం పోర్ట్ కూడా ఆదాని కంపెనీ చేతుల్లో పెట్టారు.

ఇందాక మహదేవ్ గారు మాట్లాడారు. ఛత్తీస్‌ఘడ్‌లో ఆపరేషన్ కగార్ పేరుతో ఏజెన్సీ ప్రాంతంలో ఉండే గిరిజనులందరినీ ఖాళీ చేయించడానికి, గిరిజనులకు ఉన్న 1/70 చట్టాన్ని సవరించడానికి ఇదే అయ్యన్నపాత్రుడు వైజాగ్‌లో మీటింగ్ పెట్టి 'గిరిజన ప్రాంతాల్లో వనరులు తవ్వడానికి ఇది ఆటంకంగా ఉంది. ఈ చట్టాన్ని సవరణ చేస్తామని' ప్రకటన ఇచ్చాడు. గతంలో చంద్రబాబునాయుడు అనేక సందర్భాల్లో 1/70 చట్టాన్ని సవరించడానికి చాలా ప్రయత్నాలు చేశాడు. అదేవిధంగా 2023 అటవీ హక్కుల చట్టాన్ని గిరిజనులకున్న అటవీ హక్కుల చట్టం -2005 ను పూర్తిగా పక్కదారి పట్టించడానికి, అటవీ ప్రాంతంలో ఉండే ఆదివాసీలు వారి హక్కులు నిరూపించుకోవాలని, లేకపోతే వాళ్ళే ఖాళీ చేయాలని, లేదా అటవీ ప్రాంతంలో వనరులని ప్రైవేట్ కంపెనీలకి, ప్రైవేట్ వ్యక్తులకు ఇవ్వడానికి తమకు అవకాశం ఉండాలనే పేరుతో, కేంద్ర ప్రభుత్వం ఆదివాసీలని అడవుల నుంచి ఖాళీ చేయించడానికి కొత్తగా ఒక చట్టాన్ని తీసుకొస్తే ఆ చట్టానికి వ్యతిరేకంగా పోరాటం చేస్తున్నాం, ఆ ప్రాంతంలో వేస్తున్న ఆరు వరుసల రోడ్డు, అక్కడ ఉన్న వనరులను తరలించుకు వెళ్ళిపోవడానికి కేంద్ర ప్రభుత్వం ఒకపక్క, రాష్ట్ర ప్రభుత్వం పక్క వనరులను విధ్వంసం చేస్తూ, అక్కడున్న ప్రజలని విధ్వంసం చేస్తూ ప్రజలు కేంద్రంగా విశాఖపట్నంలో అభివృద్ధి జరుగుతుంది అనేదాన్ని చూపించడానికి పాలకులు ప్రయత్నం చేస్తున్నారు. కాబట్టి రాష్ట్రంలో కానీ, దేశంలో కానీ రోజురోజుకీ తీసుకొస్తున్న ప్రజా వ్యతిరేక చట్టాలు, రైతు వ్యతిరేక చట్టాలు నేపథ్యంలో ఈ సదస్సు ద్వారా అవగాహన పెంచుకొని ముందుకు వెళ్ళడానికి ఉపయోగపడుతూందని ఆశిస్తూ నేను ముగిస్తున్నాను.

## ఎస్. ఝాన్సీ,

**అధ్యక్షులు, రైతుకూలీ సంఘం (ఆం.ప్ర.)**



ఉదయం 11 గంటల నుండి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల రైతాంగ, ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగడుతూ సదస్సు నిర్వహించుకుంటున్నాము. ఈ సదస్సులో, రైతాంగం పండించిన పంటకు గిట్టుబాటు ధరలను కల్పించవలసిన బాధ్యత గురించి వెనుక బడిన ప్రాంతాలలో చిన్న, మధ్య నీటి పారుదల పథకాలకు పాధాన్యత ఇవ్వవలసిన అవసరాన్ని గురించి, పోలవరం పునరావాసం సమస్యల గురించి, కౌలు రైతుల సమస్యల గురించి, పెరుగుతున్న విద్యుత్ ఛార్జీలు తదితర సమస్యల గురించి అనేకమంది మేధావులు, ప్రజాతంత్రవాదులు తమ తమ విలువైన సందేశాలను మనకు అందించారు. వీరందరికి మరొక్కసారి ధన్యవాదాలు తెలియజేద్దాము. రాష్ట్రంలోని అనంతపురం నుండి శ్రీకాకుళం వరకు వివిధ జిల్లాల నుండి వచ్చిన రైతు కూలీలకు, రైతులకు, ప్రజాతంత్రవాదులకు, మేధావులకు, రైతాంగ సమస్యలపై రైతుకూలీ సంఘం అవగాహనను నేటి పరిస్థితులలో ఒక మేరకు అందించగల్గాము. ఇంకా తెలుసుకోవల్సినవి ఎన్నో వున్నాయి.

కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావటానికి ముందు రైతాంగానికి ఎన్నో వాగ్దానాలు చేసింది. అధికారంలోకి వచ్చిన మరుక్షణం నుండే వ్యవసాయ రంగాన్ని బహుళజాతి సంస్థల ప్రయోజనాలకు దోహదపడే విధంగా పాలసీలను కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్నది. మన వ్యవసాయ రంగాన్ని పాలకులు ఎటువైపు తీసుకువెళు తున్నారనేది ఆందోళన కలిగించే అంశంగా వుంది.

వ్యవసాయరంగాన్ని విదేశీ, స్వదేశీ కార్పొరేట్ శక్తులకు అప్పగించేందుకే వ్యవసాయ మార్కెటింగ్ జాతీయ విధాన పత్రంతోపాటు మొత్తం వ్యవసాయ రంగాన్ని ఆదానీ, అంబానీలకు ఐటిసి తదితర కంపెనీలకు అప్పగించటానికి రంగం సిద్ధం చేస్తున్నది. ఫ్రీట్రేడ్ అగ్రిమెంటు, వ్యవసాయ

మార్కెటింగ్ జాతీయ విధానం అమలయితే సామ్రాజ్య వాదులకు, బహుళ జాతి సంస్థలకు అప్పగించటం తప్ప మరేమిలేదు. 560 సంఘాలు కలిసి 13 నెలలు పోరాడి ఇప్పటికి దేశవ్యాప్తంగా నిరంతరం నిరసనలు తెలియజేస్తున్నా రైతు సంఘాల డిమాండ్లను ఏమాత్రం ఖాతరు చేయకుండా పాలకులు వ్యవహరిస్తున్నారు. ప్రజాస్వామ్యదేశం అని చెప్పుకుంటూ, ఆందోళన చేస్తున్న ప్రజల మనోభావాలను ఏమాత్రం పరిగణలోకి తీసుకోవటం లేదు. నేడు ప్రభుత్వం అమెరికాతో చేసుకుంటున్న ఫ్రీట్రేడ్ ఒప్పందం వలన, అమెరికా నుండి వ్యవసాయవుత్పత్తులు మన దేశానికి దిగుమతి అవ్వటంతో, వ్యవసాయం మరింత భారంగా మారుతుంది. అమెరికా విధిస్తున్న షరతులతో పెట్రోలు, డీజిల్ ధరలు పెంచాలి, ఎరువులు, పురుగు మందులపై సబ్సిడీ ఎత్తివేయాలి. ఈ షరతులు అమలు చేస్తే, రైతులకు ఉత్పాదక ఖర్చు పెరిగిపోయి, గిట్టుబాటు ధరలు లభించకపోవటంతో రైతులు ఆత్మహత్య చేసుకోవలసిన పరిస్థితికి నెట్టబడతారు. సామ్రాజ్యవాదులు, ప్రత్యేకించి అమెరికన్ సామ్రాజ్యవాదులు ప్రతిరంగంలోను, ప్రత్యేకించి మన వ్యవసాయాన్ని దెబ్బతీసే విధంగా పాలకులను లొంగదీసుకుంటున్నారు. కేంద్ర, రాష్ట్ర పాలకుల విధానాలతో మన దేశం అధోగతి పాలవటం తప్ప, మరోదారి లేదని ఆలోచనాపరులందరూ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఇక మన అటవీ సంపదను అంబానీ, ఆదానీ కంపెనీలకు సంవత్సరాల కొలదీ లీజుకు ఇస్తున్నారు. ఖనిజాలను త్రవ్వి తీసుకుపోవటానికి అక్కడ నివశిస్తున్న గిరిజనులను అడవుల నుండి గెంటివేస్తున్నారు. అక్కడ వున్న నదులను కలుషితం చేస్తూ, గిరిజనులకు త్రాగునీరు కూడా లేకుండా చేస్తున్నారు. మన రాష్ట్రంలోని గోదావరి బేసిన్‌లో వున్న గ్యాస్, ఆయిల్ నిక్షేపాలను కారుచౌకగా అంబానీ కంపెనీలకు అమ్మివేశారు.

ఇక మనకు భూమి, వ్యవసాయం, అటవీ సంపద, గనులు, ఖనిజాలు, గాలీ, నీరు, ఇవి దేశ సంపద. కానీ ఇవి ఏవీ ప్రజలకు చెందటం లేదు. దేశానికి చెందటం లేదు. బహుళజాతి సంస్థలకు కారుచౌకగా మన పాలకులు అమ్మివేయటంతో దేశ భవిష్యత్ ఏమిటి? మన ప్రధాన రంగాలైన వ్యవసాయ, పారిశ్రామిక రంగాలు ఈ విధంగా కునారిల్లిపోతుంటే ఆకలి, నిరుద్యోగం, అవిద్య, అనారోగ్యం రోజురోజుకూ పెరిగిపోవటానికి ఈ పాలకుల విధానాలు కారణం కావా?! ఇక నదీజలాలకు సంబంధించి సాగునీటి సమస్య, త్రాగునీటి సమస్య కూడా ఇంతే తీవ్రంగా వుంది.

5 సంవత్సరాల జగన్ పాలనలో జరిగిన అవినీతిని అంతం చేస్తానని, రైతాంగాన్ని ఆదుకుని ఆత్మహత్యలు అరికడతానని, రైతు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు కల్పిస్తానని, నిరుద్యోగ సమస్యను పరిష్కరిస్తానని ఇలా అనేక వాగ్దానాలు చేసి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు, ఆయన కూటమి ప్రభుత్వం, ఎన్నికల సందర్భంగా చేసిన వాగ్దానాలన్నీ ప్రక్కన పెట్టింది. ఇప్పటి నుండే మరొక 10 సంవత్సరాలు తన అధికారం కాపాడు కోవటానికి అన్ని పథకాలు పన్నుతున్నది. కేంద్రంలో వున్న మోడీ ప్రభుత్వ విధానాలన్నింటినీ కాపాడుకుంటూ, మోడీ దయాదాక్షిణ్యలకు మన రాష్ట్ర ప్రజలను బలి చేస్తున్నారు. ప్రపంచంలోనే అతి పెద్ద రాజధానిని కట్టి ఆంధ్రప్రదేశ్ ఒక నమూనా రాష్ట్రంగా మార్చుతానంటూ 33 వేల ఎకరాలను ల్యాండ్ పూలింగ్ ద్వారా సేకరించిన భూమి చాలదంటూ, మరో 44 వేల ఎకరాల భూములను సేకరించటం ప్రారంభించారు. కార్పొరేటు కంపెనీలతో జగన్ ప్రభుత్వం చేసిన ఒప్పందాలన్నీ అమలు చేస్తూ, విద్యుత్ ఛార్జీలు తగ్గించకపోగా పెంచుతూ గృహవిద్యుత్తుకు కూడా స్మార్ట్ మీటర్లను అమర్చటానికి పూనుకుంటున్నారు. ఈ చర్యలన్నీ ప్రజలకు నష్టం; కార్పొరేటు కంపెనీలకు లాభం. ఇక నీటిపారుదల ప్రాజెక్టులకు సంబంధించి గమనిస్తే పెండింగ్‌లో వున్న చిన్న చిన్న ప్రాజెక్టులు పూర్తి చేయలేదు. పోలవరం నిర్వాసితులసమస్య నేటికీ పరిష్కారం కాలేదు. పొగాకు, మిర్చి, ధాన్యం ఏ పంటలకూ గిట్టుబాటు ధర లేదు. వ్యసాయాధారిత పరిశ్రమలు ఏవీ తెరవలేదు. ఇక విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను ఆపివేసే ఆలోచనే చంద్రబాబులో ఎక్కడా కనపడటం లేదు.

ఈ సమస్యలన్నీ ఈ విధంగానే వుంచి ప్రజలందరికీ సంపదలు సృష్టిస్తానని, అందరినీ ధనవంతులు చేస్తానని ఒకటే ప్రకటనలు. దీని కోసం పి-4 పథకాన్ని ప్రకటించాడు. ఆంధ్రప్రదేశ్‌లో సుమారుగా 50 లక్షల కుటుంబాలు పేదరికంలో ఉన్నాయని గణంకాలు తెలుపుతున్నాయని పేర్కొంటూ, పై శ్రేణిలోని 10 శాతం డబ్బు వున్నవారి సహకారాన్ని తీసుకుని, ప్రతి నియోజకవర్గంలో 10 వేల కుటుంబాలను ఎంచుకుని, వీటికి బంగారు కుటుంబాలు అని పేరుపెట్టి, సంక్షేమ పథకాలు అమలు చేస్తామని

దానితో 2047 నాటికి మన రాష్ట్రం నుండి పేదరికాన్ని తరిమివేస్తానని ప్రకటనలు చేస్తున్నారు. మరొక ప్రక్క ప్రతి జిల్లాలోను కార్పొరేటు సంస్థలకు అవసరమైన భూములు (వందల, వేల ఎకరాలు) ఇవ్వాలని ఆయా జిల్లా అధికారులకు ఆర్డర్లు ఇస్తున్నారు. ఈ చర్యలన్నీ వేగవంతం చేస్తూ యోగాంధ్రప్రదేశ్ అని ప్రచారం చేస్తూ యోగా చేస్తే ఆరోగ్యంగా, ప్రశాంతంగా వుండవచ్చునని తప్పుడు ప్రచారాలు చేస్తూ కోట్లాది రూపాయల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారు. భూ సంస్కరణలు అమలు చేసి భూమిలేని రైతుకు భూమి పంచుతాననే అంశాన్ని ఎజెండా నుండి పూర్తిగా ఎత్తివేశాడు. డామ్ (డిజిటల్ అగ్రికల్చర్ మిషన్) ద్వారా వ్యవసాయాన్ని ఆధునీకరణ చేస్తానంటూ ఇజ్రాయిల్ నుండి గుజరాత్‌కు తెప్పించి అక్కడ నుండి మన రాష్ట్రానికి పదుల సంఖ్యలో డ్రోన్లను కొనటానికి ప్లాన్ చేశాడు. ఈ కూటమి ప్రభుత్వం నగదు బదిలీ పథకాల ఆశలను ప్రజలకు చూపిస్తూ సంపన్నులను మరింత సంపన్నులుగా మార్చటానికే ప్రతి అడుగువేస్తున్నదని మనకు స్పష్టంగా అర్థమవుతున్నది.


కనుక ఈ వ్యవసాయ రంగ సంక్షోభం అంటే ఏదో ఒకటో, రెండో సమస్యలే కాదు. మొత్తంగా ఈ వ్యవసాయ రంగంలో ఉన్న సంక్షోభ లోతుల్లోకి వెళ్లి, దీనికి ఉన్న మూలాలు ఏంటి? దీనికి కారణాలేంటి? భూమి సమస్య ఎక్కడుంది? భూమి సమస్యను ఎలా పరిష్కరించుకోవాలి? వెనుకబాటుతనం ఎక్కడ ఉంది? నిరుద్యోగ సమస్యకు కారణమేంటి? నిరుద్యోగాన్ని ఎలా పరిష్కరించుకోవాలి? వీటన్నింటిని కూడా మనం ఒకదానికొకటి సమన్వయం చేసుకుంటూ, గ్రామీణ ప్రాంత ప్రజల్లోకి చొరబడి పనిచేయవలసిన అవసరం ఉంది.

అయితే మనం ఈ పని చేస్తూ ఉంటే పాలకులు చూస్తూ ఊరుకుంటారా? ఊరుకోరు. వాళ్లు గ్రామాల్లోకి వచ్చి రకరకాల పద్ధతుల్లో కులతత్వాలు, మతతత్వాలు, ప్రాంతీయ తత్వాలు ఇలా రకరకాల అభివృద్ధి నిరోధక భావాలన్నింటినీ పెంచి పోషిస్తున్నారు. ప్రజలను అనైక్యక పరిచే పాలకుల విధానాలు ఏ విధంగా నష్టదాయకమో వివరిస్తూ ప్రజలను చైతన్యపరుస్తూ వారిని ఐక్యం చేయాల్సిన కర్తవ్యం మన ముందు ఉంది. ఈ సంపద అంతా కుల, మతాలతోటి సంబంధం లేకుండా మనమే కాపాడుకుందాం. "ఈ అడవి మనది, ఈ చెట్టు, పుట్ట మనవి. ఈ గెడ్డ మనది, ఈ నది మనది" అనే పద్ధతుల్లో, ఆ నినాదం మీద మనమంతా రైతుకూలీ సంఘంగా గ్రామీణ ప్రాంతాల్లోకి వెళ్లి ప్రజలతో నిలబడి, వాళ్లని సమీకరిస్తూ, వాళ్లందరినీ చైతన్యవంతం చేస్తూ, ఆ ఉద్యమాలకు నాయకత్వం వహించవలసిన కర్తవ్యం, బాధ్యత మన మీద ఉంది. అంతిమంగా 'దున్నేవానికే భూమి' నినాదంపై ప్రజలను సమీకరిస్తూ, సామ్రాజ్యవాద, కార్పొరేట్ శక్తుల, ఫ్యూడల్ వర్గాల అణిచివేతలకు వ్యతిరేకంగా విస్తృతమైన ప్రజానీకాన్ని పోరాటబాటలో నడుపుదాం! సంఘటిత ఉద్యమాలే ప్రజలకు ప్రత్యామ్నాయ మార్గమని తెలియపర్చుదాం! ఈ విషయాన్ని మనం ఈ సదస్సు ద్వారా మరొక్కసారి అవగాహన చేసుకుని, గ్రామీణ ప్రాంతాలకు వెళ్లి మన కర్తవ్యంలో మనం నిమగ్నం కావలసిన అవసరం ఎంతైనా ఉందన్న విషయాన్ని గుర్తుచేస్తూ ముగిస్తున్నాను కామ్రేడ్స్!

## వ్రాతపూర్వక సందేశం :

# ప్రహసనంగా మారిన భూసంస్కరణలు - దున్నేవాడికి దక్కని భూమి

**డా॥ సోమసుందర్ మర్ల**
**ప్రధాన శాస్త్రవేత్త, ఐఏసిఆర్, న్యూఢిల్లీ,**
**అసోసియేట్ ప్రొఫెసర్ వర్జీనీయా స్టేట్ యూనివర్శిటీ, బ్లాక్స్‌బర్గ్, అమెరికా**


ఫైల్‌ఫొటో

గ్రామీణ భారతావనిలో భూయాజమాన్యం ప్రధానమైన అంశం. వివిధ పంటలను పండించి దేశంలో ఆకలిని తీర్చటమే కాక, భూమిని కలిగి ఉండటం, రైతు కుటుంబాలకు ప్రత్యేక సామాజిక హోదా కల్పిస్తుంది. ఈనాటికి 64 శాతం దేశ జనాభా గ్రామాల్లో వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నా, దేశస్తుల సంపద (జిడిపి)లో వ్యవసాయం వాటా కేవలం 16 శాతం మాత్రమే. అంటే ఇంత తక్కువ ఆదాయంతో మనుగడ సాగించే గ్రామీణ పేదలకు భూమిపై హక్కు కల్పించి, ఉత్పత్తిలో

భాగస్వాములుగా చేసినప్పుడే దేశం అభివృద్ధి చెందుతుంది.

ఈ సంవత్సరంలో (2025) దేశంలో 35.4 కోట్ల టన్నుల ఆహారధాన్యాలు, 30 కోట్ల లీటర్ల పాలు ఉత్పత్తి అవుతున్నా ప్రజల ఆకలి, పోషక ఆహార లోపాలు తగ్గలేదు. దాదాపు 80 కోట్ల మంది ప్రభుత్వం అందించే రేషను బియ్యంపై ఆధారపడి బ్రతుకులు ఈడ్చుకొస్తున్నారు. పేదరిక నిర్మూలనకు భూమిలేని పేదలకు భూపంపిణీ చెయ్యటం అత్యావశ్యకం.

## భూ యాజమాన్యంలో అసమానతలు

ఆశ్చర్యమేమంటే 78 సంవత్సరాల స్వాతంత్రం తర్వాత కూడా గ్రామాల్లో భూమిలేని పేదలు అత్యధికంగా వున్నారు.

**కొన్ని గణాంకాలు :**

- ★ రైతాంగంలో 13.8 శాతంగానున్న ధనిక, మధ్య తరగతి రైతుల వద్ద 47.3 శాతం సాగుభూమి కలదు.
- ★ మొత్తం రైతాంగంలో 86.2 శాతంగానున్న చిన్న రైతుల వద్ద 45.2 శాతం మాత్రమే ఉన్నది. వీరి వద్ద భూమి ఒకటి నుండి 2.5 ఎకరాల లోపు మాత్రమే.
- ★ కేవలం 4.9 శాతంగానున్న భూస్వామ్య, ధనిక రైతుల వద్ద 32% సాగుభూమి పేరుకుపోయింది.
- ★ స్వల్పంగా ప్రతి ధనిక రైతు వద్ద ఒక బక్క రైతు కన్నా 45 రెట్లు అధికంగా భూమి కలదు. (నేషనల్ శాంపిల్ సర్వే, 2018)

## ఆంధ్రప్రదేశ్‌లో భూయాజమాన్యం

- ★ 13.73 శాతంగానున్న ధనిక, మధ్య తరగతి రైతుల వద్ద మొత్తం సాగుభూమిలో 41.7 శాతం కేంద్రీకరింప బడింది. (అధిక భాగం సాగునీటి వసతి కల భూమి)
- ★ కేవలం 2.5 ఎకరాలలోపు భూమి కలిగి ఉన్న చిన్న రైతుల వద్ద 65.39 శాతం భూమి కలదు. (ఇది ప్రధానంగా వర్షాధారమైనది.)
- ★ భూమిలేని పేదలు గ్రామాల్లో 56.4 శాతంగానున్నారు.
- ★ దళిత రైతుల వద్ద కేవలం 11 శాతం భూమి కలదు. 60 శాతం వెనుకబడిన కులాల వారి వద్ద 31 శాతం భూమి కలదు.
- ★ కేవలం 12.6% మహిళలు భూమిని కలిగి ఉన్నారు.

## ఇతర రాష్ట్రాల్లో

- ★ పంజాబ్ రాష్ట్రంలో 10 శాతం ధనిక రైతుల వద్ద 80 శాతం సాగుభూమి కలదు.
- ★ ఈ రాష్ట్రంలో దళితులు 32 శాతం కాగా, వీరి వద్ద భూమి నామమాత్రం. గతంలో ప్రభుత్వం పంచిన ఎసైన్డు భూములు సైతం అధిక భాగం ధనిక రైతుల ఆధీనంలో ఉన్నాయి.
- ★ రాజస్థాన్, కర్ణాటక రాష్ట్రాల్లో 10 శాతం ధనిక రైతుల వద్ద 55 శాతం సాగుభూమి కలదు.

## కౌలు రైతులు :

జమీందారీ, రైత్వారీ వ్యవస్థల రద్దు అనంతరం ధనికులు, గ్రామీణ రైతులు సైతం ఈనాడు గ్రామాలు వదిలి భూమిని కౌలుకిచ్చి పట్టణాలకు వలసపోతున్నారు. వ్యవసాయంలో సంపాదించిన మిగులు సంపదను రైస్ మిల్లులు, సినిమాల నిర్మాణం తదితరాలపై పెట్టుబడులుగా పెట్టినా, ప్రస్తుతం తీరు జూస్తే ప్రధానంగా పట్టణాల్లో వాణిజ్యం, షేర్ మార్కెట్లు, రియల్ ఎస్టేట్లు, వడ్డీ వ్యాపారాల్లోనే వెచ్చిస్తున్నారు.

అధిక భాగం కౌలు రైతులు, ఇటీవల సాగు గిట్టుబాటు కాక, కుటుంబ ఖర్చులతో కుదేలయిన చిన్న రైతులు, భూమిలేని వ్యవసాయ కూలీకి సాగు చేస్తున్నారు. పెరిగిన సాగు ఖర్చులు, ప్రతీ సంవత్సరం తీసికట్టుగా పడిపోతున్న మార్కెటు ధరల కారణంగా వీరు విపరీతంగా నష్టపోయి రుణగ్రస్తులవుతున్నారు. గత రెండు దశాబ్దాల్లోనే (2002 నుండి 2022 మధ్య) దాదాపు నాలుగు లక్షల మంది రైతులు (రోజుకు సరాసరి 32 మంది) దేశవ్యాప్తంగా బలవన్మరణాలకు ఒడిగడుతున్నారు.

## ప్రహసనంగా మారిన భూసంస్కరణలు :

స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్న రైతాంగం భూస్వామ్య దోపిడీ నుండి విముక్తి కలగాలని, దున్నేవాడికి, పాలేర్లకు భూమి లభించాలని ఆశపడ్డారు. స్వాతంత్ర్యానంతరం జమీందారీ, రైత్వారీ వ్యవస్థలు రద్దయినా కొంతమేరకు ప్రభుత్వం స్వాధీనం చేసుకొన్న కొన్ని లక్షల ఎకరాల మిగులు భూమి పేదలకు పంచబడింది.

స్వాతంత్ర్యానంతరం కమ్యూనిస్టులు సల్పిన వీరోచిత తెలంగాణా, పున్నప్రవాయలర్ తదితర రైతాంగ వుద్యమాల ద్వారా కొన్ని వేల ఎకరాల భూమి పేదలకు పంచబడింది.

వివిధ రాష్ట్రాలు ముఖ్యంగా పశ్చిమ బెంగాల్ (10 లక్షల ఎకరాలు), త్రిపుర, కేరళ, కాశ్మీరుల్లో ప్రభుత్వాలు కొన్ని లక్షల ఎకరాల భూమిని పేదలకు పంచి ఇచ్చాయి. ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, మహారాష్ట్రలల్లో కొంతమేరకు మిగులు భూమి కమ్యూనిస్టుల పోరాట ఫలితంగా ఆయా ప్రభుత్వాలు పంచవలసి వచ్చింది.

పోరాటాల ఫలితంగా 70వ దశకానికి భూసమస్య ప్రధాన ఎజెండాగా ముందుకొచ్చింది. వివిధ రాష్ట్ర ప్రభుత్వాలు భూస్వాముల యాజమాన్యంలోని భూములపై సీలింగ్ నిబంధనలను విధించి, భూసంస్కరణ చట్టాలు తెచ్చాయి. వివిధ రాష్ట్రాల్లో 68 లక్షల 72 వేల ఎకరాల మిగులుభూమిని స్వాధీనం చేసుకొన్నాయి. కాగా బినామీ ప్రక్రియ ద్వారా, కోర్టు కేసులు ద్వారా తమ కుటుంబాల వద్దే అధికశాతం భూమిని భూస్వామ్య, ధనిక రైతులు కాపాడుకోగలిగేరు. భూసంస్కరణల ఫలితంగా లభించిన మిగులు భూమిలో నామమాత్రంగా దళిత, వెనుకబడిన కులాల పేదలకు ప్రభుత్వం పంచినా, పంచిన మొత్తం సాగు భూమి విస్తీర్ణం (39 కోట్ల పది లక్షల ఎకరాల్లో) కేవలం 1.25 శాతం మాత్రమే భూమిలేని పేదలకు పంచబడింది.

### ఇంకా పంచగలిగిన మిగులు భూమి :

ఇంకా దేశంలో 9 హెక్టార్లు (20 ఎకరాలకు పైబడి) భూమి కలిగిన 93 వేల ధనిక కుటుంబాల వద్ద 4 కోట్ల 40 లక్షల ఎకరాల భూమి కేంద్రీకృతమయి ఉంది. కనీసం 10 నుండి 12 ఎకరాల సీలింగును విధించి భూసంస్కరణలను ఖచ్చితంగా అమలు చేస్తే దేశవ్యాప్తంగా కోట్ల మంది కౌలురైతులు, భూమిలేని పేదలకు భూమి లభించగలదు. కేవలం ఆంధ్రప్రదేశ్‌లోనే 24 లక్షల ఎకరాల భూమి పేదలకు పంపిణీకి లభించగలదు.

ఏ దేశమైనా అభివృద్ధి చెందాలంటే భూ సంస్కరణలు అమలు జరగాలి. అడపా దడపా అరోకోరో పంచడం కాదు భూస్వామ్య లేదా అర్ధ భూస్వామ్య వ్యవస్థ ఏదైతే ఉందో అది నాశనమయ్యే విధంగా భూములు పంచాలి. మనదేశంలో నకిలీ భూ సంస్కరణలు తెచ్చారు. ఈనాడు కౌలుదారుల సమస్య తీవ్రంగా ఉంది. ఉభయ గోదావరి, కృష్ణా జిల్లాలలో **40** లేదా **50%** సేద్యం కౌలుదార్లే చేస్తున్నారు. ప్రభుత్వం ఒక కోటి **20** లక్షల ఎకరాల భూమి ఉందంటున్నది. ఒక కుటుంబానికి రెండు ఎకరాలు పంచితే **60** లక్షల కుటుంబాలు బాగుపడతాయి. అలా పంచకుండా ఒకే కంపెనీకి **50** వేల ఎకరాలు కట్టబెట్టడం, ఈ ప్రభుత్వ విధానంగా ఉంది. పేదల బ్రతుకులు బాగుపడాలంటే నిజమైన భూసంస్కరణలు అమలు కావాలి. దున్నేవానికే భూమి కోసం మనమంతా పోరాడాల్సిన అవసరం ఉంది. మన ప్రత్యామ్నాయ విధానంలో ఇది ముఖ్యమైన భాగంగా ఉండాలని మనవి చేస్తున్నాను.....

...... ప్రొఫెసర్ కె. ఆర్. చౌదరి

('వ్యవసాయరంగ సంక్షోభం - కారణాలు - పరిష్కారాలు' అన్న అంశంపై
విశాఖపట్నంలో ఏప్రిల్ 15న జరిగిన రైతుకూలీ సంఘం (ఆం.ప్ర.) రాష్ట్ర సదస్సులో
చేసిన ప్రసంగ పాఠం నుండి...)

# సౌహార్ద ప్రతినిధుల సందేశాలు

## కా॥ ప్రకాష్

**ఏఐకెఎమ్ఎస్ రాష్ట్ర అధ్యక్షులు**



సదస్సుకు హాజరైన వారందరికీ ఏఐకెఎమ్ఎస్ నుండి విప్లవాభినందనలు తెలుపుతున్నాను. సదస్సులో వక్తలు భూమి సమస్య ప్రాధాన్యతను వివరించారు. ప్రజల చేతుల్లోని లక్షలాది ఎకరాల ప్రభుత్వ, ప్రజల భూములను ప్రభుత్వం గుంజుకొని, బడా సంపన్నులకు, కార్పొరేట్లకు కట్టబెడు తున్నది. గత పాలకుల అడుగుజాడలలోనే ప్రస్తుత పాలకులు కూడా, గతంలో సేకరించిన 33 వేల ఎకరాలు గాకుండా, రాజధాని, పోర్టులు, భారీ రహదారులు, క్రీడా మైదానాల పేరిట తక్షణం 45 వేల ఎకరాలను సమీకరించి, బడా నిర్మాణ కంపెనీలకు, కార్పొరేట్లకు ధారాదత్తం చేసేందుకు ఆతృతగా వున్నారు. పాలకుల ఈ భూదందాలను వ్యతిరేకించాలి. ప్రజలు నివాసముం డేందుకు సాగు చేసుకునేందుకు సెంటు, కుంట భూమి ఇవ్వటానికి నిరాకరిస్తున్న పాలకులు, వేలాది ఎకరాల భూములను బడా పారిశ్రామికవేత్తలకు ఎకరా 99 పై॥ చొప్పున, వంద సం॥ల పాటు లీజుకివ్వటం పాలకుల ప్రజావ్యతిరేక స్వభావాన్ని వెల్లడిచేస్తోంది. మనముందున్న కర్తవ్యం సంఘటిత పోరాటమే. మేము ఎఐకెఎమ్ఎస్గా పశ్చిమ గోదావరి జిల్లాలో ఎల్టి ఆర్ (లాంగ్‌టర్మ్ రెంటల్) భూముల సమస్యపై, గుంటూరు జిల్లాలో వ్యవసాయ కూలీలకు భూమిసమస్యపై పోరాడుతున్నాం. భూమి సమస్యపై సాగించే ఉద్యమాలను ఐక్యంగా ముందుకు తీసుకువెళ్దాం. ఈ సదస్సు విజయవంతం కావాలని కోరుకుంటూ ముగిస్తున్నాను.

## కా॥ వై. కేశవరావు

**ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం నాయకులు**



సదస్సుకు ఆహ్వానించి నందుకు ధన్యవాదాలు. ప్రధానంగా వ్యవసాయా ధారితమైన మనదేశంలో చిన్న కమతాల ద్వారా సాగు చేస్తున్న రైతులు, వ్యవసాయ కూలీలు అధికంగా వుండటమే గాక, ఈ కమతాల ద్వారా సాధించే ఉత్పత్తి కూడా, పెద్ద కమతాలతో పోల్చినపుడు ఎక్కువగానే వుందని గణాంకాలు తెల్పుతున్నాయి. అయితే, క్రమంగా ఈ పరిస్థితిని మార్చేందుకు అధికారంలోకి వస్తున్న ప్రభుత్వాలు ప్రయత్నిస్తూ, రైతాంగానికి వ్యవసాయం గిట్టుబాటు కాకుండా చేస్తూ, వారిని భూములను వదలి పారిపోయేట్లుగా చర్యలు చేపడుతున్నారు. కార్పొరేట్, కాంట్రాక్టు వ్యవసాయాలకు అధిక ప్రాధాన్యతనిస్తున్న పాలకులు, వందల, వేల ఎకరాల కమతాలలో వ్యవసాయం సాగించటానికి బడా వ్యవసాయ కంపెనీలకు అనుమతులిస్తున్నారు. ఈ పెద్ద కమతాలలోనూ వ్యవసాయ కూలీలకు పని కల్పించకుండా, డ్రోన్లు, రోబోలతో వ్యవసాయం సాగించేందుకు వీలుగా కేంద్రం చట్టం చేస్తోంది. అలాగే 'నేషనల్ పాలసీ ఆన్ ఫ్రేమ్‌వర్క్ ఆఫ్ అగ్రికల్చరల్ మార్కెటింగ్' చట్టంతో భవిష్యత్తులో పంటలకు మద్దతుధర ఊసేలేకుండా పోయే ప్రమాదముంది. ఇప్పటికే రాష్ట్రంలో పొగాకు, కోకో, పత్తి, జీడిపిక్కలు రైతాంగం కొనేనాథుడు లేక రోడ్డెక్కుతున్నారు. 8 లక్షల టన్నుల పంటలు నిల్వచేసుకునే గోడౌన్లను ఆదానీకి లీజుకిచ్చారు. ఆయిల్‌పామ్ మీద దిగమతి సుంకం రద్దుచేయటంతో, మన దేశంలో ఈ పంట పండించే రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఇప్పుడు స్వేఛ్చా వాణిజ్య ఒప్పందం

చేసుకునే ఆలోచనలో వున్నారు. ఇదే జరిగితే రైతాంగం పండించే మరో 12 రకాల ముడిసరుకులు పన్నులు లేకుండానే దేశంలోకి దిగుమతి అవుతాయి. ఈ చర్యలన్నీ రైతాంగాన్ని దివాళా తీయించేవే. కేంద్ర–రాష్ట్ర ప్రభుత్వాల ఈ రైతాంగ–ప్రజావ్యతిరేక విధానాలపై సంఘటిత ఉద్యమాలు సాగించాల్సిన అవసరం వుంది.

## కా॥ మరీదు ప్రసాదు

### కిసాన్ సంఘటన రాష్ట్ర కన్వీనర్



సదుస్సు నిర్వాహకులకు అభినందనలు. చంద్రబాబు నేతృత్వంలో ఎన్‌డిఏ కూటమి రాష్ట్రంలో అధికారంలోకి వచ్చి ఏడాది గడిచింది. ఈ కాలంలో రైతాంగ, కార్మిక ప్రజానీకానికి ఇచ్చిన హామీలనేమీ నెరవేర్చ లేదు. రైతాంగానికి ఏదోమేరకు లభించే ఇన్‌పుట్ సబ్సిడీ కూడా అందటం లేదు. రైతాంగం గిట్టుబాటు ధరల సమస్యతో ఈ వ్యవసాయ సీజన్‌లో అందరూ రోడ్డెక్కారు. రైతాంగానికి సంస్థాగత రుణ సౌకర్యం కల్పించక పోవటంతో, ప్రైవేటు వడ్డీ వ్యాపారులపై ఆధారపడడంతో, రైతాంగ రుణభారం సమస్య తీవ్రమౌతుంది. ప్రతిరోజూ దినపత్రికలలో ఏదో ఓ మూల రైతుల ఆత్మహత్యల వార్తలు కన్పడుతున్నాయి. కౌలు రైతాంగానికి కనీసం రైతులుగా కూడా గుర్తింపునివ్వకపోవటంతో, ప్రభుత్వాలు అందించే కొద్దోగొప్పో ఇన్‌పుట్ సబ్సిడీలుగానీ, పంట నష్టపరిహారం, బీమా కానీ– ఏవీ వారికందటంలేదు. వీటన్నికి తోడు భూయజమానికి కౌలు చెల్లించాల్సి రావటంతో ఆత్మహత్యలకు పాల్పడుతున్న వారిలో అధికశాతం కౌలు రైతాంగంగా వున్నారు. ఈ నేపథ్యంలో రైతాంగ ప్రజా సమస్యల పరిష్కారానికి కలిసికట్టుగా ఉద్యమాలు నిర్వహించాల్సిన ఆవశ్యకత ఎంతో వుంది. ఆ వైపుగా అందరమూ సాగుదామని కోరుతూ ముగిస్తున్నాను.

## కామ్రేడ్ మర్రెడ్డి వెంకటరెడ్డి

### ఏఐకెఎఫ్ అధ్యక్షులు


సదస్సుకి హాజరైన వారందరికీ ముందుగా విప్లవాభినందనలు. మహదేవ్‌గారి తీరుజూసి ఏం



మాట్లాడతారోనని, సందేహించాను. కేంద్రంలో మోడీ నాయకత్వంలోని బిజెపి ప్రభుత్వ ఫాశిస్టు పాలన, జాతీయ దురహంకార విధానలను శక్తివంతంగా వెల్లడిచేశారు. వక్తలందరూ చాలా విలువైన విషయాలు మాట్లాడారు. రాష్ట్రంలో పాలకులు అనుసరిస్తున్న, ముఖ్యంగా నీటిపారుదల రంగంలో అనుసరిస్తున్న అవసవ్య, ప్రజావ్యతిరేక విధానాలను కూడా వక్తలు ఎండగట్టారు. రాష్ట్రంలోని సహజ సంపదలను ప్రత్యేకించి గోదావరి బేసిన్ నుండి చమురు, సహజవాయువును భారీ స్థాయిలో నిరాటంకంగా తరలించుకెళ్తున్నా నోరుమెదపకుండా వున్న, అందుకు సహకరించే రాష్ట్ర పాలకుల నైజాన్ని అర్థం చేసుకోవాలి. సమైక్య పోరాటాల ద్వారానే ఏమేరకైనా ఈ దోపిడీ విధానాలను అడ్డుకోగలగటం సాధ్యమౌతుంది. ఆ వైపుగా అందరమూ ఐక్యంగా కృషిసాగిద్దామని చెపుతూ ముగిస్తున్నాను.

## కా॥ గణేష్ పండా

### ఏఐఎఫ్‌టియు (న్యూ) రాష్ట్ర అధ్యక్షులు



కార్మిక, రైతాంగ ఐక్యతను చాటుతూ జరుగుతున్న రైతుకూలీ సదస్సుకు హాజరైన వారందరికీ విప్లవాభినందనలు. విశాఖ ఉక్కు – ఆంధ్రుల హక్కుగా నినదించి, ఎంతోమంది బలిదానాలతో సాధించుకున్న విశాఖఉక్కు పరిశ్రమను దశలవారీగా ప్రైవేటీకరణ సాగిస్తూ, నేటికి పాలకులు దానిని తెగనమ్మేటందుకు సిద్ధమయ్యారు. దీనిని వ్యతిరేకిస్తూ సంవత్సరాల తరబడి ఉక్కు పరిశ్రమ కార్మికులు, రాష్ట్ర వ్యాపిత ప్రజల సంఘీభావంతో నిరసన తెలుపుతున్నా కేంద్రపాలకుల చెవికెక్కటం లేదు. రాష్ట్రంలో అధికార, ప్రతిపక్షాలు రెండూ లోపాయకారీ, లొంగుబాటు పద్ధతుల్లో కార్మిక ప్రజానీకానికి తీరని ద్రోహం చేస్తున్నాయి. దశాబ్దాలు గడుస్తున్నా విశాఖ ఉక్కుకు క్యాప్టిన్‌మైన్స్

కేటాయించకుండా చోద్యం చూస్తున్న పాలకులు, అనకాపల్లి సమీపంలో పెట్టనున్న మరో భారీ ఉక్కు పరిశ్రమకు గనులను కేటాయించామని ప్రకటించటం సిగ్గుచేటైన విషయం. పాలక, ప్రతిపక్షాల ఉచ్చులో చిక్కుకోకుండా కార్మికులంతా రైతాంగ, ప్రజానీకపు మద్దతుతో సమిష్టి పోరాటం చేయటం ద్వారానే విశాఖ ఉక్కును కారుచౌకగా అమ్మివేసే ప్రమాదం నుండి కాపాడుకోగలుగుతాం.

## కా॥ జె. కిషోర్‌బాబు

**ఏఐఎఫ్‌టియూ (న్యూ) రాష్ట్ర కార్యదర్శి**



కేంద్ర–రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక, ప్రజానీకంపై ముప్పేటదాడి చేస్తున్న నేపథ్యంలో ఈ సదస్సు జరగటం విశేషం. కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన బిజెపి నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం, నాలుగు లేబర్ కోడ్‌లు ముందుకు తేవటం ద్వారా, కార్మికవర్గం ఏనాటి నుండో పోరాడి సాధించుకున్న హక్కులన్నింటినీ రద్దు చేశారు. నేడు సంఘటిత రంగంలో పెరుగుతున్న యాంత్రీకరణ, కృత్రిమమేధో సాంకేతిక విజ్ఞానాలన్నీ కార్మికులపై, ఉద్యోగులపై పనిభారాన్ని పెంచుతూ యాజమాన్యాలకు సూపర్ లాభాలార్జిస్తున్నాయి. అధిక సంఖ్యలో కార్మికులు పనిచేస్తున్న అసంఘటిత రంగం మరీముఖ్యంగా ఇటీవల కాలంలో విస్తరిస్తున్న స్విగ్గీ, జొమాటో, ఫ్లిప్‌కార్ట్, ఓలా, ర్యాపిడో, ఉబర్ మొదలగు ప్లాట్‌ఫారాల్లో కార్మికులుగానే గుర్తింపు పొందకుండా లక్షలాదిమంది దుర్భర పరిస్థితుల్లో పనిచేస్తున్నారు. కార్మిక సమస్యల పరిష్కారానికి, ప్రధానంగా నాలుగు లేబర్ కోడ్‌లు రద్దుచేయాలనే డిమాండ్‌తో జులై 9న దేశవ్యాపితంగా పలు కార్మిక సంఘాలు ఇచ్చిన సమ్మె పిలుపుకు రైతుకూలీలంతా సంఘీభావంగా నిలచి విజయవంతం చేస్తారని ఆశిస్తూ ముగిస్తున్నాను.

మనం అనేక సమస్యల మీద పోరాటాలు చేయవచ్చు. అయితే కీలక సమస్య, రుణభారం. ఒక రైతు అప్పుల పాలైతే భూమిని కోల్పోతాడు. ఒక దేశం అప్పుల పాలైతే, తన సహజ వనరులన్నింటినీ కోల్పోతుంది. ఇదే నేడు జరుగుతోంది. గంగా తీర మైదానమంతా బహుళజాతి కంపెనీల చేతుల్లోకి వెళ్ళబోతోంది. దేశ సహజ సంపద, అటవీ సంపదలను సామ్రాజ్యవాదులకు అప్పజెపుతున్నారు. కనుక ఈ అప్పులకు వ్యతిరేకంగా మనం పోరాడాలి. అందుకే అంతర్జాతీయంగా ఉన్న అప్పులన్నింటితో మనకు సంబంధం లేదని ప్రకటించాలి. ఈ అప్పుల్లో ఏది మన గుడిసెల్లోకి వచ్చింది? ఏదీ రాలేదు. మనకు సంబంధం లేదని ప్రకటించకపోతే, ఈ భూమికి, అడవికి, ఖనిజాలకి రక్షణ లేదు. వీటిని అంతర్జాతీయ పెట్టుబడిదారులు కబళిస్తారు....

★ ★ ★ ★

మన భూములను కాజేయడానికి వస్తే ఎదుర్కోవాలి. ఈ భూమి ఎవరిది అని చెబుతున్నామో, ఆ ప్రజలంతా ఈ పరిస్థితుల్లో ఈ భూమిని వదలబోమని పోరాటం చేయాల్సిందిగా కోరుతున్నాను. పోలీస్ మిలటరీ వ్యవస్థలలో ఉద్యోగాలు చేస్తున్న ఈ ప్రజల బిడ్డలంతా ఉద్యోగాలు వదిలిపెట్టి,పాలకులు చేస్తున్న ఈ ప్రజా వ్యతిరేక చర్యలకు వ్యతిరేకంగా ప్రథమ భారత స్వాతంత్ర సంగ్రామం దారిలో పోరాడాలని పిలుపునిస్తున్నాను..

– డాక్టర్ బి.డి. శర్మ

## తీర్మానాలు :

### అమరులకు సంతాప తీర్మానం

2024 జూన్‌లో జరిగిన రైతుకూలీ సంఘం (ఆం.ప్ర) రాష్ట్ర మహాసభల తదనంతర కాలంలో రైతుకూలీ, పీడిత ప్రజా ఉద్యమాలకు అండగా నిలబడిన, అనారోగ్యంతో మరణించిన ప్రజాస్వామికవాదులకు, మేధావులకు మరియు రైతుకూలీ సంఘం సభ్యులందరికీ... రాష్ట్ర సదస్సు జోహార్లు అర్పిస్తోంది.

మధ్య భారతంలో ఆపరేషన్ కగార్ పేరిట కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు సాగిస్తున్న హత్యాకాండలో మావోయిస్టు పార్టీ కేంద్ర ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ నంబాల కేశవరావును మరియు కేంద్ర, రాష్ట్ర, జిల్లా స్థాయి నాయకులను, కార్యకర్తలను, ఆదివాసీలను బూటకపు ఎన్‌కౌంటర్‌లలో రాజ్యం హత్య చేసింది. ఈ హత్యాకాండలో అమరులైన వారందరికీ రైతుకూలీ సంఘం (ఆం.ప్ర) ఎర్రెర్రని వందనాలను తెలియజేస్తున్నది.

ఇటీవల అహ్మదాబాద్‌లో జరిగిన ఎయిర్ ఇండియా ప్రమాద దుర్ఘటనలో వందలాది మంది ప్రాణాలు కోల్పోయిన వారికి, కాశ్మీర్‌లోని పహల్గామ్‌లో టెర్రరిస్టుల దాడిలో మరణించిన వారికి, బెంగళూరు చినస్వామి స్టేడియం తొక్కిసలాటలో మరణించినవారికి, అదేవిధంగా వివిధ ప్రార్థనా మందిరాలలో తొక్కిసలాటలో, అలాగే ప్రకృతి వైపరీత్యాలలో మరణించిన వారందరికీ ఈ సదస్సు సంతాపం తెలియజేస్తోంది.

### నీటి ప్రాజెక్టులపై

**(a). ఉత్తరాంధ్రలో పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులను తక్షణమే పూర్తి చేయాలని డిమాండ్ చేస్తూ......**

వంశధార, నాగావళి, జంఝావతి, సువర్ణముఖి, వేగావతి, చంపావతి, బహుదా, మహేంద్ర తనయ, గోస్తని, శారద, వరాహ, తాండవ, పెద్దేరు...... ఇలా తూర్పు కనుమలు ఆనుకొని ప్రవహిస్తున్న ఎన్నో రకాల జీవ నదులు, వందల సంఖ్యలో ఊట గెడ్డలు ఉన్నా సరే, ఉత్తరాంధ్ర నిత్యం కరువు పీడిత ప్రాంతంగా, వర్షాధారంపై ఆధారపడే ఇప్పటికీ రైతాంగం వ్యవసాయం చేస్తున్నారు.

వంశధార రెండవ దశ ప్రాజెక్టు సుదీర్ఘకాలంగా పెండింగ్‌లోనే ఉన్నది. వంశధార పైన నేరేడు ప్రాజెక్టు, జంఝావతి రిజర్వాయర్‌లు దశాబ్దాల కాలంగా ఒరిస్సా రాష్ట్రంతో ముడిపడిన సమస్యలను పాలకులు సాకుగా చూపించి, పెండింగ్‌లో ఉంచారు.

వెంగళరాయ సాగర్, తోటపల్లి, పెద్దగెడ్డ, ఆంధ్ర రిజర్వాయర్లు పేరుకు పూర్తిచేయబడినా, వాటి మెయింటెనెన్స్, పూర్తిస్థాయిలో కాలువలు నిర్మించక పోవడంతో, గ్రోయిన్లను నిర్లక్ష్యం చేయడంతో ఆయకట్టు చివరన ఉన్న రైతాంగానికి ఒక పంటకు కూడా నీరు అందట్లేదు.

రైవాడ కుడి ప్రధాన కాలువ, పెద్దేరు ఎడమ కాలువ పనులు నేటికీ పెండింగ్‌లోనే ఉన్నాయి. తాండవ, కోనాం, కళ్యాణలోవ ప్రాజెక్టుల కాలువల మరమ్మతులకు, రిజర్వాయిర్ల మెయింటినెన్స్‌కు సైతం నిధులు కేటాయించక పోవడంతో శిథిలావస్థకు చేరుకుంటున్నాయి.

అనకాపల్లి జిల్లాలో శారదా నది పొడవునా ఎలమంచిలి వరకు పదుల సంఖ్యలో గ్రోయిన్లపై ఆధారపడి 50,000 ఎకరాల వరకు ఆయకట్టు ఉంది. కానీ పాలకుల నిర్లక్ష్యం కారణంగా, నదీగర్భాల్లో ఇసుకతవ్వకాలతో, గ్రోయిన్లను అభివృద్ధి చేయకపోవడంతో పంట పొలాలకు చేరాల్సిన నీరంతా సముద్రంలో వృధాగా కలిసిపోతున్నది.

రైవాడ, తాటిపూడి రిజర్వాయర్లు రైతుల అవసరాల కోసం నిర్మించామని చెప్పినప్పటికీ, ఇప్పటికీ విశాఖపట్నం పారిశ్రామిక అవసరాలకు నీరు మళ్లించబడుతున్నది.

2014లో చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా అనకాపల్లి జిల్లా చోడవరం దగ్గర శంకుస్థాపన చేసిన "ఉత్తరాంధ్ర సుజల స్రవంతి" ప్రాజెక్టు నేటికీ కాగితాలకే పరిమితమైంది. ఇచ్చాపురం వరకు రెండు లక్షల ఎకరాలకు పైగా ఆయకట్టు భూములకు నీరందిస్తామని రైతులకు పెద్ద ఎత్తున ఆశలు కల్పించారు. బ్యాలెన్సింగ్ రిజర్వాయర్లు, కాలువ తవ్వకాల కోసం పెద్ద ఎత్తున భూ సమీకరణ చేస్తున్నారు.

నిజానికి ఇటువంటి భారీ ప్రాజెక్టులకు వేలకోట్ల రూపాయలు ఖర్చుపెట్టే కంటే, ఇప్పటికే ఉన్న చిన్న, మధ్య తరహా ప్రాజెక్టులకు 100-200 కోట్లు రూ॥లు ఖర్చు చేసినా ఎంతో ప్రయోజనం ఉంటుంది. రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే, ఉత్తరాంధ్రలో కరువు, వలసలకు ప్రధాన కారణంగా ఉన్న, ఏళ్ల తరబడి నిర్లక్ష్యం చేయబడుతున్న సాగునీటి ప్రాజెక్టులకు నిధులు కేటాయించి పూర్తి చేయాలని ఈ సదస్సు డిమాండ్ చేస్తూ... తీర్మానిస్తున్నది.

**(b).** 1988లో ప్రారంభించిన తెలుగుగంగ, గాలేరు-నగరి, హంద్రీ-నీవా మున్నగు పథకాలను వెంటనే పూర్తిచేయాలి. 35 సం॥ల నుండి ఈ ప్రాజెక్టులు పూర్తికాక అసంపూర్ణంగానే ఉన్నాయి. ఈ పనులు పూర్తి కాకుండానే కాలువలను లైనింగ్ చేసే విధానం ఎంతమాత్రం సరైనది కాదని రాష్ట్ర సదస్సు అభిప్రాయ పడుతున్నది. రాయలసీమ ప్రజల సాగునీరు, త్రాగునీరు సమస్యలను పరిష్కరించ టానికి పాలకులకు సత్వరమే చర్యలు తీసుకోవాలని సదస్సు డిమాండ్ చేస్తున్నది.

### (c). సంవత్సరాల తరబడి అసంపూర్తిగా ఉన్న వెలిగొండ ప్రాజెక్టు పనులను వేగవంతం చేసి వెంటనే పూర్తి చేయాలి.

1969లో శంకుస్థాపన చేసిన వెలిగొండ ప్రాజెక్టును 30 సంవత్సరాలకు కూడా పాలకులు పూర్తి చేయలేదు. ఈ ప్రాజక్టుకు శ్రీశైలం జలాశయం నుండి కృష్ణా నది వరద నీటిని మళ్లించి ప్రకాశం జిల్లాలోని 23 మండలాలకు చెందిన 3 లక్షల 36 వేల ఎకరాలకూ, కడప జిల్లా 2 మండలాలకు చెందిన 84 వేల ఎకరాలకూ, నెల్లూరు జిల్లా 5 మండలాలకు చెందిన 84 వేల ఎకరాలకూ సాగునీటిని, 15.25 లక్షల మందికి త్రాగునీటిని అందించడానికి ప్రారంభించిన ఈ ప్రాజెక్టు, పాలకులు ఎందరు మారినా అసంపూర్తిగానే ఉంది. నిర్వాసిత గ్రామవాసులకు నష్టపరిహారం, పునరావాసం కూడా ఇప్పటివరకూ పూర్తి చేయలేదు. వెంటనే 2000 కోట్ల రూపాయలు కేటాయించి ప్రాజెక్టును పూర్తి చేసి, వెనుకబడిన ప్రాంతాలకు న్యాయం చేయాలని రైతుకూలీ సంఘం (ఆం.ప్ర) డిమాండ్ చేస్తున్నది.

### (d). వాగ్దానాలకే పరిమితమైన వరికపూడిసెల ప్రాజెక్టు నిర్మాణం వెంటనే చేపట్టాలి

30 సం॥ల నుండి పాలకుల హామీలతో వరికపూడిసెల ప్రాజెక్టు గాలిలో తేలియాడుతున్నది. పాలకులు మారినా వరికపూడిసెల ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న తీరుగా ఉన్నది. తక్కువ ఖర్చుతో పల్నాడు జిల్లాలోని ఎగువ ప్రాంతాలలోని మాచర్ల, వెల్దుర్తి, దుర్గి, బొల్లాపల్లి, ప్రకాశం జిల్లాలోని ఎర్రగొండపాలెం తదితర మండలాలలోని 1,20,000 ఎకరాలకు సాగునీరు, 90 గ్రామాలకు త్రాగునీరు అందించే ఈ ప్రాజెక్టుకు, సర్వేల పేరుతో కాలయాపన చేస్తూ నిధులు కేటాయించడం లేదు. ప్రభుత్వం వెంటనే నిధులు కేటాయించి కరువు పీడిత ప్రాంతాలైన ఈ మండలాల్లోని ప్రజల అవసరాలు తీర్చాలని ఈ సదస్సు డిమాండ్ చేస్తున్నది.

**(e).** గుంటూరు ఛానల్‌ను పర్చూరు వరకు పొడిగించి 27 వేల ఎకరాలకు సాగునీరు, 33 గ్రామాల్లో 1.3 లక్షల మంది ప్రజలకు తాగునీరు అందించి, ఆ ప్రాంత అభివృద్ధికి దోహదపడాలని రాష్ట్ర సదస్సు డిమాండ్ చేస్తున్నది.

## రైతాంగం పండించిన పంటల న్నింటికీ ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించి కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ...

ఈ వ్యవసాయ సీజన్‌లో మిర్చి, మొక్కజొన్న, ధాన్యం, పొగాకు, కోకో మొదలైన పంటలకు కనీస మద్దతు ధరలు లభించక రైతాంగం తీవ్ర నష్టాల పాలవుతూ వివిధ రూపాల్లో ఆందోళనలు సాగిస్తున్నారు. పంట ఉత్పత్తి ఖర్చు, డిమాండ్ - సరఫరా, జాతీయ-అంతర్జాతీయ మార్కెట్లలో ఆ పంటల ధరలు, ఆ పంటల మద్దతు ధరలు పెంచడం వల్ల దేశ ఆర్థిక వ్యవస్థపై పడే

భారం... మొదలైన అంశాలపై ఆధారపడి కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని సిఏసిపి (కమిషన్ ఫర్ అగ్రికల్చరల్ కాస్ట్ అండ్ ప్రైసెస్) సంస్థ దేశవ్యాప్తంగా 23 రకాల పంటలకు మాత్రమే మద్దతు ధరలను ప్రకటిస్తున్నారు. కానీ ఇవి, రైతులకు ఏమాత్రం ఉపయోగపడటం లేదు. దీనికి ప్రధాన కారణం రైతాంగానికి ఉత్పాదకత ఖర్చు విపరీతంగా పెరిగిపోవటమే. రైతాంగానికి కావలసిన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు కార్పొరేట్ల చేతుల్లో ఉండటం, వీటి ధరలు విపరీతంగా పెంచుతూ పోవటమే దీనకి కారణం. ఈ బహుళజాతి, కార్పొరేట్ కంపెనీలు కోట్లాది రూపాయలు లాభాలను ఆర్జిస్తుండగా, రైతు రోజురోజుకి దివాళా తీస్తున్నాడు. అందుకే మద్దతు ధరల పేరుతో రైతులను ఉద్ధరిస్తున్నామని పాలకవర్గ ప్రభుత్వాలు చెప్పడం పెద్ద మాయ. ఫలితంగా రైతు తాను పండించిన పంటకు సరైన మద్దతు ధరలు లభించక, పెరిగిన ఉత్పాదకత ఖర్చులు, దళారీ మార్కెట్ శక్తుల దోపిడీ మూలంగా తీవ్ర సంక్షోభంలో కూరుకుపోతున్నాడు. కావున రైతాంగం పండించిన పంటలన్నింటికీ న్యాయమైన, సరైన మద్దతు ధరలు కల్పించి, పంటలను కొనుగోలు చేయాలని రాష్ట్ర సదస్సు డిమాండ్ చేస్తోంది.

## కేంద్ర ప్రభుత్వ 'ఎన్‌పిఎఫ్‌ఏఎమ్-24' (నేషనల్ పాలసీ ఫ్రేమ్‌వర్క్ ఆన్ అగ్రికల్చరల్ మార్కెటింగ్)ను వ్యతిరేకిస్తూ...

రైతాంగం తాము పండించిన పంటలకు స్వామినాథన్ సిఫార్సుల ప్రకారం (సి2+50) ప్రకారం మద్దతు ధరను ప్రకటించాలని, దానికి చట్టబద్ధతను కల్పించాలని, రైతాంగానికి హానికరమైన నల్ల చట్టాలను ఉపసంహరించాలని.... 2020 నుండి నిరంతరాయంగా ఉద్యమిస్తున్నారు. పంజాబ్ రాష్ట్ర ఎన్నికలకు ముందుగా 2021లో కేంద్ర ప్రభుత్వం మూడు వ్యవసాయ నల్ల చట్టాలను ఉపసంహరించుకున్నట్లుగా ప్రకటించినప్పటికీ, 2024 నవంబర్‌లో అంతకు మరిన్ని రెట్లు రైతాంగాన్ని నష్టపరిచే నూతన విధానాలతో ముందుకొచ్చింది. చట్టబద్ధమైన కనీస మద్దతు ధరను అమలు చేస్తామనే హామీను తుంగలో తొక్కింది. వ్యవసాయ పంటలను రైతాంగం స్వేచ్ఛగా అమ్ముకోవచ్చనే పేరిట... ఇప్పటికే ఎలక్ట్రానిక్ నేషనల్ అగ్రికల్చరల్ మార్కెటింగ్ (ఈ-నామ్)ను ముందుకు తెచ్చింది. ఇప్పుడు వ్యవసాయ మార్కెటింగ్ జాతీయ విధాన ముసాయదా - 2024 (ఎన్‌పిఎఫ్‌ఏఎమ్) పేరుతో వ్యవసాయ మార్కెట్ల మొత్తంపై సామ్రాజ్యవాద, బడా కార్పొరేట్ల పెత్తనానికి, దోపిడీకి గేట్లు బార్లా తెలుస్తోంది.

రైతాంగానికి ఎంతో కొంత తోడ్పాటుగానున్న ప్రభుత్వ వ్యవసాయ మార్కెట్ కమిటీలను సంపూర్ణంగా రద్దుచేసి, వ్యవసాయ ఉత్పత్తులు, ఆహార తయారీ మార్కెటింగ్‌లను బహుళజాతి సంస్థల గుత్తాధిపత్యంలోకి తేవడానికి, నేరుగా కార్పొరేట్ శక్తులకు కారుచౌకగా అందించటానికి అవసరమైన ఏర్పాట్లలో భాగంగా కేంద్ర ప్రభుత్వం ముందుకు తెచ్చిన ఈ జాతీయ విధాన ముసాయిదాను రాష్ట్ర సదస్సు తీవ్రంగా వ్యతిరేకిస్తూ... దానిని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తోంది.

## ఆపరేషన్ కగార్‌ను వెంటనే ఆపివేయాలని..

అడవుల్లో ఉన్న సహజసంపదలైన గనులు, ఖనిజాలు మన దేశ సంపద. ఇవి దేశ ప్రజలకు అడవుల్లో నివసిస్తున్న ఆదివాసీలకు మాత్రమే చెందుతాయి. కానీ మన పాలకులు ఈ సహజసంపదలన్నింటినీ కార్పొరేట్ కంపెనీలకు అప్పజెప్తుతున్న విధానాలను రాష్ట్ర సదస్సు ఖండిస్తోంది. ఆపరేషన్ కగార్ పేరుతో రాజ్యం చేస్తున్న హింసను ఎదుర్కొంటూ సహజసంపదలను కాపాడుకోవటం మనందరి కర్తవ్యం. ఈ కర్తవ్య నిర్వహణలోనే కేంద్ర ప్రభుత్వం తలపెట్టిన ఆపరేషన్ కగార్‌లాంటి నిర్బంధ చర్యలను ఎదుర్కోగలుగుతాం.

గత రెండు మాసాల నుండి ప్రజాస్వామికవాదులు, మేధావులు, విప్లవ సంస్థలు, ప్రజా సంఘాలు, ఆదివాసీ సంఘాలు యావత్తు ప్రజానీకం ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేస్తున్నారు.

సంపదలున్న ఆదివాసీ ప్రాంతాలన్నింటిలో జాతుల మధ్య సమస్యలను సృష్టించి, మతతత్వాలను రెచ్చగొట్టి ప్రజలను అశాంతిలోకి నెట్టి సంపదలనంతటినీ కార్పొరేట్

కంపెనీలకు అప్పజెప్పటానికి పాలకులు ఎన్నో కుట్రలు పన్నుతూ ఉన్నారు. ఈ ప్రాంతాలన్నిటినీ కల్లోల ప్రాంతాలుగా మార్చటానికి ప్రయత్నిస్తూ ప్రజలపై క్రూరమైన నిర్బంధాన్ని ప్రయోగిస్తున్నారు. దేశ సంపదను కాపాడుకోవటం కోసం సంఘటిత ఉద్యమాలను నిర్మించుకుంటూ సాగటమే ఆదివాసీల, పీడిత ప్రజల ముందున్న కర్తవ్యం.

## పాలస్తీనా, ఇరాన్ ప్రజలకు సంఘీభావంగా...

గత సంవత్సర కాలం పైగా పాలస్తీనాపై ఇజ్రాయిల్ జాతిహనన వినాశక సైనిక దాడులు సాగిస్తూ విధ్వంసం గావిస్తోంది. పశ్చిమాసియాపై పట్టు కోసం అమెరికా పెంచి పోషిస్తున్న ఈ ఏకపక్ష యుద్ధంలో... 55 వేల మందికిపైగా పాలస్తీనీయులను ఇప్పటికే బలిగొన్నారు. బాలలు, మహిళలు అధిక సంఖ్యలో ప్రాణాలు కోల్పోతున్నారు. కనీసం నీరు, ఆహారం, క్షతగాత్రులకు వైద్యం కూడా వారికి అందనీయకుండా ఇజ్రాయిల్ దిగ్బంధం గావిస్తోంది.

ఇజ్రాయిల్ ఒకప్రక్క పాలస్తీనాపై దాడులు చేస్తూనే, మరోప్రక్క అమెరికా అండదండలతో ఇరాన్‌పై దాడులు చేస్తున్నది. ఇరాన్ తాను చెప్పినట్టు వినకపోతే ఎంతటి యుద్ధానికైనా సిద్ధమేనంటూ తొడగొట్టి సవాల్ చేస్తున్న విధానం, ప్రపంచ ప్రజలకు ఆందోళన కలిగిస్తున్నది. అమెరికా రెచ్చగొట్టే చర్యలను ఖండిస్తూ, తమ భూభాగం కోసం పోరాడుతున్న పాలస్తీనా, ఇరాన్ ప్రజలకు ఈ సదస్సు సంఘీభావాన్ని తెలియజేస్తోంది.

## పోలవరం ప్రాజెక్టు పునరావాసం కొరకు...

5 లక్షల మంది నిర్వాసితులుగా మారిన అతిపెద్ద ప్రాజెక్టుల్లో పోలవరం ఒకటి. గత 15 సం॥ల నుండి నిర్వాసితుల సమస్యలను ఏ పాలకులూ పరిష్కరించలేదు. 70 శాతం మందికి పునరావాసం సకాలంలో అందకపోవటంతో జీవితాలు అతలాకుతలమై వలస కూలీలుగా మారి దూర ప్రాంతాలకు వెళ్లిపోతున్నారు. ఏజెన్సీ గిరిజన సంఘంగా ఉన్న గ్రామాలలోని గిరిజనులు 2013లో కేంద్రం రూపొందించిన పునరావాస చట్టం ప్రకారం తమకు రావాల్సిన న్యాయమైన ఆర్&ఆర్ ప్యాకేజీ, భూమికి భూమి మరియు బంజరు భూముల నష్టపరిహారం కోసం పోరాడుతూ వున్నారు. సంవత్సరాల తరబడి అధికారుల చుట్టూ తిరుగుతూ వున్నారు. పునరావాస సమస్యలు తక్షణమే పరిష్కరించాలంటూ ఏజెన్సీ గిరిజన సంఘం మరియు రైతు కూలీ సంఘం (ఆం.ప్ర) ల నాయకత్వంలో పోరాడుతున్నారు. ప్రభుత్వ అధికారులకు, నిరంతరం తమ గోడును వెళ్ళబుచ్చుకుంటూ చేస్తున్న పోరాటాన్ని పాలకులు ఏమాత్రం పట్టించుకోవటం లేదు. పాలకులు మారిన ప్రతీ సందర్భంలోనూ ప్రాజెక్టు నిర్మాణంలో ఉన్న అవకతవకలు, కోట్లాది రూపాయల లావాదేవీల గురించే మాట్లాడుతున్నారు తప్ప పునరావాస సమస్యల గురించి ఎవ్వరూ పట్టించుకుంటున్నది లేదు. సంవత్సరాల కొలది ఉన్న సొంత ఊరుని, ఉపాధిని ఇచ్చిన భూమిని వదిలివేసుకొని బయట ప్రాంతాలకు విసిరివేయబడిన ఆదివాసీలు బ్రతకటం కోసం పోరాడటంతో పాటు పునరావాస సమస్యల కోసం కూడా పోరాడవలసి వస్తున్నది. తమ సంస్కృతి, జీవిత విధానం అన్నీ కోల్పోయిన నిర్వాసితులు నిత్యం ఎన్నో సమస్యలను ఎదుర్కోవలసి వస్తున్నది. 'దేశం కోసం త్యాగం చేయండి, మీరు భూములు వదలండి' అనిచెప్పిన పాలకులు వీరి జీవితాల గురించి, వీరి బ్రతుకుల గురించి ఏమాత్రం పట్టించుకొనే స్థితిలో లేరు. కొద్దిమంది మాత్రం పోరాడి పోరాడి ఇళ్ళను సాధించుకోగలిగారు. (తాగునీరు సమస్య, ఇంకా అనేక సమస్యలున్నప్పటికీ). ఈ స్థితిలో తమ ముందు, తమ పోరాటాన్ని ఉధృతం చేసుకోవటం తప్ప మరొక మార్గం లేదు. దీనిలో భాగంగానే ఏజెన్సీ గిరిజన సంఘం నాయకత్వంలో రంపచోడవరంలో ఈ నెల 23వ తేదీన నిరసన కార్యక్రమాలను ఉధృతం చేయాలని నిర్ణయించుకోవటం జరిగింది. ఈ కార్యక్రమానికి సంఘీభావంగా అన్ని జిల్లా కేంద్రాల్లోను జూన్ 24వ తేదీన నిరసన ప్రదర్శనల ద్వారా నిర్వాసితులకు అండగా నిలబడాలని రాష్ట్ర సదస్సు జిల్లా కమిటీలకు పిలుపునిస్తున్నది.

## విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ..

ఆంధ్రప్రదేశ్‌లో ప్రజలు ఎన్నో త్యాగాలతో పోరాడి సాధించుకున్న ప్రభుత్వ రంగ పరిశ్రమ అయిన విశాఖ స్టీల్ ప్లాంట్‌ను కార్పొరేట్ శక్తులకు అమ్మివేయటానికి అధికారంలో ఉన్న మోడీ ప్రభుత్వం ఎన్నో పన్నాగాలను పన్నుతూ వున్నది. దీనికి కేటాయించవలసిన గనులను కేటాయించకుండా కుట్రపూరితంగా వ్యవహరిస్తూ వస్తున్నది. అయినప్పటికీ కార్మికులు తమ శ్రమతో ఈ పరిశ్రమను లాభాలవైపు నడిపిస్తూ వచ్చారు. గత 3-4 సం॥ల నుండి విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటుపరం చేయొద్దని కంపెనీ కార్మికులు సామాజిక స్పృహతో ఉన్న మేధావులు, రైతాంగం, విద్యార్థులు ఎంతోమంది తమ నిరసనలను, ఆందోళనలు జరుపుతున్నప్పటికీ కూడా ప్రైవేటీకరణ చర్యలు ఆపటం లేదు. అధికార, ప్రతిపక్ష పార్టీలన్నీ కూడా ఈ ప్రైవేటీకరణకు పరోక్షంగా మద్దతునిస్తూ మోడీ ప్రభుత్వంతో గొంతు కలుపుతున్నాయి. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను తక్షణమే నిలుపుదల చేసి, దానికి కేటాయించవలసిన గనులను వెంటనే కేటాయించాలని, ప్రభుత్వరంగ పరిశ్రమను కాపాడాలని, అదేవిధంగా ఉద్యోగాల నుంచి కార్మికుల తొలగింపు ప్రక్రియను వెంటనే నిలిపివేయాలని ఈ సదస్సు డిమాండ్ చేస్తోంది. పోరాడే కార్మికులకు రైతు కూలీ సంఘం (ఆం.ప్ర) సంఘీభావాన్ని తెలియజేస్తోంది.

## భూసేకరణ పేరుతో భూములను గుంజుకోవడాన్ని వ్యతిరేకిస్తూ...

2014లో నాటి తెలుగుదేశం ప్రభుత్వం అమరావతి రాజధాని నిర్మాణం కోసం 34 వేల ఎకరాల భూములను రైతాంగం నుండి గుంజుకుంది. నేడు తిరిగి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం రాజధాని నిర్మాణం కోసం మరో 44 వేల ఎకరాలను సమీకరించటానికి రంగం సిద్ధం చేసింది. ఇది కాక ప్రతి జిల్లాలోను భూబ్యాంకులను సిద్ధం చేసి కార్పొరేట్ కంపెనీలకు లక్షలాది ఎకరాలను పారిశ్రామిక హబ్‌ల పేరుతో సేకరిస్తున్నది. ప్రత్యేక ఆర్థిక మండళ్ళ పేరుతో లక్షలాది ఎకరాలను ఇప్పటికే రైతాంగం నుండి గుంజుకొని పెద్దపెద్ద పారిశ్రామికవేత్తలకు అప్పజెప్పింది. మరొక ప్రక్క బంజరు, అసైన్డు, పోరంబోకు భూములన్నింటినీ (అక్కడక్కడ పేదలకు ఇచ్చినవి) కూడా రకరకాల పేర్లతో కార్పొరేట్లకు అప్పజెప్పటానికి కొత్తకొత్త చట్టాలను చేస్తున్నారు. వ్యవసాయ భూములను రైతాంగం నుండి గుంజుకొని పారిశ్రామికవేత్తలకు ఇవ్వటం ద్వారా పేద, మధ్యతరగతి రైతులను వ్యవసాయం నుండి, భూముల నుండి గెంటివేయటం ఒక విధానంగా ఈ పాలకులు ఎంచుకున్నారు. ఎన్నో మహత్తర రైతాంగ పోరాటాల ఫలితంగా భూసంస్కరణల చట్టాన్ని సాధించుకోగలిగాం. దున్నేవాడికే భూమి అనే నినాదాన్ని పేద, రైతుకూలీలు తమ స్వంతం చేసుకున్నారు. కానీ నేటి పాలకులు సామ్రాజ్యవాదుల కనుసన్నల్లో నడుస్తూ దున్నేవాడికే భూమి బదులు కార్పొరేట్ కంపెనీలకు కారుచౌకగా భూముల్ని ఇచ్చివేస్తున్నారు. వ్యవసాయ రంగాన్ని సామ్రాజ్యవాదుల రథచక్రాలకు కట్టివేసి మన దేశ ఆహారభద్రతను రైతుకూలీల జీవితాలను ధ్వంసం చేసే పన్నాగంలో పాలకులు ఉన్నారు. ఈ విధానాలను త్రిప్పికొడుతూ మన భూములను మనం కాపాడుకుంటూ వ్యవసాయ రంగాన్ని నిలబెట్టుకోవటం కోసం సంఘటిత ఉద్యమానికి సమాయత్తం కావాలని సదస్సు పిలుపునిస్తున్నది.

## స్మార్ట్ మీటర్ల బిగింపు, విద్యుత్ ఛార్జీలకు వ్యతిరేకంగా..

రాష్ట్రంలో గత ప్రభుత్వం వ్యవసాయ విద్యుత్తుకు స్మార్ట్ మీటర్ల బిగింపును నాడు విపక్షంలో నుండగా తీవ్రంగా వ్యతిరేకించిన కూటమి నేతలు... అధికారంలోకి వచ్చిన తర్వాత, స్మార్ట్ మీటర్లను రద్దు చేయకపోగా గృహ విద్యుత్తుకు కూడా స్మార్ట్ మీటర్ల బిగింపు ప్రక్రియను చేపట్టారు. ట్రూ అప్ ఛార్జీలు, సర్దుబాటు ఛార్జీల పేరిట వినియోగదారులపై విద్యుత్ ఛార్జీల భారాన్ని మరింతగా మోపుతున్నారు. గృహ, వ్యవసాయ విద్యుత్తులకు స్మార్ట్ మోటార్ల బిగింపును, ప్రజలపై విద్యుత్ ఛార్జీల భారాల పెంపును తగ్గించటానికి కేంద్ర, రాష్ట్ర పాలకులు తగు చర్యలు సత్వరమే చేపట్టాలని ఈ సదస్సు డిమాండ్ చేస్తున్నది.

## కౌలు రైతులకు గుర్తింపునివ్వాలని....

పాలకుల పరాధీన వ్యవసాయ విధానాల ఫలితంగా వ్యవసాయం రైతులకు ఒక గుదిబండగామారి, సంక్షోభంలో కూరుకుపోతున్నారు. ఇందులో కౌలురైతుల దుస్థితి మరింత దారుణంగా ఉంది. కౌలు రైతుల పేరు మీద ఏ విధమైన హక్కు పత్రాలు లేనందున ప్రభుత్వం నుంచి అందే నామమాత్రపు రుణాలు, పథకాలు, సబ్సిడీలు కూడా పొందలేకపోతున్నారు. ఖర్చులు, పంట గిట్టుబాటు కాని కారణంగా అప్పులపాలై ఆత్మహత్యలకు బలవుతున్నారు. కావున కౌలు రైతులందరికీ తగిన గుర్తింపు కార్డులు ఇచ్చి, బ్యాంకు రుణాలు, ఇన్‌పుట్ సబ్సిడీలు నేరుగా సాగు చేస్తున్న కౌలు రైతులకే అందేలా చర్యలు తీసుకోవాలని ఈ సదస్సు డిమాండ్ చేస్తున్నది.


## వ్యవసాయాధారిత పరిశ్రమలను తెరిపించాలని....

రాష్ట్రంలో జనపనార, పంచదార, జిన్నింగ్, జీడిపప్పు.. మొదలైన వ్యవసాయ ఆధారిత పరిశ్రమలన్నీ మూతపడ్డాయి. ఈ పరిశ్రమలు మూతపడటంతో ముడిసరుకును సప్లై చేసే ఆయా పంటలు పండించే రైతులు దివాళా తీసి, వీటిపై ఆధారపడే వారి జీవితాలు కుదేలై ఉపాధి లేక వలస కూలీలుగా మారిపోతున్నారు. కొద్దిపాటి ప్రభుత్వ ప్రోత్సాహంతో ఈ పరిశ్రమలన్నీ తిరిగి ఉత్పత్తి ప్రారంభించేందుకు అవకాశం ఉన్నా.. వేలకోట్ల రూపాయల సబ్సిడీతో, రాయితీలతో ప్రోత్సహకాలతో విదేశీ, స్వదేశీ కార్పొరేట్ పరిశ్రమలను ఆహ్వానిస్తున్న పాలకులు... ఆ వైపుగా చర్యలు చేపట్టడం లేదు. మూతబడిన వ్యవసాయాధారిత పరిశ్రమలను వెంటనే తెరపించడం ద్వారా... ఆ పరిశ్రమలకు కావలిసిన ముడి సరుకును ఉత్పత్తి చేసే రైతాంగానికి, ఆయా పరిశ్రమలలో పని కోల్పోయిన కార్మికుల ఉపాధి వలసలు తగ్గుతాయి. కావున వ్యవసాయ ఆధారిత పరిశ్రమలను ప్రోత్సహించాలని మూతబడిన వ్యవసాయ ఆధారిత పరిశ్రమలన్నింటినీ తెరిపించాలని ఈ రాష్ట్ర సదస్సు డిమాండ్ చేస్తున్నది.

## దళితులు, అణగారిన వర్గాలు, మైనార్టీలు, చిన్నారులు, మహిళలపై దాడులను ఖండిస్తూ..

మూడోసారి కేంద్రంలో అధికారంలోకి వచ్చిన బిజెపి మతోన్మాదం, జాతీయోన్మాదంతో మత మైనారిటీల పైన, అల్పసంఖ్యాకులపైన విద్వేషపూరితమైన వ్యాఖ్యలు, దాడులు తీవ్రం చేస్తున్నది. ఈ దురహంకారపూరితమైన దాడులను వెంటనే ప్రభుత్వం నిలువరించాలని, గ్రామాల్లో దళితులపైన, అణగారిన వర్గాలపైన, పెత్తందారులు సాగిస్తున్న అణచివేతను ఆపివేయాలని, సదస్సు డిమాండ్ చేస్తోంది. ముఖ్యంగా పాలక వర్గాల కుమ్ములాటలో దళిత, పేద ప్రజానీకం బలవుతున్నారు. ఈ దాడులను అరికట్టాలని, చిన్నారులు, మహిళలపై రోజురోజుకీ పెరుగుతోన్న అత్యాచారం, హింస, దాడులకు కారణమైన సంస్కృతి, విధానాలను పాలకులు పెంచిపోషిస్తున్న తీరును నిరసిస్తూ దాడులను అరికట్టడంలో పాలకుల నిర్లక్ష్య వైఖరిని ఈ సదస్సు ఖండిస్తున్నది.

విషప్పురుగు కబళించిన.. రైతు పంట



విషాదాశ్రుకణం.... రైతు కంట

**అనుబంధం :**

## కరపత్రం

# కేంద్ర - రాష్ట్ర ప్రభుత్వ రైతాంగ, ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగడుతూ 2025 జూన్ 18వ తేదీన విజయవాడలో జరిగే రైతు, కూలీ రాష్ట్ర సదస్సును విజయవంతం చేయండి

***సోదరీ, సోదరులారా!***

2024 జూన్‌లో తెలుగుదేశం, జనసేన, బిజెపిల కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో అధికారంలోకి వచ్చింది. రాష్ట్రానికి స్వర్ణయుగం తెస్తామనీ, సంపదలు సృష్టించి పేదరికం తొలగిస్తామని చెప్పింది. కానీ రైతాంగానికి ఈ సంవత్సర కాలంలో ప్రభుత్వం ఇచ్చిన ఏ వాగ్దానాన్నీ అమలు చేయలేదు. రైతుల పంటలకు కనీస మద్దతుధర ఏ పంటకూ అందలేదు. మిర్చి, మొక్కజొన్న, ధాన్యం, కోకో, పొగాకు, ఆక్వా రైతాంగం తీవ్రంగా నష్టపోతుంటే పట్టించుకొన్న పరిస్థితి లేదు. పంటల ధరల స్థిరీకరణ నిధి అమలులోనే లేదు. కూటమి ప్రభుత్వం కేవలం ప్రకటనలకు మాత్రమే పరిమితమైంది.

**రాష్ట్రానికి కావాల్సింది ఆయకట్టు రైతులందరికీ నీరందించే పథకాలా? వేల కోట్ల గోదావరి-బనకచర్ల పథకమా?**

రాష్ట్రంలో ఏ ఆయకట్టు చివర రైతులకూ నీరందే పరిస్థితి లేదు. ఫలితంగా కాలువ చివర రైతాంగం తీవ్రంగా నష్టపోతున్నారు. 100, 200 కోట్ల రూ॥లు ఖర్చుపెడితే పూర్తయ్యే ప్రాజెక్టులు ఎన్నో ఉన్నాయి. వెలుగొండ, హంద్రీ-నీవా, వంశధార, నాగావళి, వరికపూడిశిల, గుంటూరు ఛానల్ పర్చూరు వరకు పొడిగింపు వంటి ఎన్నో చిన్న, మధ్య నీటి పారుదల పథకాలు ఇంకా పూర్తి కానేలేదు. హంద్రీ-నీవా, గాలేరు-నగరి వంటి రాయలసీమ ప్రాజెక్టుల ప్రధాన కాలువలలో నీరైతే ప్రవహిస్తున్నది. కానీ అవి రైతుల పొలాలలోకి చేరడంలేదు. కారణం 2015 నుంచి వాటి డిస్ట్రిబ్యూటరీలు, పిల్ల కాలువలు తవ్వక పోవడమే. అతి తక్కువ ఖర్చుతో పూర్తయ్యే వీటిని 2014 నుంచీ పరిపాలించిన చంద్రబాబు చేపట్టలేదు; తర్వాత వచ్చిన జగన్ చేపట్టలేదు; కారణమేమంటే పంటకాలువలు తవ్వరాదన్నది ప్రపంచ బ్యాంకు షరతు. ఆ భూములలో ఆరుతడి, ఉద్యాన పంటలు మాత్రమే పండిస్తూ, ఆ నీరు కియా వంటి విదేశీ కంపెనీలకు మళ్ళించటమే వారి ఉద్దేశ్యం. దీనికి అనుగుణంగానే 2015 ఫిబ్రవరిలో జీవో నెం-22 తెచ్చారు. ప్రపంచ బ్యాంకు కోసం తప్ప రైతుల ప్రయోజనాల కోసం నిలిచే ప్రభుత్వాలు ఇవి కావనడానికి ఇదొక ఉదాహరణ. అంతేకాదు, రాష్ట్రంలో సుమారు వెయ్యి లిఫ్ట్ ఇరిగేషన్ స్కీములు ఉన్నాయి. వీటిలో చాలా స్కీములు ప్రభుత్వాలు పట్టించుకోనందున మూతపడి ఉన్నాయి. వరదలలో కొట్టుకుపోయిన అన్నమయ్య ప్రాజెక్టును తిరిగి నిర్మించే ప్రయత్నాలేవీ లేవు. శ్రీశైలం ప్రాజెక్టులో గతంలో పడిన భారీ గుంత ఇప్పటికీ పూడ్చనేలేదు. ఇలాంటి అనేక అత్యవసర పెండింగ్ పనులను పూర్తి చేయకుండా, 81 వేల కోట్ల రూపాయల ఖర్చుతో గోదావరి - బనకచర్ల పథకం అవసరమా? రాజశేఖర రెడ్డి 80 వేల కోట్ల రూపాయల ఖర్చుతో ప్రకటించిన జలయజ్ఞంలో వేల కోట్ల రూపాయలు కాంట్రాక్టర్‌ల, పాలక రాజకీయ నాయకుల వద్దకే చేరింది. కానీ పూర్తిగా రైతుల కోసం పూర్తయిన ప్రాజెక్టులు వేళ్ళ మీద కూడా లెక్కపెట్టగలిగేవి లేవు. కనుక భారీ ప్రాజెక్టులు కాదు, ఇప్పుడు కావల్సింది. ప్రతి ఆయకట్టుకూ చివరివరకూ పూర్తిగా నీరందించే సమగ్ర జలవనరుల వినియోగ విధానం కావాలి. సులభతర వాణిజ్యం పేరుతో వ్యవసాయాన్ని మార్కెట్

దోపిడీ శక్తులకు కట్టబెడుతున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ పనులు చేయవు.

**ఆదానీ, అంబానీలకు లక్షల ఎకరాల భూ పందారం - ప్రాజెక్టులకు భూములిచ్చిన రైతులు సర్వనాశనం :**

కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతోనే పునరుత్పాదక విద్యుత్ ప్రాజెక్టులు, ఆహారధాన్యాల గోడౌన్‌ల పేరుతో, పంప్డ్ స్టోరేజి హైడ్రో ఎలక్ట్రిక్ ప్రాజెక్టుల పేరుతో ఆదాని, అంబానీలకు లక్షలాది ఎకరాల భూములను కట్టబెడుతున్నారు. ఉత్తరాంధ్రలోని ప్రతి మండలంలో పారిశ్రామిక హబ్‌ల పేరుతో వందల ఎకరాలు సేకరిస్తున్నారు. బొబ్బిలి గ్రోత్ సెంటర్ అతీగతీ లేకుండా అలా పడి ఉంది. ఇవి కాదని రకరకాల పేర్లతో భూముల సేకరణ సాగుతోంది. అమరావతిలో మరో 44 వేల ఎకరాల సేకరణకు బయలుదేరారు. నిజానికి ఒక్క 2016 సం॥లోనే ప్రభుత్వం భూబ్యాంకుల పేరుతో మొత్తం 7.64 లక్షల ఎకరాలను సేకరించింది. ఈ భూమికి పట్టాలు లేనప్పటికీ, ఆ భూమి అంతా ప్రజల వినియోగంలో ఉన్నదే. అయినా ప్రభుత్వ భూదాహం తీరటం లేదు. భూములను ముందు ముందు ప్రజలు స్వాధీనం చేసుకోకుండా ఉండటానికి 2024లో ఆం.ప్ర భూదురాక్రమణల నిరోధక చట్టం తెచ్చారు. ఇదంతా దేనికోసం?

ఇవి కాక, జంఝావతి నుంచి గండికోట వరకూ, అమరావతి నుంచి పోలవరం వరకూ ప్రాజెక్టుల కోసమని సాగులో ఉన్న తమ భూములను అప్పగించిన రైతులకు, ప్రజానీకానికి ఈనాటికైనా ఏమి దక్కింది? అమరావతిలో ఇప్పటికే 34 వేల ఎకరాల భూములిచ్చిన రైతులకు, 3 సం॥లలోపు వాటిని అభివృద్ధిచేసి ఇస్తామని 2015లో చెప్పినా, అది అమలులోకి రాలేదు. ఈ రోజుకూ అక్కడ ప్లాట్లు పొందిన రైతులకు చట్టబద్ధత లేదనేపేరుతో బ్యాంకులు సైతం అప్పులు ఇవ్వడం లేదు.

**పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల బాధలు :**

పోలవరం ప్రాజెక్టు క్రింద వేలాది ఎకరాలు కోల్పోయిన ఆదివాసులకు, గిరిజనేతరులకు ఈనాటికీ నష్టపరిహారాలు అందక అత్మహత్యలకు పాల్పడు తున్నారు. నిన్నటివరకూ రైతులుగా బతికినవారు, ఈనాడు కూలీలుగా వలసలు పోతున్నారు. విలీన మండలాల నిర్వాసితులకు ఈనాటికీ పునరావాసం లభించనేలేదు. నిర్మాణమై వున్న కాలనీ లన్నింటినీ చౌక కూలీల సరఫరా కేంద్రాలుగా మార్చివేశారు. చెప్పిన విధంగా పోలవరం ప్రాజెక్టు కట్టడంలేదు. పోలవరం ప్రాజెక్టును 41 మీటర్ల ఎత్తు వరకే పరిమితం చేయాలని 2018 నాటికే కేంద్రం నిర్ణయించింది. కేంద్రంలోని బిజెపి పాలకులకు పూర్తిగా లొంగిపోయిన టి.డి.పీ, వై.సి.పీల అధినాయకత్వం ఒకరిపై ఒకరు నిందలు వేసుకొంటూ పోలవరానికి ఉరిశిక్ష వేసిన అసలు నేరస్తుడైన బిజెపీని రక్షిస్తున్నారు. ఈవిధంగా ప్రాజెక్టు మొదలై 20 ఏళ్ళైనా, ఇప్పటికీ పూర్తికాలేదు. 5 లక్షల మంది ప్రజల (వీరిలో ఆదివాసులే ఎక్కువ) జీవితాలు మాత్రం నాశనం అవుతున్నాయి. కనుక 'ఏ.పి' లోని 'ఏ' అంటే అమరావతి, 'పి' అంటే పోలవరాల కోసం సర్వస్వం ధారపోసిన నిజ సాగుదారులకు, రైతులకు ద్రోహం చేసి కోట్ల రూపాయిలు దోచుకునే రాజకీయ మాఫియా ముఠాల పడగనీడలో రాష్ట్రం ఉంది.

**విద్యుత్ చార్జీల పెనుభారం :**

1998లో నాటి రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రపంచబ్యాంకు సి.ఇ.ఒ నని చెప్పుకొంటూ, ఆ బ్యాంకు చెప్పినట్లు సాగించిన 'విద్యుత్ సంస్కరణలు' ఈనాటికి రాష్ట్రం మొత్తాన్ని కబళించివేసాయి. ఈ బాటలోనే మరింత తీవ్రమైన దోపిడీని దేశం అంతా అమలు చేయడానికి కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం విద్యుత్ బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టి, చర్చ జరపకుండానే విద్యుత్ రూల్సుకు సవరణ బిల్లు-2024 తీసుకొని వచ్చింది. జగన్ ప్రభుత్వం విద్యుత్ చార్జీల భారం పెంచుతోందని, తాము అధికారంలోకి రాగానే వాటిని తగ్గిస్తామన్న కూటమి నేతల వాగ్దానం అబద్ధం. కూటమి పెద్దలు అధికారంలోకి రాగానే, అదే వినియోగదారుల గూబ గుయ్యిమనేట్లు చార్జీల భారం మోపుతూనే ఉన్నారు. ప్రపంచ బ్యాంకుకు లోబడే ట్రూ అప్ ఛార్జీలు, సర్దుబాటు ఛార్జీల పేరుతో అసలు బిల్లుపై ఎన్నో రెట్లు వసూళ్ళు చేసి, ప్రైవేటు కంపెనీలకు దోచిపెడుతున్నారు.

దీనిని బట్టి సంపదల సృష్టి అంటే, కోట్లాది మంది రైతులను, చేతివృత్తులవారిని, చిన్న పరిశ్రమలను ప్రోత్సహించడం కాక పేద, మధ్యతరగతి ప్రజల భూములను, ఆస్తులను, వారి ఆదాయాలను కబళించి ఆదాని, అంబానీల వంటివారికి కట్టబెట్టటం, తర్వాత వారు విదిల్చే ఎంగిలి మెతుకులనే అభివృద్ధి అని ప్రచారం చేయడం - ఇది కూటమి విధానం.

**కౌలురైతుల, రైతుకూలీల దుస్థితి :**

కౌలు రైతాంగం ఈ కాలం అంతా తీవ్రమైన దురవస్థలకు గురౌతున్నారు. కౌలు భారాలను భరిస్తూ పంటలు పండించినా, పైనుంచి కిందవరకూ ఉన్న మార్కెట్ దళారీలు పంటల రేట్లు పడగొట్టి రైతులను దోచుకుంటూ వుంటే,

కౌలు రైతులకు పెట్టుబడిపెట్టిన షావుకార్లు, రైతాంగాన్ని నిలువు దోపిడీ చేస్తున్నారు. ఫలితంగా కౌలురైతుల ఆత్మహత్యలు కొనసాగుతూ ఉన్నాయి. రైతు కూలీలకు గ్రామాలలో నిలకడైన ఉపాధి లేక, పట్టణ ప్రాంతాలలో మెరుగైన పనులు దొరకక, పని వెతుకులాటలలో, ప్రయాణాలలో ప్రాణాలు కోల్పోతున్నారు.

**కునారిల్లుతున్న వ్యవసాయాధారిత పరిశ్రమలు :**

పంచదార మిల్లుల వంటి వ్యవసాయాధారిత పరిశ్రమలు ఉన్న కాలంలో, చెరకు పంట వల్ల పనులు ఎక్కువగా ఉండి గ్రామాల నుంచీ ఇంత పెద్దఎత్తున వలసలు ఉండేవి కాదు. విదేశీ పంచదార దిగుమతుల కోసం ప్రభుత్వాలు రాష్ట్రంలో పంచదార పరిశ్రమలను దెబ్బతీశాయి. జూట్, స్పిన్నింగ్, జీడిపప్పు మొదలగు పరిశ్రమలన్నీ, ప్రభుత్వ మద్దతు లేనందున నాశనమైపోతున్నాయి. సరళతర వాణిజ్యం పేరుతో విదేశీ కంపెనీలకు ఎర్రతివాచీలు పరిచే ప్రభుత్వాలు, స్థానిక పరిశ్రమలను బలిచేస్తున్నాయి.

**అసమాన అభివృద్ధి - ప్రాంతీయ అసమానతలు :**

రాష్ట్రంలోని సమస్త సంపదలు, వనరులు విదేశీ దళారీలైన ఆశ్రిత పెట్టుబడిదారులకు కట్టబెట్టటమే పాలకుల విధానం. అమరావతి చుట్టూ అప్పుచేసి పప్పుకూడు లాగా భారీ భవనాలు, ఐకానిక్ వంతెనలు, మెట్రో రైళ్ళు.... ఇవేమీ ప్రజల కోసం కాదు. రాష్ట్రాన్ని రోజురోజుకూ అప్పుల ఊబిలో దించుతూ ప్రజల పన్నులనూ, తెస్తున్న అప్పులనూ కొద్దిమందికి కట్టబెట్టే ఈ విధానాలు, ప్రజల మధ్య, ప్రాంతాల మధ్య అసమానతలను మిగులుస్తాయి.

రాష్ట్ర సంపదలను గుజరాతీ దళారీలకు దోచిపెట్టటంలో జగన్ ప్రభుత్వం, గత చంద్రబాబు ప్రభుత్వ విధానాలనే కొనసాగించింది. నేడు కూటమి పాలనలో కూడా అవే చట్టాలూ, విధానాలూ అడ్డులేకుండా అమలవుతున్నాయి. కారణమేమంటే గత జగన్ ప్రభుత్వం వెనక ఉన్నదీ, ఇపుడు తెలుగుదేశం ప్రభుత్వంలో ఉన్నదీ బిజెపినే. గత 10 ఏళ్ళుగా పాలక, ప్రతిపక్ష పార్టీలన్నీ కేంద్ర బిజెపి కను సన్నలలోనే నడిచాయి. బిజెపి కేంద్రంలో తెచ్చిన అన్ని ప్రజా, రైతు, ఆదివాసీ వ్యతిరేక చట్టాలనూ, కేంద్రం చెప్పుచేతల్లో పూర్తిగా రాష్ట్రాలను బిగించే శాసనాలనూ.... వీరిరువురూ మారుమాట్లాడకుండా ఆమోదించారు. సంపన్నులు ఎక్కడ ఉన్నా, ఎక్కడి భూమినైనా – ఆన్‌లైన్‌లో కొనుక్కోవడానికి వీలుగా రాష్ట్రంలోని భూములన్నింటినీ సర్వే చేసి, సొంతదారులకు శాశ్వత భూహక్కు పట్టాలు ఇమ్మని నీతిఆయోగ్ చెప్పింది. జగన్ ప్రభుత్వం ఆ విధంగానే చట్టం చేస్తే, దాన్ని రద్దుచేశామన్న టిడిపి ప్రభుత్వం, మరల అదే భూసర్వేలను కొనసాగిస్తున్నది. ఈ విధంగా ప్రజావ్యతిరేక విధానాల అమలులో గత ప్రభుత్వ బాటలోనే ఈ ప్రభుత్వమూ నడుస్తున్నది.

**ఉద్యమ మార్గమే మన కర్తవ్యం :**

కూటమి పాలన ఫలితంగా అన్ని రంగాల ప్రజలు తీవ్ర సంక్షోభంలో పడిపోయారు. మూతపడిన వ్యవసాయాధారిత పరిశ్రమలు ఏవీ కోలుకోలేదు. బిజెపి చెప్పే అభివృద్ధి నమూనా, కొద్దిమందిని మహా కోటీశ్వరులను చేస్తూ కోట్లాది మంది రైతులను, శ్రమజీవులను, చిన్న పారిశ్రామికులను దివాలా తీయిస్తున్నది. మన చమురు, సహజవాయువులను, భూగర్భ, ఖనిజసంపదలను కారుచౌకగా కొల్లగొట్టుకెళుతున్నారు. మేము 2024 సం॥ ఎన్నికల సందర్భంగా చెప్పినట్లు, సామ్రాజ్యవాదుల, వారి దళారీలైన గుజరాతీ కార్పొరేట్లకు పెరటిదొడ్డిగా మన ఆంధ్రప్రదేశ్‌ను మారుస్తూ వస్తున్న గత ప్రభుత్వాల వైఖరినే, తెలుగుదేశం నాయకత్వాన ఉన్న ఇప్పటి కూటమి ప్రభుత్వం కూడా అనుసరిస్తున్నది. ఇవి మనకు బాధలు, కష్టాలు, కడగండ్లను మాత్రమే మిగులుస్తాయి. కనుక, కూటమి అనుసరిస్తున్న రైతు వ్యతిరేక, ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా నిలబడమని కోరుతున్నాం. మన భూములు, వ్యవసాయాలు, పరిశ్రమలు, అడవులు, సహజసంపదల రక్షణకై కదులుదాం. తెలుగు ప్రజల ఆత్మగౌరవం కోసం నిలబడదాం.

ఈ సందర్భంగా **2025 జూన్ 18న విజయవాడ ఎం.బి. భవన్‌లో జరిగే రాష్ట్ర సదస్సు**ను విజయవంతం చేయవలసిందిగా రైతుకూలీలు, మేధావులు, ప్రజాతంత్ర వాదులందరికీ విజ్ఞప్తి చేస్తున్నాం.

# రైతుకూలీసంఘం (ఆం.ప్ర)
## (AIKMKS అనుబంధం)

# విలువైన పంట భూములను ఏరోస్పేస్‌కు ఇచ్చేది లేదని 3 సంవత్సరాలకు పైగా పోరాడి విజయం సాధించిన దేవనహళ్లి తాలూకా చెన్నరాయ పట్టణ రైతులకు అభినందనలు

**- AIKMKS అనుబంధ కర్ణాటక రాజ్య రైతు సంఘ**

*మిత్రులారా!*

బెంగుళూరు ఎయిర్ పోర్టుకు దగ్గరలోని దేవనహళ్లి తాలూకా చెన్నారాయ పట్టణ పరిసర 13 గ్రామాల ప్రజలకు చెందిన 1777 ఎకరాల భూసేకరణ 'హైటెక్ ఏరోస్పేస్ మరియు డిఫెన్స్ హబ్ ' కోసం మూడు సంవత్సరాల క్రితం అప్పటి బిజెపీ ప్రభుత్వం KIADB ద్వారా నోటిఫికేషన్ ఇచ్చింది. ఈ 13 గ్రామాల ప్రజలు గతంలో దేవనహళ్లి ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్ట్ కోసం వివిధ దశల్లో ప్రభుత్వం చేసిన భూసేకరణలో చాలావరకు భూములు కోల్పోగా, మిగిలిన ఈ భూమికి ఈ నోటిఫికేషన్ ఇచ్చారు. మొత్తంగా వ్యవసాయానికే పూర్తిగా దూరమవుతామనే బాధతో ఈ గ్రామాల రైతాంగం సంఘటితమై పోరాటం మొదలుపెట్టారు. అన్నివర్గాల రైతు కుటుంబాలు తమ విలువైన, సారవంతమైన భూములు కోల్పోవడాన్ని జీర్ణించుకోలేకపోయారు. నిరంతరం ఏదో ఒక రకం పంటలు, పండ్ల తోటలతో పచ్చగా ఉండే తమ భూముల్ని ఇవ్వబోమని, ప్రభుత్వం చూపిన నష్టపరిహారపు ఆశలకు లొంగేది లేదని తెగేసి చెప్పారు. కానీ వీరి నిరసన గొంతులు వినిపించకుండా ప్రభుత్వం చూసింది. బైట నుంచి ఎవరూ మద్దతు రాకుండా, ఆగ్రామాల్లోకి ఎవరూ వెళ్లకుండా తీవ్రంగా అడ్డుకున్నది. అభివృద్ధి కోసం భూములు ఇవ్వాల్సిందేనని కొందరు దళారీల ద్వారా ప్రయత్నించింది.

అయితే అప్పటికే బళ్ళారి విమానాశ్రయం కోసం భూములు ఇవ్వకుండా 15 సంవత్సరాలుగా పోరాడుతున్న చాగనూరు సిరివర భూరక్షణ హెూరాట సమితి, AIKMKS అనుబంధ కర్ణాటక రాజ్య రైతు సంఘాలను తమకు అండగా రావాలని రైతులు ఆహ్వానించారు. వెంటనే ఆర్. మాధవరెడ్డి, స. రఘునాథల నేతృత్వంలో చెన్నరాయపట్న ధర్నా స్థలంకి వెళ్ళి పరిశీలించాం. నిరవధిక ధర్నా పోరాటం 25 రోజులకు చేరిన సందర్భంగా దేవనహళ్లి నుంచి చెన్నరాయపట్న ధర్నా స్థలానికి పాదయాత్ర చేయాలని నిర్ణయించాం. బళ్ళారి, ఇతర ప్రాంతాల నుంచి వెళ్ళిన 150 మంది రైతులంతా డప్పులు కొడుతూ, నినాదాలిస్తూ 13 గ్రామాల మధ్య నుంచీ ప్రచారం జరిగింది. "నమ్మభూమి నమ్మ తాయి" (మన భూమి మన అమ్మ), "వ్యవసాయం మన సొంతజీవన విధానం", భూమిని కోల్పోవద్దని చైతన్యం చేస్తూ, సభలు నిర్వహిస్తూ పాదయాత్ర సాగింది. మొదటిసారిగా జరిగిన ఈ కార్యక్రమం రైతులకు ప్రభుత్వ నిర్ణయాన్ని ఎదుర్కోవడానికి, మానసికంగా నిలబడడానికి ధైర్యాన్నిచ్చింది. పోరాటం కొనసాగుతూ 100 రోజులు అయిన సందర్భంగా పోరాటకమిటీ నాయకులు, KRRS నాయకత్వం కలిసి 10 గ్రామాలలో గ్రామ సభలు నిర్వహించారు. ఈ సభల ద్వారా తమ భూములు ఇచ్చేది లేదన్న ఏకగ్రీవ నిర్ణయాన్ని రైతులంతా ప్రభుత్వానికి తెలిపారు. అప్పటినుంచి అనేకరోజుల పాటు ఆ రైతులతో కలిసి మా సంఘం పోరాడుతూ వచ్చింది. 2024 మార్చి నెలలో కర్ణాటక గ్రామీణ బ్యాంకు అక్రమ వడ్డీలపై, వన్ టైమ్ సెటిల్ మెంట్ (OTS) కోసం బళ్లారిలో జరిగిన పెద్ద సభకు చెన్నరాయపట్న నుంచి ఈ రైతులు వచ్చి సంఘీభావంగా పాల్గొన్నారు. SKM ఆధ్వర్యంలో దక్షిణ భారత రైతునాయకుల సభ బెంగలూరు గాంధీభవన్‌లో జరిగింది. 2024 అక్టోబర్ 7, 8 తేదీలలో ఈ సభ జరిగే నాటికే భూస్వాధీన వ్యతిరేక కమిటీ తీవ్రమైన సంఘర్షణలో ఉంది. పట్టుదలతో రైతులు ముందుకు నడిచారు. ప్రారంభం నుంచి 1198 రోజుల వరకు వివిధ దశలలో జరిగిన పోరాటానికి AIKMKS అనుబంధ కర్ణాటక రాజ్య రైతు సంఘ అండగా నిలిచింది.

అప్పుడు ప్రతిపక్షంలో ఉన్న, ఇప్పటి ముఖ్యమంత్రి సిద్ధరామయ్యగారు తాము ఇచ్చిన మాట అధికారంలోకి వచ్చాక నిలబెట్టుకోకుండా భూసేకరణ జరిపితీరుతామని రెండు మూడునెలల క్రితం ప్రకటించడంతో పోరాటం ఇంకొంత తీవ్రరూపం దాల్చింది. రాష్ట్రవ్యాప్తంగానే కాకుండా దేశవ్యాప్తంగా ఈ పోరాటానికి సంఘీభావం పెరిగింది. వివిధ రైతుసంఘాలు, రాజకీయ పార్టీలు ఆఖరి పోరాటానికి సిద్ధపడ్డాయి. వివిధ దశల్లో ప్రభుత్వంతో చర్చలు నడిచాయి.

రాజీలు, ఎక్కువ నష్టపరిహారాలు కుదరవనీ రైతులు తెగేసి చెప్పి ప్రాణంపోయినా తమ భూములు ఇచ్చేది లేదని తెగువతో నిలిచారు. ఆ కారణంగానే కాంగ్రెస్ ప్రభుత్వం నోటిఫికేషన్‌ను రద్దుచేసుకున్నట్టు 15-7-2025న ప్రకటించింది. ఆ 13 గ్రామాల రైతులకు, అండగా వున్న కర్ణాటక ప్రాంత రైతులకు, దేశ్యాప్తంగా మద్దతు తెలిపిన రైతు నాయకులకు, మేధావులకు KRRS అభినందనలు తెలుపుతున్నది. పోరాడకుండా మన భూములను, మన వ్యవసాయాన్ని కాపాడుకోలేమని తెలియజేస్తున్నాం. భవిష్యత్తులో కూడా దేశవ్యాప్తంగా రైతులు, కూలీలు, వివిధ వృత్తులు చేసుకునేవారంతా కలిసికట్టుగా ఉండి కార్పొరేట్ కంపెనీలు, బహుళజాతి కంపెనీల నుంచి మన భూములను, జీవనాధారమైన వ్యవసాయాన్ని కాపాడుకోవడానికి ఐకమత్యంగా ఉంటూ బలమైన, నిజాయితీతో కూడిన, పోరాట పటిమ గలిగిన సంఘాల్లోకి సంఘటితమవ్వాలని కోరుతున్నాం.

*అభినందనలతో,*

15-7-2025

**ఆర్. మాధవరెడ్డి, రాజ్యాధ్యక్షులు**

**స. రఘునాథ, గౌరవాధ్యక్షులు**

**కర్ణాటక రాజ్య రైతు సంఘ - KRRS**

**(AIKMKS అనుబంధం)**

**చాగనూరు మల్లికార్జునరెడ్డి**

**చాగనూరు సిరివర భూరక్షణ హోరాట సమితి, బళ్ళారి**

# పోరాడి, భూములు నిలుపుకున్న రైతులకు జేజేలు

## - AIKMKS

బెంగుళూరు ఎయిర్‌పోర్టుకు దగ్గరలోని దేవనహళ్లి తాలూకా చెన్నరాయపట్టణ తదితర 13 గ్రామాల ప్రజలు గడచిన 3 సంవత్సరాల నుంచి కర్ణాటక ప్రభుత్వం ప్రకటించిన 1777 ఎకరాల భూసేకరణ నోటిఫికేషన్‌కి వ్యతిరేకంగా పట్టుదలతో సుదీర్ఘకాలంగా ఆందోళనలో వున్న విషయం అందరికీ తెలిసిందే. నిరంతరాయంగా 1200 రోజుల పాటు జరిగిన ఆందోళనలో ఆ గ్రామాల బాధిత ప్రజలే కాకుండా కర్ణాటకలో ఉన్న రైతు, రైతుకూలీ సంఘాలు, రాజకీయ పార్టీలు సంయుక్తంగా పాల్గొన్నాయి. వివిధ స్థాయిల్లో ప్రజల మద్దతుతో ఆందోళన చేసి సాధించిన ఈ విజయం దేశవ్యాప్తంగా రైతు ఉద్యమాలకు ప్రేరణ కల్గిస్తుంది. పాలక పార్టీలు ఏవైనప్పటికీ రైతాంగానికి ఆధారమైన వ్యవసాయ భూములను కారుచౌకగా కార్పొరేట్లకు ఇవ్వడం, రైతులనుంచి బలవంతంగా గుంజుకోవడం మామూలు విషయంగా మారిపోయింది. ఈ పరిస్థితుల్లో పట్టుదలతో చెన్నరాయ పట్టణ ప్రాంత రైతులు చేసిన పోరాటం, నోటిఫికేషన్‌ను వెనక్కి తీసుకునేలా చేయగలిగింది. AIKMKS మొదటి నుంచీ రైతులకు అండగా నిలిచింది. ఇప్పుడు మీ సంతోషంలో భాగం పంచుకుంటుంది. ఈ ఆందోళనలో పాల్గొన్న, సహకరించిన ప్రతిఒక్కరికీ అభినందనలు తెలుపుతున్నది.

*ఉద్యమాభినందనలతో,*

**S. ఝాన్సీ, కో - కన్వీనర్**

**AIKMKS**


కేంద్ర - రాష్ట్ర ప్రభుత్వాల
రైతాంగ, ప్రజావ్యతిరేక విధానాలను ఎండగడుతూ
కేంద్ర - రాష్ట్ర ప్రభుత్వాల
రైతాంగ, ప్రజావ్యతిరేక విధానాలను ఎండగడుతూ


కేంద్ర - రాష్ట్ర ప్రభుత్వాల
రైతాంగ, ప్రజావ్యతిరేక విధానాలను ఎండగడుతూ
కేంద్ర - రాష్ట్ర ప్రభుత్వాల
రైతాంగ, ప్రజావ్యతిరేక విధానాలను ఎండగడుతూ






A Publication of Rythu Coolie Sangham (A.P.)